ninadamnews.com



తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, ఆగస్టు 13, 2026 | సంపుటి - 22 | సంచిక 316 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

వివరాలు 2

**మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ**

**ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**

**మహారాష్ట్ర సిఎస్‌తో**

## తెలంగాణ సీఎస్ భేటీ

తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ



వివరాలు 2

# డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించండి





## మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయండి

### వారి బ్లాక్‌మెయిల్స్‌ను అసలు సహించొద్దు • పౌరసరఫరాల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

***సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.***

**హైదరాబాద్,ఆగస్టు12(నినాదం):**

బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్ కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండా లని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు.

▸▸తరువాయి2లో..



## సీఎంతో లెఫ్టినెంట్ జనరల్ భేటీ

- ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి
- అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

*ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్`ఇన్`చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు.*

2

**మాజీ జడ్జి యశ్వంత్ వర్మను**

## దోషిగా తేల్చిన కమిటీ

**పార్లమెంటరీ కమిటీ ప్యానల్ విచారణలో సంచలన విషయాలు వెల్లడి**



**న్యూఢిల్లీ,ఆగస్టు12(నినాదం):**

ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలారు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమేనని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు.

▸▸తరువాయి2లో..



**టాటా సన్స్ ఛైర్మన్ పదవికి**

## చంద్రశేఖరన్ రాజీనామా

**ఆరు నెలల ముందే తప్పుకున్న చంద్రశేఖరన్**

**న్యూఢిల్లీ,ఆగస్టు12(నినాదం):**

▸▸ 2లో..

టాటా సన్స్ ఛైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ ఛైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

## చర్చకు నేనెప్పుడూ సిద్ధమే

**• చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం • హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ,ఆగస్టు12(నినాదం):**

పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

▸▸తరువాయి2లో..

## తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి



- ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి

▸▸వివరాలు2లో..

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

- మేం టి హబ్‌ను తెస్తే.. వారు అనుముల హబ్స్‌తో దోపిడీ
- మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



▸▸వివరాలు2లో..

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు.**

## నీటివాటాలపై రాజీ.. ప్రసక్తి లేదు

- వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆరఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు.




**హైదరాబాద్,ఆగస్టు12(నినాదం):**

బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆరఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆరఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు.

▸▸తరువాయి2లో..

**రేణిగుంట విమానాశ్రయంలో**

## ఈ వీసా సేవలు

**తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త**

**తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ `వీసా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.**

▸▸వివరాలు5లో..

**అసెంబ్లీకి రాకుండా**

## జీతమంటే ఎలా ?

**సీట్లో ఉంటే హాజరు పడేలా చర్యలు**

**స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పష్టీకరణ**

**అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం సరికాదని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఈ నెల 17న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు స్పీకర్ తెలిపారు.**

▸▸వివరాలు5లో..

## వైసిపి హయాంలో గ్రూప్–1 పరీక్షలో అక్రమాలు



▸▸వివరాలు5లో..

- దీనిపై హైకోర్టుకు సిట్ నివేదిక అందచేత
- ఈ అక్రమాలపై వైసిపిని గట్టిగా నిలదీయాలి
- మంత్రులతో భేటీలో సిఎం చంద్రబాబు







# మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

న్యూఢిల్లీ, నినాదం:

భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం`ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ



ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డిఫాల్టర్ల మిల్లులను మహిళలకు అప్పగించండి

ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## మహారాష్ట్ర సిఎస్‌తో తెలంగాణ సీఎస్ భేటీ

హైదరాబాద్, నినాదం:

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ?2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ`మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

## టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల మందే చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి. గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి చైర్మన్‌గా వ్యవహరించారు.

# చర్చకు నేనెప్పుడూ సిద్ధమే

అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా వి డియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

## నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆరఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆరఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

హైదరాబాద్,ఆగస్టు12(నినాదం):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ`రన్.. ఫ్యామిలీ` డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. 'అనుముల హబ' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**న్యూఢిల్లీ,ఆగస్టు12(నినాదం):**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకట



నలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ`ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.


**స్టాండర్డ్ షూ సోల్ అండ్ మౌల్డ్ (ఇండియా) లిమిటెడ్**
CIN : L24119TS1973PLC199873
201 బి, 2వ అంతస్తు, షాంగ్రీల్లా ప్లాజా, రోడ్ నం 2, పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్, బంజారా హిల్స్, ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500034. ఫోన్: +91 63047 19944, ఇ-మెయిల్ : sssmil.1907@gmail.com (రూ. లక్షలలో)

**30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు స్వతంత్ర ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల సారాంశం**

| వివరములు | త్రైమాసికపు ముగింపు | | | సంవత్సర ముగింపు |
|---|---|---|---|---|
| | 30.06.2026 (ఆడిట్ కానివి) | 31.03.2026 (ఆడిట్ అయినవి) | 30.06.2025 (ఆడిట్ కానివి) | 31.03.2026 (ఆడిట్ అయినవి) |
| 1. ఆపరేషన్స్ నుండి మొత్తము ఆదాయము | - | - | - | - |
| 2. ప్రస్తుత కాలమునకు నికర లాభము/ (నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | (5.76) | (4.24) | (4.85) | (11.61) |
| 3. ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టం) పన్నుకు పూర్వము, (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | (5.76) | (4.24) | (4.85) | (11.61) |
| 4. ప్రస్తుత కాలమునకు నికర లాభము/ (నష్టం) పన్నుకు తర్వాత, (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | (5.76) | (4.24) | (4.85) | (11.61) |
| 5. ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయం (ప్రస్తుత కాలమునకు లాభము/ (నష్టము) కలిగి ఉంది (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయము (పన్ను తర్వాత)) | (5.76) | (4.24) | (4.85) | (11.61) |
| 6. చెల్లించిన ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 518.15 | 518.15 | 518.15 | 518.15 |
| 7. ఇతర ఈక్విటీ | - | - | - | (609.13) |
| 8. ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు : బేసిక్ మరియు డైల్యూటెడ్ | *(0.11) | *(0.08) | *(0.09) | (0.22) |

గమనికలు:
పైన తెలిపిన వివరమైన ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల సారాంశం సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్‌చేంజ్ వద్ద దాఖలు చేయబడినది. పైన తెలిపిన ఫలితముల పూర్తి సారాంశం స్టాక్ ఎక్స్‌చేంజ్ వెబ్‌సైట్ www.bseindia.com మరియు లిస్టెడ్ ఎంటిటీ www.sssmil.com లో లభించును మరియు ఇందులో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ కోడ్‌ను స్కానింగ్ చేయుట ద్వారా కూడా యాక్సెస్ చేయవచ్చును.

ఫలితాలు చూడదానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రదేశం: హైదరాబాద్
తేది : 12.08.2026

స్టాండర్డ్ షూ సోల్ అండ్ మౌల్డ్ (ఇండియా) లిమిటెడ్
సం/-
శ్రీ రాకేష్ కొల్ల
పూర్తి కాలపు డైరెక్టర్
DIN : 09785871



**గాయత్రి ప్రాజెక్ట్స్ లిమిటెడ్**
CIN: L99999TG1989PLC057289
నమోదిత కార్యాలయం: B1, TSR టవర్స్, 6-3-1090, రాజ్ భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082

**30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆడిట్‌కాని స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల నమూనా** (EPS మినహా, రూ.లక్షలలో)

| క్ర. సం. | వివరములు | స్వతంత్ర | | | ఏకీకృత | | |
|---|---|---|---|---|---|---|---|
| | | త్రైమాసికపు ముగింపు | | సంవత్సరపు ముగింపు | త్రైమాసికపు ముగింపు | | సంవత్సరపు ముగింపు |
| | | 30-06-2026 (ఆడిట్ కానివి) | 30-06-2025 (ఆడిట్ కానివి) | 31-03-2026 (ఆడిట్ అయినవి) | 30-06-2026 (ఆడిట్ కానివి) | 30-06-2025 (ఆడిట్ కానివి) | 31-03-2026 (ఆడిట్ అయినవి) |
| 1 | ఆపరేషన్స్ నుండి మొత్తము ఆదాయము (నికరము) | 22,877.35 | 7,658.34 | 84,689.18 | 22,877.35 | 7,658.34 | 84,689.18 |
| 2 | ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) పన్ను ముందు (పన్నుకు మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | 5,861.60 | (282.67) | 9,508.11 | 5,861.33 | (72.14) | 8,996.16 |
| 3 | ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) (పన్నుకు మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | 3,677.53 | (282.67) | 2,08,075.91 | 3,711.74 | (58.33) | 2,07,593.05 |
| 4 | ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) పన్నుల తర్వాత (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | 3,677.53 | (282.67) | 2,04,695.16 | 3,711.74 | (58.33) | 2,04,212.30 |
| 5 | ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయం (ప్రస్తుత కాలమునకు లాభము/ (నష్టము) కలిగియుండి) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయము (పన్ను తర్వాత) | 3,665.33 | (287.25) | 2,05,191.56 | 3,695.48 | (79.15) | 2,04,349.16 |
| 6 | ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 9,285.98 | 3,743.97 | 3,743.97 | 9,285.98 | 3,743.97 | 3,743.97 |
| 7 | రిజర్వులు (రివాల్యేషన్ రిజర్వు మినహాయించి) క్రితం సంవత్సరం ఆడిట్ అయిన బ్యాలెన్స్ షీట్‌లో చూపిన విధంగా | | | 54,156.19 | | | 56,943.90 |
| 8 | ఒక్కొక్క షేర్ నుండి ఆదాయములు (ఒక్కొక్కటి రూ. 2/- చొప్పున) (ఆపరేషన్స్ కొనసాగిన లేక కొనసాగక పోయినను) | | | | | | |
| | బేసిక్ & డైల్యూటెడ్ | 2.34 | (0.15) | 109.35 | 2.36 | (0.03) | 109.09 |

గమనిక : సెబి (లిస్టింగ్ & అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద త్రైమాసికపు ముగింపు **30 జూన్, 2026** కొరకు ఆడిట్ కాని స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనాను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో దాఖలు చేయడమైనది. **30 జూన్, 2026** కొరకు ఆడిట్ అయిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనానూ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్లు (www.nse-india.com/www.bseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.gayatri.co.in వద్ద కూడా లభ్యమగును.

ఫలితాలను వీక్షించడానికి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

బోర్డు ఉత్తర్వు ద్వారా
గాయత్రి ప్రాజెక్ట్స్ లిమిటెడ్ తరపున

ప్రదేశము: హైదరాబాద్
తేది: 12.08.2026

టి.వి. సందీప్ కుమార్ రెడ్డి
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
DIN : 00005573



**ఇన్‌ఫ్రోనిక్స్ సిస్టమ్స్ లిమిటెడ్**
INFRONICS SYSTEMS Delivering Excellence
CIN: L72200TG2000PLC033629
రిజిస్టర్డ్ ఆఫీస్: ప్లాట్ నం. 30, 31, బ్రిగేడ్ టవర్స్, వెస్ట్ వింగ్, 1వ అంతస్తు, నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500032, ఇండియా టెలి: +91-7207919111.
ఇ-మెయిల్: company@infronics.in వెబ్: www.infronics.in

**30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆడిట్ కానీ ఆర్థిక ఫలితాల సారాంశం** (రూ. లక్షలలో)

| క్ర. సం. | వివరములు | స్వతంత్ర | | | |
|---|---|---|---|---|---|
| | | త్రైమాసిక ముగింపు | త్రైమాసిక ముగింపు | సంవత్సర ముగింపు | సంవత్సర ముగింపు |
| | | 30-06-2026 ఆడిట్ కానీ | 31-03-2026 ఆడిట్ అయిన | 30-06-2026 ఆడిట్ కానీ | 31-03-2026 ఆడిట్ అయిన |
| 1. | ఆపరేషన్స్ నుండి మొత్తం ఆదాయం | 0.00 | 0.00 | 0.00 | 0.00 |
| 2. | ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టం) (పన్ను, మినహాయించిన మరియు/లేదా అసాధారణ ఐటములకు ముందు) | (16.18) | (16.22) | (17.07) | (73.54) |
| 3. | పన్నుకు పూర్వము ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టం) (మినహాయించిన మరియు/లేదా అసాధారణ ఐటములకు తరువాత) | (16.18) | (16.22) | (17.07) | (73.54) |
| 4. | పన్ను తరువాత ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టం) (మినహాయించిన మరియు/లేదా అసాధారణ ఐటములకు తరువాత) | (16.18) | (16.23) | (17.03) | (74.56) |
| 5. | ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (లాభము/(నష్టం) ప్రస్తుత కాలమునకు (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయము (పన్ను తరువాత) కలిగియున్నది) | (16.18) | (16.23) | (17.03) | (74.56) |
| 6. | ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 792.65 | 792.65 | 792.65 | 792.65 |
| 7. | రిజర్వులు (రివాల్యుయేషన్ రిజర్వు మినహా) గత సంవత్సరపు ఆడిట్ చేసిన బ్యాలెన్స్ షీట్‌లలో చూపిన విధంగా | | | | (532.51) |
| 8. | ఒక వాటాకు ఆదాయములు (ఒక్కొక్కటి రూ. 10/-) (ఆపరేషన్స్ కొనసాగుతున్న మరియు నిలిపివేయబడిన వాటి కొరకు) | | | | |
| | 1. బేసిక్: | (0.20) | (0.20) | (0.21) | (0.94) |
| | 2. డైల్యూటెడ్: | (0.20) | (0.20) | (0.21) | (0.94) |

గమనికలు:

1. SEBI (LODR) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 మరియు కంపెనీల చట్టం, 2013లోని షెడ్యూల్ IIIకు అనుగుణంగా, పైన పేర్కొన్న ఆర్థిక ఫలితాలను కంపెనీ తయారు చేసింది మరియు ఆడిట్ కమిటీచే సమీక్షించబడి, తదనంతరం 11 ఆగస్టు, 2026న జరిగిన తమ సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడ్డాయి. 30 జూన్ 2026 నాటి ముగింపు త్రైమాసికం కోసం చట్టబద్ధ ఆడిటర్లు పరిమిత సమీక్ష చేపట్టారు.
2. సవరించిన విధంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 కింద నిర్దేశించబడిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్ 34, "ఇంటెరిమ్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్" ("Ind AS 34")లో నిర్దేశించిన గుర్తింపు మరియు కొలత సూత్రాలకు అనుగుణంగా, దాని కింద జారీ చేయబడిన సంబంధిత నిబంధనలు మరియు భారతదేశంలో సాధారణంగా ఆమోదించబడిన ఇతర అకౌంటింగ్ సూత్రాలతో కలిపి ఆర్థిక ఫలితాలు తయారు చేయబడ్డాయి.
3. కంపెనీ ప్రాథమికంగా "ఐటీ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను" అందించే వ్యాపారంలో నిమగ్నమై ఉంది మరియు ఇతర కార్యకలాపాలన్నీ కంపెనీ యొక్క ప్రధాన కార్యకలాపాలకు అనుబంధంగా ఉంటాయి. తదనుగుణంగా, Ind AS 108 – "ఆపరేటింగ్ సెగ్మెంట్స్" ప్రకారం విడిగా నివేదించదగిన విభాగాలు ఏవీ లేవు.
4. మార్చి 31, 2026తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలు, పూర్తి మునుపటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ చేయబడిన గణాంకాలకు మరియు సంబంధిత మునుపటి ఆర్థిక సంవత్సరం యొక్క మూడవ త్రైమాసిక చివరి వరకు ప్రచురించబడిన సంవత్సరం-నుండి-తేదీ గణాంకాలకు మధ్య ఉన్న సర్దుబాటు గణాంకాలు. అంతేకాకుండా, సంబంధిత మునుపటి ఆర్థిక సంవత్సరం యొక్క మూడవ త్రైమాసిక చివరి వరకు ఉన్న గణాంకాలు కేవలం సమీక్షించబడ్డాయి కానీ ఆడిట్‌కు గురి చేయబడలేదు.
5. వివిధ బ్యాంకులకు SMS సేవలను అందించడానికి BSNLతో కంపెనీ కుదుర్చుకున్న కస్టమర్ కాంట్రాక్టులు 24-25 ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా ముగిసాయి మరియు ఆ కాంట్రాక్టులు తదనంతరం పునరుద్ధరించబడలేదు. ఫలితంగా, కంపెనీకి ప్రస్తుతం చురుకైన, ఆదాయాన్ని ఆర్జించే వ్యాపార కార్యకలాపాలు లేవు. జూన్ 30, 2026 నాటికి కంపెనీ వద్ద నగదు మరియు బ్యాంకు నిల్వలు ఉన్నాయి. అయితే, వివాదాస్పద విషయాలకు సంబంధించి బ్యాంకు ఖాతా నిల్వలు డెబిట్ పరిమితులు / స్తంభనకు లోబడి ఉన్నాయి, అందువల్ల, ఈ విషయం పరిష్కారమయ్యే వరకు అటువంటి నిల్వల తక్షణ వినియోగం పరిమితం చేయబడింది. యాజమాన్యం ఈ పరిమితిని పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది మరియు అనియంత్రిత నిల్వలు, ప్రస్తుత బాధ్యతలు మరియు రాబోయే పన్నెండు నెలల్లో తలెత్తే అంచనా బాధ్యతల ఆధారంగా కంపెనీ ద్రవ్య లభ్యత స్థితిని అంచనా వేస్తూనే ఉంది.
యాజమాన్యం ఒక సాంకేతిక ఉత్పత్తి యొక్క పరిశోధన మరియు అభివృద్ధి సహా, టెక్నాలజీ రంగంలో అవకాశాలను కూడా అన్వేషిస్తోంది. క్రియాశీలక నిర్వహణ ఒప్పందాలు లేకపోవడం, కొన్ని బ్యాంకు నిల్వల లభ్యత పరిమితంగా ఉండటం మరియు భవిష్యత్ వ్యాపార కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించిన అనిశ్చితిని పరిగణనలోకి తీసుకుంటే, ఒక ముఖ్యమైన అనిశ్చితి నెలకొని ఉంది, ఇది కంపెనీ ఒక కొనసాగుతున్న సంస్థగా కొనసాగే సామర్థ్యంపై గణనీయమైన సందేహాన్ని కలిగించవచ్చు.
కంపెనీ ప్రస్తుత వనరులు, పెండింగ్‌లో ఉన్న విషయాల ఆశించిన పరిష్కారం మరియు ప్రతిపాదిత భవిష్యత్ వ్యాపార కార్యక్రమాలపై యాజమాన్యం చేసిన అంచనా ఆధారంగా, ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలు ఒక కొనసాగుతున్న సంస్థ ప్రాతిపదికన తయారు చేయబడ్డాయి. ఒకవేళ కంపెనీ ఒక కొనసాగుతున్న సంస్థగా కొనసాగలేకపోతే అవసరమయ్యే ఆస్తులు మరియు అప్పుల ప్రస్తుత విలువలు లేదా వర్గీకరణకు ఎటువంటి సర్దుబాట్లు చేయబడలేదు.
6. గత సంవత్సరంలో, కంపెనీకి మెస్సర్స్ ముదునూరు లిమిటెడ్ నుండి జూలై 11, 2025 తేదీన ఒక డిమాండ్ నోటీసు అందింది. మార్చి 2023 మరియు ఏప్రిల్ 2025 మధ్య కాలానికి జారీ చేయబడినట్లు పేర్కొనబడిన ప్రొఫార్మా ఇన్‌వాయిస్‌ల ద్వారా మద్దతు ఇవ్వబడిన ఆరోపిత సేవల కోసం, రూ. 12,05,23,699/- మొత్తాన్ని క్లెయిమ్ చేస్తూ, అందులో రూ. 8,60,30,257 అసలు భాగం మరియు రూ. 3,44,93,442 వడ్డీ భాగం ఉన్నాయని ఆ నోటీసులో పేర్కొనబడింది.
కంపెనీ, జూలై 21, 2025 నాటి తన ప్రతిస్పందన ద్వారా, సదరు క్లెయిమ్‌ను అధికారికంగా వ్యతిరేకించింది మరియు దానికి సంబంధించి ఎటువంటి బాధ్యతను నిరాకరించింది. అక్టోబర్ 2022లో ముగిసిన మెస్సర్స్ ముదునూరు లిమిటెడ్‌తో ఉన్న చివరి వ్యాపార ఒప్పందం కింద ఉన్న అన్ని బాధ్యతలు పూర్తిగా పరిష్కరించబడ్డాయని, ఆ తర్వాత ఎటువంటి కొత్త ఒప్పందం లేదా ఏర్పాటు లేదని, మరియు డిమాండ్ నోటీసులో ప్రస్తావించిన ఇన్‌వాయిస్‌లకు అంగీకరించిన ఒప్పంద నిబంధనలు లేదా అమలు చేయదగిన ఏర్పాట్లు ఏవీ లేవని కంపెనీ పేర్కొంది. ఈ విషయం యొక్క తుది ఫలితాన్ని ప్రస్తుతం నిర్ధారించలేము, మరియు తలెత్తే ఏవైనా సంభావ్య బాధ్యతల కోసం ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలకు ఎటువంటి సర్దుబాట్లు చేయబడలేదు.
డిమాండ్ యొక్క సమర్థనీయతపై కంపెనీ ఆగస్టు 13, 2025 తేదీన ఒక న్యాయపరమైన అభిప్రాయాన్ని పొందింది. ఈ విషయం యొక్క వాస్తవాలు మరియు పొందిన న్యాయపరమైన అభిప్రాయం ఆధారంగా, దావాను వ్యతిరేకించడానికి కంపెనీకి సహేతుకమైన కారణాలు ఉన్నాయని మరియు ప్రస్తుతం ఎటువంటి కార్యాచరణ రుణం చెల్లించాల్సిన అవసరం లేదని యాజమాన్యం విశ్వసిస్తోంది. Ind AS 37, ప్రొవిజన్స్, కంటింజెంట్ లయబిలిటీస్ మరియు కంటింజెంట్ అసెట్స్ కింద ప్రొవిజన్‌ను గుర్తించాల్సిన అవసరం ఉన్న ప్రస్తుత బాధ్యత ఏదీ లేదని కూడా యాజమాన్యం తదుపరి నమ్ముతుంది. పైన పేర్కొన్న వాస్తవాలు మరియు పొందిన న్యాయ సలహా ఆధారంగా, Ind AS 37 కింద నిర్వచించిన విధంగా ప్రస్తుతం ఎటువంటి బాధ్యత లేదని యాజమాన్యం విశ్వసిస్తోంది, మరియు తదనుగుణంగా, ఈ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలలో ఎటువంటి ప్రొవిజన్ గుర్తించబడలేదు. అయితే, కొనసాగుతున్న వివాదం దృష్ట్యా, ఈ విషయాన్ని ఒక కంటింజెంట్ లయబిలిటీగా వెల్లడించడం జరిగింది. ఈ విషయం యొక్క తుది ఫలితాన్ని ప్రస్తుతం నిర్ధారించలేము, మరియు తలెత్తే ఏవైనా సంభావ్య బాధ్యతల కోసం ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలకు ఎటువంటి సర్దుబాట్లు చేయబడలేదు. ఈ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల ఆమోదం తేదీ వరకు ఈ విషయంలో ఎటువంటి ముఖ్యమైన పురోగతి జరగలేదు. ఈ వివాదం యొక్క తుది ఫలితం, ఏదైనా ఆర్థిక ప్రభావం ఉంటే దానితో సహా, ప్రస్తుతం నిర్ధారించబడలేదు. ఈ విషయం పరిష్కారం అయిన తర్వాత తలెత్తే ఏవైనా సంభావ్య బాధ్యతలకు సంబంధించి, ఈ ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలకు ఎటువంటి సర్దుబాట్లు చేయబడలేదు.
7. జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలు BSE లిమిటెడ్ వెబ్‌సైట్ (www.bseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్‌ల (www.infronics.in)లో అందుబాటులో ఉన్నాయి.

బోర్డు డైరెక్టర్ల ఆదేశానుసారం
ఇన్‌ఫ్రోనిక్స్ సిస్టమ్స్ లిమిటెడ్
సం/-
నీరద్ కుమార్ గాజుల
పూర్తి కాలపు డైరెక్టర్
DIN: 06810058

ప్రదేశం: హైదరాబాద్
తేది: ఆగస్టు 11, 2026

## పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank ...the name you can BANK upon!

### ఎఆర్ఎంబి సికింద్రాబాద్

103, 8-2-248-ఎ, మహర్షి హౌస్, రోడ్ నెం. 3, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, టెలిఫోన్: 040-23147060. ఇమెయిల్ ఐడి: cs8313@pnb.bank.in

**స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) నిబంధనల క్రింద చదవబడే విధంగా స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

ఈ నోటీసు ద్వారా ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/కుదవ పెట్టిన దిగువ తెలిపిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటార్/బ్యాంక్ వారి అధీకృత అధికారిచే నిర్మాణాత్మకముగా/భౌతికముగా/లాంఛనప్రాయముగా స్వాధీనం చేసుకొని సంబంధిత రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) నుండి బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి రావలసిన బకాయిలను రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన పట్టికలో తెలిపిన విధంగా తేదిన "ఎక్కడ ఎలా ఉందో అది అలా" "ఏది ఎలా ఉంటే అది అలా" మరియు "ఏదైతే ఉందో అది మొత్తం" పద్ధతిపై విక్రయించబడును. సంబంధిత ఆస్తులపై దిగువ పట్టికలో తెలిపిన విధంగా రిజర్వు ధర మరియు బయానా నిర్ణయించబడినది.

**సెక్యూర్డ్ ఆస్తుల యొక్క షెడ్యూల్**

| క్ర. సం. | బ్రాంచ్ పేరు / ఖాతా పేరు / రుణగ్రహీత/హామీదారుల పేరు & చిరునామా | తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరణ | ఎ) SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది బి) తేది: 31-07-2026 నాటికి రావలసిన బకాయి మొత్తం సి) SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(4) క్రింద స్వాధీనతా తేది డి) స్వాధీనతా స్వభావం | ఎ) రిజర్వు ధర బి) బయానా సి) బిడ్డు పెంపుదల మొత్తం | ఇ-వేలం తేది / సమయం | సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసినంత వరకు తాకట్టు రుణభారాల వివరాలు |
|---|---|---|---|---|---|---|
| 1 | ఖమ్మం (211220) రుణగ్రహీత-శ్రీ బయనేని శ్రీధర్ చిరునామా: 15-8-304/1, రోటరీ నగర్, రోడ్ నెం. 4, అర్బన్ పోలీస్ స్టేషన్ సమీపంలో, ఖానాపురం హవేలీ (రూరల్), ఖమ్మం- 507002. శ్రీమతి బి ఉదయని 15-8-304/1, రోటరీ నగర్, రోడ్ నెం. 4, అర్బన్ పోలీస్ స్టేషన్ సమీపంలో, ఖానాపురం హవేలి (రూరల్), ఖమ్మం- 507002. | ఉప జిల్లా రూరల్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా ఖమ్మం ప్రాదేశిక అధికార పరిధి క్రింద, ఖమ్మం రూరల్ మం॥ & జిల్లా, పెద్దతాండా గ్రామ పంచాయితీ, ఏదులాపురం గ్రా॥లోని రెవెన్యూ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్ వద్ద మొత్తం 800 చ॥గ॥లు లేదా దానికి సమానమైన 668.88 చ॥మీ॥ల విస్తీర్ణముతో 400 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన (ఒకదానికొకటి ఆనుకుని ఉండి, ఒకే సమగ్రమైన బ్లాక్‌గా ఏర్పడి ఉన్నాయి ప్రతిదాని పరిమాణం 50' * 72') ప్లాట్ నెం. 27 & 32 లలోని "లోటస్ టవర్స్"గా పేరు మార్చబడిన భవన సముదాయం ఆవరణలోని స్టిల్ట్ ఫ్లోర్‌లో కేటాయించబడిన ఒక కార్ పార్కింగ్ ఏరియాతో పాటు 24.56 చ॥గ॥ల స్థలంలో దామాషా ప్రకారం అవిభక్త వాటా కలిగిన 970 చ॥అ॥ల బిల్టప్ ఏరియా (కామన్ ఏరియాలు కలుపుకొని)తో మొదటి అంతస్తులోని నివాస ఫ్లాట్ నెం. 203 యావదాస్తి. **భూమి యొక్క సరిహద్దులు:** ఉత్తరం: 33' - అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెంలు. 26 & 33, తూర్పు: 30' అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: 30' అడుగుల వెడల్పు రోడ్డు. **ఫ్లాట్ యొక్క సరిహద్దులు:** ఉత్తరం: కారిడార్, దక్షిణం: ఖాళీ ప్రదేశం, తూర్పు: ఖాళీ ప్రదేశం, పడమర: ఖాళీ ప్రదేశం. **బయనేని శ్రీధర్ యొక్క పేరున ఉన్నది ఆస్తి ఐడి - PUNB21122025.** | ఎ) 04-07-2019 బి) రూ. 38,74,118.92 + తదుపరి వడ్డీ, ఛార్జీలు. సి) 08-11-2019 డి) లాంఛనముగా | ఎ) రూ. 19,80,000/- బి) రూ. 1,98,000/- సి) రూ. 25,000/- * బిడ్డింగ్ ఒక అత్యధిక ధర నుండి ప్రారంభమగును | 02-09-2026న 1100 గం॥ల నుండి 1600 గం॥ల వరకు | అధీకృత అధికారికి తెలిసిన సమాచారం మేరకు తాకట్టు రుణభారములు లేవు. అయినప్పటికి బిడ్డర్లు వారంతటవారే బిడ్డింగుకు పూర్వమే క్షుణ్ణముగా విచారించుకోవలెను. |
| 2 | కూకట్‌పల్లి (108110) మెస్సర్స్ అన్నదాత ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ చిరునామా: ఫ్లాట్ నెం. 103, లక్ష్మీ టవర్స్, బ్లాక్ బి, ఆంజనేయ నగర్, ప్లాట్ నెం. 413, రోడ్ నెం. 9, మూసాపేట్, హైదరాబాద్- 500018. మెస్సర్స్ అన్నదాత ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, యూనిట్: సర్వే నెం. 107/5, కాశ్యపురం గ్రామం, జె. పంగులూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523201. శ్రీమతి శ్రీలత ఆకెళ్ల (డైరెక్టర్ & హామీదారు), ప్లాట్ నెం. 66 & 67, యెండమూరి ఎం-గ్రీనరీ లేఅవుట్, ద్వారకా నగర్ దగ్గర, గాజులరామారం, హైదరాబాద్- 500055. శ్రీమతి సీతా మహాలక్ష్మి, లేట్ వి. రామాంజనేయులు యొక్క చట్టబద్ధ వారసురాలు, కాశ్యపురం గ్రామం, జె. పంగులూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523201. | ఎస్ఆర్ఓ అద్దంకిలోని రిజిస్ట్రేషన్ ఉప జిల్లా మార్యాపురం, కాశ్యపురం గ్రామ పంచాయితీ పరిమితుల క్రింద ప్రకాశం జిల్లా, జె. పంగులూరు మం॥, కాశ్యపురం గ్రా॥ వద్ద (భూ వినియోగ మార్పిడి సమయంలో సర్వే నంబరు ఉప-విభజన చేయబడింది మరియు దాని ఉప-విభజన నెం. 107/5బి) సర్వే నెం. 107/5లో విస్తీర్ణం 4840 చ॥గ॥లు లేదా 4046 చ॥మీ॥లతో 8008.34 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (10 అడుగుల ఎత్తుకు పైన), 648.85 చ॥అ॥ల ఆర్‌సిసి మెషినరీ హాల్ ఏరియా మరియు 810.95 చ॥అ॥ల కండెన్సర్ ట్యాంక్ ఏరియా కలిగి మొత్తం 9468.14 చ॥అ॥లతో కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: ధూలిపల్ల హనుమంత రావు భూమి, దక్షిణం: అద్దంకి నుండి రేనింగవరం రోడ్డు, తూర్పు: పల్లపోతు లక్ష్మీనారాయణ భూమి, పడమర: చల్లగుండ్ల నారాయణమ్మ భూమి. **మెస్సర్స్ అన్నదాత ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధిగా దాని మేనేజింగ్ డైరెక్టర్ లేట్ సిహెచ్ వాదవల్లి రామాంజనేయులు తండ్రి లేట్ శ్రీ వి రామకృష్ణయ్య పేరున ఉన్నది ఆస్తి ఐడి - PUNB108110AAGS** | ఎ) 01-01-2024 బి) రూ. 2,31,64,872.21 + తదుపరి వడ్డీ, ఛార్జీలు. సి) 24-04-2024 డి) భౌతికముగా | ఎ) రూ. 1,52,32,000/- బి) రూ. 15,23,200/- సి) రూ. 1,00,000/- * బిడ్డింగ్ ఒక అత్యధిక ధర నుండి ప్రారంభమగును | 02-09-2026న 1100 గం॥ల నుండి 1600 గం॥ల వరకు | అధీకృత అధికారికి తెలిసిన సమాచారం మేరకు తాకట్టు రుణభారములు లేవు. అయినప్పటికి బిడ్డర్లు వారంతటవారే బిడ్డింగుకు పూర్వమే క్షుణ్ణముగా విచారించుకోవలెను. |

**ఈ నోటీసును సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ప్రకారం ఆస్తుల విమోచన కోసం జారీ చేసిన నోటీసుగా కూడా పరిగణించాలి.**

**ఇ-వేలం నోటీసు యొక్క నియమనిబంధనలు**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని నిర్దేశించిన నియమ నిబంధనలకు & తదుపరి నిబంధనలకు లోబడి అమ్మకం ఉండును.

(1) సదరు ఆస్తులను **"ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అది అక్కడ అలానే" మరియు "ఏది ఎలా ఉందో అది అలా" మరియు "ఏదైతే ఉందో అది మొత్తం"** ప్రాతిపదికన విక్రయించబడును.

(2) పైన తెలిపిన షెడ్యూల్‌లో నిర్దేశించిన సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు అధీకృత అధికారికి తెలిసిన సమాచారం మేరకు తెలుపబడినవి. కానీ అధీకృత అధికారి ఈ ప్రకటనలో ఏదేని తప్పిదము, అసంబద్ధత లేదా వైఫల్యములకు జవాబుదారి కాదు.

(3) అమ్మకం ఇ-వేలం ప్లాట్‌ఫారం వెబ్‌సైట్ **https://baanknet.com** ద్వారా పైన తెలిపిన తేదీలలో దిగువ సంతకముదారుచే నిర్వహించబడును.

4) అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు **https://pnb.bank.in, www.baanknet.com** ను రెఫర్ చేయగలరు.

తేది: 12-08-2026, ప్రదేశము: హైదరాబాద్ — అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెక్యూర్డ్ క్రెడిటార్

---

## SMFG ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

SMFG Grihashakti — Nayi Asha. Naya Vishwas.

కార్పొరేట్ కార్యాలయం: 503 &504, 5వ అంతస్తు, జి-బ్లాక్, ఇన్‌స్పైర్ బికెసి, బికెసి మెయిన్ రోడ్, బాంద్ర కుర్లా కాంప్లెక్స్, బాంద్ర (ఈ), ముంబయి-400051, మహారాష్ట్ర. రిజిస్టర్డ్ కార్యాలయం: కామర్‌జోన్ ఐటి పార్క్, టవర్ బి, 1వ అంతస్తు, నెం. 111, మౌంట్ పూనమల్లీ రోడ్, పోరూర్, చెన్నై-600116, తమిళనాడు.

**డిమాండ్ నోటీస్**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్")లోని నిబంధనల క్రింద.

**ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** (ఇకపై ఎస్ఎంహెచ్ఎఫ్‌సిగా పిలువబడుతుంది) వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు చట్టం క్రింద మరియు రూల్ 3తో చదువబడుతూ చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకొని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా సంబంధిత నోటీసు(లు)లో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించమని దిగువ రుణగ్రహీత(ల)ను కోరుతూ చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు(లు)ను జారీచేసినారు. దిగువ సంతకందారు రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(ల)ను ఉద్దేశ్యపూర్వకంగా అందుకోనట్లు భావించినారు అందువలన నోటీసును రూల్స్ ప్రకారం అతికించబడింది మరియు ప్రచురణ ద్వారా అందజేయబడింది. డిమాండ్ నోటీసు(ల)లోని సారాంశము దిగువ తెలుపబడినవి.

| క్ర. సం. | కేసును బట్టి ఆస్తి హోల్డర్లుగా రుణగ్రహీత /సహ-రుణగ్రహీతల పేరు & రుణ ఖాతా నెం. | సెక్యూర్డ్ ఆస్తులు/తనఖా పెట్టిన ఆస్తి వివరణ | సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తం |
|---|---|---|---|
| 1 | రుణ ఖాతా నం. 605639511857517 1. అజయ్ బాబు గుండోజీ 2. అరకుల స్రవంతి చిరునామా: తండ్రి వెంకట స్వామి, ఇంటి నెం. 19-10-126, ఎస్‌సి కాలనీ, వాటర్ ట్యాంక్ దగ్గర, రంగసాయిపేట్, వరంగల్, తెలంగాణ-506005. ఇక్కడ కూడా: మహాలక్ష్మి క్లాత్ స్టోర్ ప్రతినిధిగా దాని ప్రొప్రైటర్ అజయ్ బాబు గుండోజీ, ఇంటి నెం. షాప్ నెం. 18-9-99, బొమ్మగడ్డి, కరీమాబాద్, ఖిలా, వరంగల్, తెలంగాణ. | సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయము వరంగల్ ఫోర్ట్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ పరిధి మరియు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిమితులలోని వరంగల్ జిల్లా & సిటీ, రంగసాయిపేట్, వాటర్ ట్యాంక్ దగ్గర, మాలవాడ వీధి వద్ద జిడబ్ల్యుఎంసి ఇంటి నెం. 19-10-126/ఎ/1 (కొత్తది), జిడబ్ల్యుఎంఎస్ ఇంటి నెం. 19-10-126 (భాగము) (పాతది) లోని 96.49 చ॥గ॥లు దానికి సమానమైన 80.67 చ॥మీ॥ల విస్తీర్ణముతో 514.00 చ॥అ॥ల ఆర్‌సిసి రూఫ్ ప్లింత్ ఏరియాతో ఖాళీ స్థలంతో కూడిన ప్రస్తుతమున్న ఆర్‌సిసి రూఫ్ గృహము ఆస్తి యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: 12'-0" వెడల్పు రోడ్డు, పడమర: దాతకు చెందిన ఇంటి నెం. 19-10-126 లోని మిగిలిన భాగం మరియు బుచ్చయ్య ఇల్లు, దక్షిణం: 9'-0" సందు. ఉత్తరం: కె. నరసయ్య ఇంటి నెం. 19-10-127 మరియు దాతకు చెందిన ఇంటి నెం. 19-10-126 లోని మిగిలిన భాగం. | 21.07.2026 11.07.2026 నాటికి రూ. 12,38,276.40 (రూపాయలు పన్నెండు లక్షల ముప్పై ఎనిమిది వేల రెండు వందల డెబ్బై ఆరు మరియు పైసలు నలభై మాత్రమే) ఎన్‌పిఎ తేది: 06.07.2026 |
| 2 | రుణ ఖాతా నం. 616239511962708 1. గడ్డం శ్రీనివాస్ గౌడ్ 2. గడ్డం లావణ్య చిరునామా: తండ్రి బక్కయ్య గౌడ్, ఫ్లాట్ నెం. 5 & 6, 1వ అంతస్తు, వెంకటేశ్వర నగర్, ఎక్స్‌టెన్షన్-2, జెబిఆర్ హై స్కూల్ దగ్గర, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500062. ఇక్కడ కూడా: ఆర్ఆర్ అసోసియేట్స్, శ్రీ సుముఖ డెవలపర్స్ ప్రతినిధిగా దాని ప్రొప్రైటర్ ఫ్లాట్ నెం. 5 & 6, వెంకటేశ్వరనగర్, ఓల్డ్ అల్వాల్, సరిల్‌గూడ, జెబిఆర్ హై స్కూల్ దగ్గర, హైదరాబాద్, తెలంగాణ-500062. | జిల్లా & రిజిస్ట్రేషన్ జిల్లా: మేడ్చల్ మల్కాజ్‌గిరి, రిజిస్ట్రేషన్ ఉప జిల్లా శామీర్‌పేట, శామీర్‌పేట మం॥, గ్రామము & గ్రామపంచాయతీ: మజీద్‌పూర్ వద్ద రెఫరెన్స్ నెం. 800/2005/హెచ్ఆర్ఓ/హెచ్1, ఆర్.డి.డి.టి.పి. హైదరాబాద్, తేది. 21-10-2005, ఎల్.పి. నెం. 51/2005 లోని సి.నెం. 3533/2005/హెచ్2 ప్రకారం ప్రజయ్ హోమ్స్‌లోని సర్వే నెంలు. 40, 57 భాగము, 57/1, 57/2, 58, 65, 68 & 70 లలో ఉన్న రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కవమ్ జిపిఎ డాక్యుమెంట్ నెం. 7171 ఆఫ్ 2021 లో పేర్కొన్న విధంగా యజమాని వాటా అయిన 41% భాగంలో మొత్తం 429.0 చ॥గ॥ల విస్తీర్ణంలో 30.0 చ॥గ॥ల విస్తీర్ణము గల భూమి అవిభాజ్యవాటాతో పాటు కామన్ ఏరియాలు మరియు కార్ పార్కింగ్ కలుపుకొని 900 చ॥అ॥ల బిల్టప్ ఏరియా కలిగి ఉన్న ఫ్లాట్ నెం. 202 & 203 లలోని వివిఎస్ చంద్ర సింధూర్‌లోని నాల్గవ అంతస్తులోని నెం. 401 (పడమటి ఫేసింగ్) గల సగం పూర్తైన 2బిహెచ్‌కె నివాస ఫ్లాట్ యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** కారిడార్ & పొరుగువారి ఫ్లాటు. | 21.07.2026 11.07.2026 నాటికి రూ. 20,28,230.90 (రూపాయలు ఇరవై లక్షల ఇరవై ఎనిమిది వేల రెండు వందల ముప్పై మరియు పైసలు తొంభై మాత్రమే) ఎన్‌పిఎ తేది: 06.07.2026 |
| 3 | రుణ ఖాతా నం. 606139212001582 1. నలవపాని మధన్ మోహన్ రెడ్డి 2. నలవపాని రాఘవ రెడ్డి చిరునామా: తండ్రి నలవపాని రాఘవ రెడ్డి, విల్లా నెం. 87, ఫేజ్-1, సాకేత్ భూ సత్య, గౌడరొల్లి గ్రామం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, అయోధ్య సర్కిల్ దగ్గర, హైదరాబాద్, తెలంగాణ-501401. శ్రీ రాఘవ రెడ్డి ఆగ్రో ఫామ్స్ ప్రతినిధిగా దాని ప్రొప్రైటర్ నలవపాని మధన్ మోహన్ రెడ్డి, వీధి ఎన్‌టిఆర్ మరియు కెఎల్ఆర్ నగర్, ఫ్లాట్ నెం. 42, ఫేజ్ 2బి, సర్వే నెం. 92, 93, 159 మరియు 160, శివాజీ విగ్రహం దగ్గర, మేడ్చల్ మల్కాజ్‌గిరి, శివాజీ విగ్రహం పక్కన, హైదరాబాద్, తెలంగాణ-500047. | తెలంగాణ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మేడ్చల్ మం॥, మేడ్చల్ మున్సిపాలిటీ క్రింద మేడ్చల్ గ్రా॥ వద్ద హెచ్.ఎం.డి.ఎ. వారి అనుమతి నెం: 19/Mp2/Lo/Hmda/2013, తేది 28-09-2013 ద్వారా అనుమతించబడిన లే-అవుట్ క్రింద సర్వే నెం: 153(పి), 155, 156, 157 & 158 లలోని (ఏ వార్డు మరియు బ్లాక్ పరిధిలోకి రాదు) ప్లాట్ నెంలు. 18 & 19/భాగము (దక్షిణం వైపు పోర్షన్) పై 42.86 చ॥గ॥ల (478.0 చ॥గ॥లలోనిది) విస్తీర్ణము గల భూమి అవిభాజ్యవాటాతో పాటు ఆర్.సి.సి. (కామన్ ఏరియా & కార్ పార్కింగ్ కలుపుకొని) లేదా 1394.0 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో ధరణి ఎలైట్ అని పిలువబడే అపార్ట్‌మెంట్‌లోని మొదటి అంతస్తులోని నెం. 101 గల సగం పూర్తైన ఫ్లాట్ యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ఫ్లాట్ నెం. 19/భాగము, **దక్షిణం:** ఫ్లాట్ నెం. 17, **తూర్పు:** 40'-0" వెడల్పు రోడ్డు, **పడమర:** ఫ్లాట్ నెంలు. 23 & 22. **ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** కారిడార్ & స్టెయిర్‌కేస్, **తూర్పు:** కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశం. | 21.07.2026 11.07.2026 నాటికి రూ. 49,62,108.44 (రూపాయలు నలభై తొమ్మిది లక్షల అరవై రెండు వేల నూట ఎనిమిది మరియు పైసలు నలభై నాలుగు మాత్రమే) ఎన్‌పిఎ తేది: 06.07.2026 |

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(ల)కు అనుగుణంగా అందులో తెలిపిన డిమాండ్ చేసిన మొత్తాన్ని మరియు విడిపించుకునే తేదీ వరకు వర్తించు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, వ్యయం మరియు ఖర్చులతో ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కోరబడుతున్నారు. రుణగ్రహీత(లు) తమ యొక్క సెక్యూర్డ్ స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **SMHFC** కంపెనీ వద్ద తనఖా పెట్టి రుణము పొందియున్నారని గమనించగలరు. రుణగ్రహీత(లు) నిర్ణీత సమయములో బకాయి మొత్తం తిరిగి చెల్లించడములో విఫలమైనచో **SMHFC** తమకు రావలసిన రుణ బకాయి మొత్తమును వసూలు చేసుకొనటానికి చట్టములోని సెక్షన్ 13(4) క్రింద గల అధికారాలను ఉపయోగించుకొని తనఖా పెట్టబడిన సెక్యూర్డ్ స్థిరాస్తులను స్వాధీనము చేసుకొనడానికే పరిమితం కాకుండా అట్టి ఆస్తులను అమ్మడం ద్వారా బదిలీ చేయడానికి లేదా చట్టములోని ఏ ఇతర మార్గానైన అనుసరించడానికి అధికారం కలిగి ఉంటుంది. అంతేకాకుండా సదరు ఆస్తి అమ్మడానికి లేదా బదిలీకి ముందే సెక్యూర్డ్ ఆస్తి(ల)ను **అటాచ్ మరియు/లేదా సీలు** చేయుటకు **SMHFC** అధికారం కలిగి ఉంది. సెక్యూర్డ్ ఆస్తి(ల) అమ్మకం తరువాత తనఖాపెట్టిన ఆస్తుల విలువ **SMHFC** వారికి చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి సరిపోకపోతే మిగిలిన బకాయిలను రాబట్టుకొనుటకు విడి చట్ట పరమైన చర్యలను ప్రారంభించుటకు **SMHFCకు** హక్కు కలదు. ఈ రెమిడి ఏదేని ఇతర చట్టం క్రింద **SMHFCకి** లభించు అన్ని ఇతర రెమిడీలకు అదనంగా మరియు స్వతంత్రంగా ఉంటుంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద రుణగ్రహీత(ల) అప్రమత్తతను ఆహ్వానించడమైనది. తదుపరిగా చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద **SMHFC** వారి ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా సెక్యూర్డ్ ఆస్తి(ల)లో దేనినైన అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ కార్యకలాపాలు మినహా) ద్వారా బదిలీ చేయుటకు లేదా సెక్యూర్డ్ ఆస్తి(ల) వ్యవహరించుటకు లేదా డిస్పోజింగ్ నుండి రుణగ్రహీత(లు) అనర్హులు/నిషేధించబడినారు మరియు పై విషయాలను పాటించనట్లయితే సదరు చట్టంలోని సెక్షన్ 29 క్రింద శిక్షార్హులు. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకందారు వద్ద లభించును మరియు రుణగ్రహీత(లు) కోరినట్లయితే వారు సాధారణ కార్యాలయ పనివేళలలో ఏదేని పనిదినమున దిగువ సంతకందారు నుండి వాటిని తీసుకోవచ్చును.

సం/-

ప్రదేశం: వరంగల్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, తెలంగాణ, — అధీకృత అధికారి,

తేది: 21.07.2026 — ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

---

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE: AT:CITY CIVIL COURT: AT: HYDERABAD

O.S.No. 2316 of 2026

Between:
B.RAM BABU and 2 others ...Plaintiffs

AND

The MRO/Tahsildar Shaikpet & all concerned ...Defendants

**NOTICE**

Whereas the above named plaintiffs have filed the above suit TO DECLARE THE PLAINTIFFS AS LEGAL HEIRS OF LATE Sri BODDULURI VIJAYA LAKSHMI. The said is coming for your appearance on 03-09-2026. Hence, you are hereby informed to appear before the above said court on 03-09-2026 at 10.30 AM, either in person or through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided according to law.

// By Order of the court //
(ANU PRASAD REDDY G)
Advocate
Ph: 9505965541
Flat no.402, SSS Almas Heights,
Puppalaguda, Manikonda,
HYD-500089.

---

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD.

O.S.NO. 2298 of 2026

Between:
1. Alla Hemalatha w/o Late A. Sivarama- Krishna Reddy, aged 63 YIS,Occ:Housewife,
2. Alla Gnanitha D/o Late A. Sivaramakrishna- Reddy, aged 32 Yrs, Occ:Housewife,
3. Alla Sai Sree D/o Late A, Sivaramakrishna- reddy, aged 30 Yrs, Occ:Pvt.employee,
All are residing at H.No.8-3-167/A/4, Vikaspuri – Colony, Neer A.G.Colony, SR Nayar post, Hyderabad-038. ....Plaintiffs.

AND

1. The Tansildar, Khairtabad Mandal, Hyderabad, and another ...Defendents.

To
All Concerned.

Notice is hereby given that the above named plaintiffs have filed the above suit seeking Declaration that they are the Legal heirs of Late A. Sivarama Krishna Reddy, who died on **24-4-2026**. The caseis posted on **2-9-2026 at 10.30 a.m.** before the Hon'ble Court, any person having objection or claiming any right, title or interest in the suit properties, may appear before the Hon'ble Court on the said date, failing which the matter will be decided in accordence with Law.

//BY ORDER OF THE COURT//
M/S T.M.VANI,
Advocate & Associates,
H.No.7-2-1087/76/2, Sanathnagar,
Hyderabad-T. S.
CELL:9959501779.

---

# తెలంగాణ జౌళి రంగ అభివృద్ధికి శ్రీరామ్ ఫైనాన్స్ 'శ్రీ సంపర్క్' కార్యక్రమం





**హైదరాబాద్, ఆగస్టు 12 (నినాదం):** తెలంగాణలోని దుస్తులు మరియు జౌళి పరిశ్రమ పురోగతిని ప్రోత్సహించేందుకు ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్బీఎఫ్సీ) శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) 'శ్రీ సంపర్క్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. వ్యాపార వృద్ధి వ్యూహాలు మరియు మూలధన సదుపాయం వంటి కీలక అంశాలపై పరిశ్రమ నిపుణుల అవగాహనను అందించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. హైదరాబాద్, పోచంపల్లి, గద్వాల వంటి ప్రాంతాల్లో విస్తరించిన సమర్థవంతమైన జౌళి వ్యవస్థ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిస్తోందనీ, ఈ క్రమంలో తయారీ యూనిట్లు, హోల్‌సేలర్లు, వ్యాపారులు, రిటైలర్లు, ఎగుమతిదారులతో కూడిన మొత్తం పరిశ్రమ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మద్దతు అందించేందుకు శ్రీరామ్ ఫైనాన్స్ కట్టుబడి ఉందని శ్రీ రాం ఫైనాన్స్ తెలిపింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ 'శ్రీ సంపర్క్' కార్యక్రమంలో 100కు పైగా కంపెనీల ప్రతినిధులు, వ్యాపార నిపుణులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ చేనేత, జౌళి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దూదం వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరవ్వగా, తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం సహాయ సంచాలకులు (ఫైనా న్స్) జె. కళింగ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. పరిశ్రమ భవిష్యత్తు వృద్ధి అవకాశాలపై నిర్వహి ంచిన ప్యానెల్ చర్చలో వి. ప్రవీణ్, కల్పనా రావు, పల్లవి జోషి, ప్రకాష్ అమ్మనబోలు మరియు లవకుమార్ భారత్ పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఫైనాన్స్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు బిజినెస్ హెడ్ వి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, శ్రీ సంపర్క్ ద్వారా జ్ఞానం, నెట్‌వర్కింగ్ మరియు ఆర్థిక సాధికారతను అందించే ఒక ఉత్తమ వేదికను సృష్టించడం తమ లక్ష్యమని తెలిపారు. వ్యాపార యజమానులు పరస్పరం ఆలోచనలు పంచుకోవడానికి, నిపుణుల నుంచి నేర్చుకోవడానికి మరియు సుస్థిర వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ ప్రొడక్ట్ హెడ్స్‌గా సతీష్ కుమార్ మరియు శ్రీనివాస్ రెడ్డి సంస్థ తరఫున ప్రాతినిధ్యం వహించారు. కాగా 1979లో స్థాపించబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కన్స్యూమర్ ఫైనాన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్, స్టాక్ బ్రోకింగ్ మరియు డిస్ట్రిబ్యూషన్ రంగాలలో విస్తరించిన శ్రీరామ్ గ్రూప్‌లో ప్రధాన కంపెనీగా కొనసాగుతోంది. ?3 ట్రిలియన్లకు పైగా నిర్వహణలోని ఆస్తులతో (ఏయూఎం) భారతదేశంలోనే అతి పెద్ద రిటైల్ అసెట్ ఫైనాన్సింగ్ ఎన్బీఎఫ్సీ లలో ఒకటిగా నిలిచింది. గత 47 ఏళ్లుగా చిన్న రోడ్డు రవాణాదారులు మరియు చిన్న వ్యాపారుల అవసరాలను తీరుస్తున్న ఈ సంస్థ, కమర్షియల్ వాహనాలు, టూ వీలర్లు, ప్యాసింజర్ వాహనాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు, గోల్డ్ లోన్స్, పర్సనల్ లోన్స్ మరియు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 3,225 శాఖల నెట్‌వర్క్‌తో శ్రీరామ్ ఫైనాన్స్ తన సేవలను విస్తరించింది.

---

## సూర్యావన్షీ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్

Suryavanshi — CIN. L14220TG1978PLC002390

నమోదిత కార్యాలయం : సూర్యా టవర్స్, 105, 6వ అంతస్తు, ఎస్.డి. రోడ్, సికింద్రాబాద్- 500003. ఫోన్ నెం.91-04027843333, ఇ-మెయిల్ ఐడి : info@suryavanshi.com, వెబ్‌సైట్ : www.suryavanshi.com

**30.06.2026 నాటి త్రైమాసిక ముగింపు కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల నమూనా** (రూ.లక్షలలో)

| క్ర. సం. | వివరములు | త్రైమాసికపు ముగింపు 30-06-2026 ఆడిట్ కానివి | త్రైమాసికపు ముగింపు 31-03-2026 ఆడిట్ అయినవి | త్రైమాసికపు ముగింపు 30-06-2025 ఆడిట్ కానివి | సం॥ ముగింపు 31-03-2026 ఆడిట్ అయినవి |
|---|---|---|---|---|---|
| 1 | ఆపరేషన్స్ నుండి మొత్తం ఆదాయం (నికరం) | 219.61 | 177.13 | 135.60 | 700.00 |
| 2 | నికర లాభం/(నష్టం) ప్రస్తుత కాలమునకు (పన్ను, మినహాయించిన మరియు/లేదా అసాధారణ ఐటమ్‌లకు ముందు) | 35.79 | -13.18 | 18.12 | 162.89 |
| 3 | నికర లాభం/(నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 18.35 | -34.32 | 18.12 | 158.54 |
| 4 | నికర లాభం/(నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుల తరువాత (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 18.35 | -60.62 | 18.12 | 132.24 |
| 5 | ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (లాభం/(నష్టం) ప్రస్తుత కాలమునకు కలిగియున్నది. (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)) | 18.35 | -67.78 | 18.12 | 125.08 |
| 6 | ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 490.86 | 490.86 | 490.86 | 490.86 |
| 7 | రిజర్వులు (క్రితం సంవత్సరం బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లు రీవాల్యుయేషన్ రిజర్వు మినహాయించి) | | | | |
| 8 | ఒకొక్క షేర్‌కు ఆదాయములు (వార్షికం కానిది) బేసిక్ : (రూ.) | 0.37 | -1.23 | 0.37 | 2.69 |
| | డైల్యూటెడ్ : (రూ.) | 0.37 | -1.23 | 0.37 | 2.69 |

**గమనికలు:** పైన తెలిపిన ఫలితాల యొక్క వివరణాత్మక త్రైమాసికపు ఆర్థిక ఫలితాల నమూనాను SEBI (లిస్టింగ్ అండ్ అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్ వద్ద దాఖలు చేయడమైనది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా **www.bseindia.com** మరియు **www.aanandalakshmi.com** లో లభించును.

డైరెక్టర్ల బోర్డు తరపున మరియు కొరకు సూర్యావన్షీ స్పిన్నింగ్ మిల్స్ లిమిటెడ్

సం/-
రాజేంద్ర కుమార్ అగర్వాల్
DIN : 00041892
మేనేజింగ్ డైరెక్టర్

ప్రదేశము: సికింద్రాబాద్
తేది: 12.08.2026

---

# ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదు

- బీఆర్ఎస్ నేతలు



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 12 (నినాదం):** సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందిం చారు. కాంగ్రెస్ నేతలు అతిఉత్సాహంతో, స్థాయికి మించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలకు ఘాటైన కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి అంటే గుర్తొచ్చే పేరు చింత ప్రభాకర్ అని సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విశేష కృషి చేశారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో సుమారు రూ.822 కోట్లతో, సదాశివపేట పట్టణంలో సుమారు రూ.264 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై ఎవరికైనా సందేహాలు ఉంటే సంగారెడ్డి, సదాశివపేటలో ఆధారాలతో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామనిలి, కాంగ్రెస్ నేతలు కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలు కాకుండా అభివృద్ధి అంశాలపై మాట్లాడితే తాము సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కరోనా సమయంలో ప్రజల మధ్య ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడు చింత ప్రభాకర్. మా నాయకుడిని విమర్శించే ముందు మీ స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడండి. మేము కూడా మీకంటే ఎక్కువగా మాట్లాడగలం. కానీ వ్యక్తిగతంగా దూషించడం మా నాయకుడు మాకు నేర్పలేదు. పద్ధతిగా, గౌరవంగా మాట్లాడాలని ఆయన సూచించారు అని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన సమయంలోనూ చింత ప్రభాకర్ ప్రజలకు దూరంగా ఉండలేదని, కలెక్టరేట్ ఎదుట క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుని ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. "లిమీ నాయకుడు ఐబీని గాంధీభవన్‌గా మార్చుకున్నారు. అభివృద్ధిపై మాట్లాడండి.. మేము కూడా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం అని అన్నారు. అలాగే సంగారెడ్డికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ నేతలు వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ హైదరాబాద్‌ను జగ్గారెడ్డి తీసుకొచ్చారని చెబుతున్నప్పుడు, దానికి 'ఐఐటీ సంగారెడ్డి' అనే పేరు ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజీవ్ పార్క్ అభివృద్ధి విషయంలో కూడా గతంలో హామీలు ఇచ్చి, ప్రభుత్వాలు మారినా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. మా నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుని సంగారెడ్డి అభివృద్ధిపై దృష్టి పెట్టండి. మీ గత చరిత్ర, మీ పాలనపై కూడా మా దగ్గర పూర్తి సమాచారం ఉందిలి. లిఅవసరమైతే ఆధారాలతో మాట్లాడతాం. విమర్శలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి అని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎవరు ఏ సమయంలో ఏ విధంగా మాట్లాడారో ప్రజలకు తెలుసని, ముందుగా జై తెలంగాణ' నినాదం విషయంలో తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ ప్రజల కోసం చేసిన అభివృద్ధి పనులు, ప్రజలతో ఉన్న అనుబంధమే శాశ్వతం,వ్యక్తిగత విమర్శలు కాకుండా అభివృద్ధిపై చర్చకు రండి.. సంగారెడ్డి అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు మేము సిద్ధం అని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఎస్కే రషీద్, అక్బర్ హుస్సేన్, కసిని శ్రీకాంత్ , మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, లతీఫ్, జాఫర్, అజ్జు, మజీద్, విష్ణు, నజీం, ఖలీమ్ పటేల్, సమద్, ఖమీల్, కుద్దుష్, వహాబ్, వాజిద్, చింటూ, శ్రవణ్ రెడ్డి , అఖిల్, తదితరులు ఉన్నారు.

---

## చేవెళ్ళ బ్రాంచ్

बैंक ऑफ़ इंडिया Bank of India BOI

సిఎంఆర్ ఆర్కేడ్, బస్టాండ్ దగ్గర, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-501503, ఫోన్ నెం. 8184868971
ఇ-మెయిల్: chevella.telangana@bankofindia.co.in

**అనుబంధము-XIX**

**బంగారు రుణము తీసుకున్న రుణగ్రహీతకు వేలం నోటీసు**

Ref No:CHE/2026-27/BOI/2 — తేది: 17.06.2026

**దిగువ వారికి: శ్రీ/శ్రీమతి పెంటమ్మ కర్రే (రుణగ్రహీత) మరియు చట్టబద్ధ వారసురాలు,** ఇంటి నెం. 3-64, చన్‌వల్లి, చేవెళ్ళ.

సర్/మేడమ్,

**విషయం: మీ బంగారు రుణ ఖాతాకు సంబంధించిన బంగారు ఆభరణాలు/నాణేల వేలం**

**05/05/2026 తేదీ** గల మా లేఖ నెం. **CHE/2026-2027/BOI/1** ద్వారా మీ బంగారు రుణ ఖాతాలో ఉన్న బాకీలుగా **రూ. 1,15,746/- (రూపాయలు ఒక లక్ష పదిహేను వేల ఏడు వందల నలభై ఆరు మాత్రమే)** బకాయి మొత్తాన్ని, మా లేఖ అందిన తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలసిందిగా మీకు తెలియజేయడమైనది.


నిర్ణీత గడువులోగా మీ ఖాతాలో తిరిగి చెల్లింపు జమ కాలేదు. మీరు కుదుర్చుకున్న రుణ ఒప్పంద పత్రాలలోని నిబంధనలు మరియు షరతుల ప్రకారం, **రూ. 1,15,746/-** మొత్తాన్ని, అలాగే **31/03/2026** నుండి **సాలుకు 8.75%** చొప్పున వడ్డీని కలిపి చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాము. ఈ నోటీసు అందిన 15 రోజులలోపు మీ బకాయిలను పూర్తిగా చెల్లించవలసిందిగా తెలియజేయడమైనది, లేనిపక్షంలో, మా బకాయిలను వసూలు చేసుకునేందుకు బ్యాంకు వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు/నాణేలను వేలం వేయబడుతుందని తెలియజేయడమైనది.

దయచేసి గమనించండి ఒక వేళ మీరు 15 రోజులలోపు బకాయిలను చెల్లించడంలో విఫలమై, తద్వారా తనఖాపెట్టిన బంగారు నగలు/ఆభరణాలు/కాయిన్స్ వేలం వేయగా అమ్మకం రాబడులు మా బకాయిలకు సరిపోయినంతగా రానట్లయితే, మేము మీ నుండి మిగిలిన మొత్తం రాబట్టుకొనుటకు న్యాయస్థానంలో మీపై తగిన తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకొనడం తప్పనిసరి అవుతుంది.

ప్రదేశం: చేవెళ్ళ — సం/- అధీకృత అధికారి
తేది: 12.08.2026 — బ్యాంక్ ఆఫ్ ఇండియా

---

### నార్సింగి సర్కిల్ అభివృద్ధిపై జోనల్ కమిషనర్‌కు వినతి



**రాజేంద్రనగర్ ఆగస్టు 12 (నినాదం):** నార్సింగి సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల బృందం బుధవారం శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల విస్తరణ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలతో పాటు పలు నార్సింగి, మణికొండ పరిధిలోని ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలి. వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. సానుకూలంగా స్పందించిన అధికారులు . ప్రజా సమస్యల పరిష్కారానికి, నార్సింగి సర్కిల్ అభివృద్ధి పనులకు నిధుల మంజూరుతో పాటు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

---

# శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్లో ఘనంగా ఆషాఢమాస బోనాల సంబరాలు

- అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న పున్నారెడ్డి దంపతులు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్ లోని శ్రీ ఎస్.పి.ఆర్. గ్లోబల్ స్కూల్‌లో బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బోనాల వేడుకలు సందర్భంగా శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్, చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి దంపతులు స్వయంగా నెత్తిన బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండేలా అమ్మవారి ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు పున్నారెడ్డి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆయన వివరించారు.

---

## కెనరా బ్యాంక్

(భారత ప్రభుత్వ రంగ సంస్థ) सिंडिकेट Syndicate

**ఎస్ఆర్ నగర్ బ్రాంచ్ (2705)**
ఇ మెయిల్ : cb2705@canarabank.com
టెలిఫోన్ : 040 - 2343 6988 / 6955

**బహిరంగ వేలం ప్రకటన**

అనేక నోటీసులు జారీ చేసినప్పటికీ, తమ రుణ ఖాతాలకు సంబంధించిన బకాయిలను చెల్లించడంలో విఫలమైన వ్యక్తులకు దీని ద్వారా తెలియజేయడమైనది. కావున, వారు బకాయిలు మరియు ఇతర ఛార్జీలను చెల్లించి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను **25.09.2026** నాటికి లేదా అంతకు ముందే విడిపించుకోవాలని కోరడమైనది. అలా చేయని పక్షంలో, బ్యాంక్ తన విధానాల ప్రకారం, ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా మరియు బ్యాంక్ యొక్క సంపూర్ణ విచక్షణాధికారంతో, సదరు సెక్యూరిటీలను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తుంది; దీనికి అయ్యే ఖర్చును రుణగ్రహీతయే భరించాల్సి ఉంటుంది.

| క్ర. సం. | రుణం తేది | రుణం నం. | రుణగ్రహీత పేరు మరియు చిరునామా | బకాయి (రూ.) 12.08.2026 నాటికి |
|---|---|---|---|---|
| 1 | 25.07.2023 | 180203694861 | శ్రీ వెంకట రమణ పసుపులేటి సి/ఓ పి ఆంజనేయులు పి నెం 54/ఎ ఎఫ్ 401, ధన్‌రాజ్ అపార్ట్‌మెంట్స్, వెంగళ్‌రావు నగర్, హైదరాబాద్, టి.ఎస్-500038 | Rs.1,77,179.46 |
| 2 | 25.07.2023 | 180203866123 | శ్రీ వెంకట రమణ పసుపులేటి సి/ఓ పి ఆంజనేయులు పి నెం 54/ఎ ఎఫ్ 401, ధన్‌రాజ్ అపార్ట్‌మెంట్స్, వెంగళ్‌రావు నగర్, హైదరాబాద్, టి.ఎస్-500038 | Rs.4,32,626.69 |
| 3 | 25.07.2023 | 180203896218 | శ్రీ వెంకట రమణ పసుపులేటి సి/ఓ పి ఆంజనేయులు పి నెం 54/ఎ ఎఫ్ 401, ధన్‌రాజ్ అపార్ట్‌మెంట్స్, వెంగళ్‌రావు నగర్, హైదరాబాద్, టి.ఎస్-500038 | Rs.1,40,944.27 |
| 4 | 23.02.2024 | 180276439940 | శ్రీ వెంకట రమణ పసుపులేటి సి/ఓ పి ఆంజనేయులు పి నెం 54/ఎ ఎఫ్ 401, ధన్‌రాజ్ అపార్ట్‌మెంట్స్, వెంగళ్‌రావు నగర్, హైదరాబాద్, టి.ఎస్-500038 | Rs.6,06,086.74 |
| 5 | 08.04.2024 | 180292541378 | శ్రీ వెంకట రమణ పసుపులేటి సి/ఓ పి ఆంజనేయులు పి నెం 54/ఎ ఎఫ్ 401, ధన్‌రాజ్ అపార్ట్‌మెంట్స్, వెంగళ్‌రావు నగర్, హైదరాబాద్, టి.ఎస్-500038 | Rs.1,68,365.90 |

తేది: 12.08.2026, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# హెచ్ఐవీ నివారణకు అవగాహనే ప్రధాన ఆయుధం

**ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీపై పూర్తి అవగాహన కల్పించాలి... నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (నినాదం)**
హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ముమ్మర IEC ప్రచార కార్యక్రమం–2026లో భాగంగా బుధవారం నాగర్‌కర్నూల్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., హెచ్ఐవీపై భయపడాల్సిన అవసరం లేదు.. సరైన అవగాహనతో దానిని నివారించవచ్చు అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. హెచ్ఐవీ వ్యాప్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే విషయాలపై శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల ద్వారా వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారాలను నమ్మకుండా వైద్య నిపుణులు, ఆరోగ్యశాఖ అందించే విశ్వసనీయ సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని కోరారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల సమాజంలో ఎలాంటి వివక్ష, అవమానం, నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తులను దూరంగా ఉంచడం లేదా వారిని సామాజికంగా వెలివేయడం సరైన పద్ధతి కాదన్నారు. వారికి అవసరమైన వైద్య సేవలు, మానసిక ధైర్యం, కుటుంబ మరియు సామాజిక మద్దతు అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్ఐవీ నివారణపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కేవలం ఒకరోజు కార్యక్రమానికే పరిమితం కాకుండా నిరంతరంగా అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురావాలని అన్నారు.
Be Positive To Prevent HIV Positive అనే నినాదంతో చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ నివారణ, ముందస్తు పరీక్షలు, వైద్య సేవలు, చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, ఇమ్మైనైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్
# నవీన్‌కు ఘన నివాళి

**నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: జిల్లా కలెక్టర్ దివాకర్**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 12:(నినాదం )**
విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ మృతదేహానికి జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, అటవీ శాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండాలో బుధవారం నవీన్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, అటవీశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నవీన్ భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నవీన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మృతుడు నవీన్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల అటవీ శాఖ అధికారులు, సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ప్రియాంక మృతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

**అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**

**కుటుంబాన్ని పరామర్శించి కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించిన ఎమ్మెల్యే**





**గద్వాల ప్రతినిధి ఆగస్టు 12 (నినాదం)**
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన డాక్టర్ ప్రియాంక కుటుంబాన్ని బుధవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. ప్రియాంక చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువ వైద్యురాలు ప్రియాంకను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామని అన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కలిసి ప్రియాంక కుటుంబానికి రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కుటుంబంలో ఒకరికి తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడితేనే ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయుడు తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్‌తో ఫోన్‌లో ప్రియాంక కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. కేటీఆర్ కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ ప్రియాంక మృతికి కారకులైన వారికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తోడుగా, నీడగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, వైస్ చైర్మన్ మాల నర్సింహులు, కౌన్సిలర్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అధిక నీటి పంటలకు దూరంగా ఉండాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**





**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 12: (నినాదం )**
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రెండు, మూడు నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. రెండు, మూడు రోజులు వర్షాలు కురిసినంత మాత్రాన సాధారణ వర్షపాతం నమోదవుతుందని భావించి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని కోరారు.
ఎల్‌నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు, మూడు నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

**6.5 నుంచి 8 అడుగులు తగ్గిన భూగర్భ జలాలు**
గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు ప్రస్తుతం 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో నీటి లభ్యతపై అంచనాకు రావద్దని సూచించారు. రానున్న నెలన్నర రోజుల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయంతో పాటు భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**తక్కువ నీటి పంటలకు ప్రాధాన్యం**
పొద్దుతిరుగుడు, పప్పుధాన్యాలు, కంది, పెసర తదితర తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నీటి లభ్యత ఆధారంగా పంటల ఎంపికపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సత్తుపల్లి ప్రాంతంలో విస్తారంగా వరి సాగు చేస్తున్న రైతులు భవిష్యత్తులో నీటి కొరతను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని రైతులకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు.

**80 వేల మంది రైతులకు ఫామ్‌పాండ్లు**
వర్షపు నీటి సంరక్షణకు జిల్లాలో సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు 80 వేల మంది రైతులను ఫామ్‌పాండ్ల నిర్మాణానికి గుర్తించామని, ఇప్పటివరకు సుమారు 3 వేల మంది రైతులు అంగీకరించారని చెప్పారు. అంగీకరించిన రైతుల పొలాల్లో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ భవనాల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**వర్షాకాలం తర్వాతే కరువుపై నిర్ణయం**
ప్రస్తుతం జిల్లాలో తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నిర్ధారించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్షాకాలం పూర్తయిన తర్వాత వర్షపాతం, పంటల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి కరువు పరిస్థితులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.జిల్లాలో నమోదవు తున్న వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని సీపీఓను ఆదేశించారు. రైతులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఎస్ఈలు ఎం.వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



# రంగనాథన్ సేవలు చిరస్మరణీయం

**వీరాపురం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా జాతీయ గంథ పాలకుల దినోత్సవం: ప్రిన్సిపాల్ కె. రాజు**

**గద్వాల ప్రతినిధి ఆగస్టు 12 నినాదం)**
రంగనాథన్ సేవలు చిరస్మరణీయమని వీరాపురం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కే రాజు పేర్కొన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల్ జిల్లా వీరాపురంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల గ్రంథపాలకుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ కె. రాజు ముఖ్య అతిథిగా హాజరై ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో గ్రంథాలయ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత తీసుకురావడంలో ఎస్.ఆర్. రంగనాథన్ చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. గ్రంథాలయం విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు, వారి ఆలోచనా శక్తిని, వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు.ఒక గ్రంథపాలకుడు విద్యార్థులకు కేవలం పుస్తకాలను అందించే వ్యక్తిగానే కాకుండా.. ఒక గైడ్‌గా, ఉపాధ్యాయుడిగా, స్నేహితుడిగా ఉంటూ వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించి, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి లక్ష్మి, కళ్యాణి, శశిధర్, గ్రంథపాలకుడు ప్రేమ్ కుమార్తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## తొలిసారిగా
# ఎర్రకోటపై వందేమాతరం

**విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**







**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 12 (నినాదం):**
తొలిసారిగా ఎర్రకోటపై వందేమాతరం గీతాలాపన చేయడం శుభ సూచికమని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సంస్కార భారతి, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన సమయంలో వందేమాతరం నినాదం ఒక ఉద్యమ శక్తిగా మారింది అన్నారు జైలు శిక్షలు నాటి దెబ్బలు తూటాలు ఎదురైన స్వాతంత్ర సమరయోధులు ఈ నినాదాన్ని విడిచిపెట్టలేదన్నారు. 150 ఏళ్ల చరిత్రలో ఒక గొప్ప ప్రయాణం వందేమాతరందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వందేమాతరంపై పలు అంశాలపై పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే కళాభారతి సంబంధించి ఇప్పటికే అనేకసార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం అన్నారు. అరకొర నిధుల విడుదలతో ముందుకు సాగడం లేదని తెలిపారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్కార భారతి అధ్యక్షులు రాజకుమార్ సుభేదర్, ట్రస్మా అధ్యక్షులు కిషోర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి పాల్గొన్నారు.

## కల్వకుర్తి నియోజక వర్గ అభివృద్ధికి
# ప్రత్యేక నిధులు కేటాయించండి

**ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి**



**కల్వకుర్తి ఆగస్టు 12 (నినాదం)**
హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ని ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రత్యేకంగా ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందన్నారు ముఖ్యంగా ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీలకు సీసీ రోడ్లు మరియు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం మొత్తం 80 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు ఆమనగల్‌కు రూ.30 కోట్లు, కల్వకుర్తి మున్సిపాలిటీకి 50 కోట్లు మంజూరు చేయాలని కోరారు.కల్వకుర్తి నియోజకవర్గంలో పేదలు, లంబాడీలు అధిక శాతం కావున నిరుపేద కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య మంత్రివర్యులు రేవంత్ రెడ్డి ని ప్రత్యేకంగా కోరడం జరిగింది .నియోజకవర్గంలో గృహ అవసరం అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ అదనపు ఇళ్ల మంజూరు ద్వారా అర్హులైన మరిన్ని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలని ఎమ్మెల్యే కసి రెడ్డి ప్రతిపాదించారు.అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, గ్రామ పంచాయతీలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ముఖ్య మంత్రివర్యులను ప్రత్యేకంగా అభ్యర్థించారు.నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కసి రెడ్డి ఈ ప్రతిపాదనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించి, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు.




# ఐదు రోజుల పని దినాల కోసం బ్యాంకు ఉద్యోగుల ధర్నా

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 12 (నినాదం):**
గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పని దినాల డిమాండ్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు నగరంలోని ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యగులు మాట్లాడుతూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ప్రభుత్వం వెంటనే 5 రోజుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ నిరసన గళాన్ని బలంగా వినిపిస్తూ,తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐదు రోజుల పని దినాల డిమాండ్‌కు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బీఐ ఎస్ యు హెచ్ సి డిజి ఎస్ రమేశ్, ఉపాధ్యక్షులు రాజేశ్వర్, ఏ జి ఎస్ గురునాథ్, శ్రీనివాస్, సుప్రీం, ఆఫీసర్ అసోసియేషన్ డిజిఎస్ రాజు, సింగరావు, సునీల్, సతీశ్, మనోజ్ సింగ్, వంశీ, కృష్ణ, నరేష్, ఉదయ్, అన్వేష్, మధు, రాజ్ లతో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు.. ఈ మున్సిపల్ కమిషనర్ మాకొద్దు

**కౌన్సిల్ తీర్మానం నాలుగు నెలలైనా అభివృద్ధికి నోచుకోని వడ్డేపల్లి మున్సిపాలిటీ... మ్యుటేషన్‌కు డబ్బులు అడుగుతున్న మున్సిపల్ కమిషనర్ అంటూ కౌన్సిలర్ల ఆరోపణలు**

**కనీసం వీధిలైట్లు వేయించని మున్సిపల్ కమీషనర్ చీకటిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. మున్సిపాలిటీ కమిషనర్ పై తీవ్ర ఆరోపణలు చేసిన తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్**



**గద్వాల ప్రతినిధి ఆగస్టు 12 (నినాదం)**
జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రం అభివృద్ధికి నోచుకోవడం లేదంటూ 9వ వార్డు కౌన్సిలర్ సూరి పేర్కొన్నారు. బుధవారం 9వ వార్డు కౌన్సిలర్ సూరి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కౌన్సిల్ తీర్మానం చేసి నాలుగు నెలలైనా మున్సిపల్ కమిషనర్ మాత్రం నిమ్మకనీరు ఎత్తినట్లు ప్రవర్తిస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. పురవీధుల్లో వీధిలైట్లు లేక చీకటిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లితే నిర్లక్ష్యంగా నన్నేం చేయమంటారు ఏ ఈ లేడు ఎస్టిమేషన్ వేయాలి సవాలక్ష తతంగా ఉంటది అంటూ వినిపించుకోకుండా వెళ్ళిపోతాడు అని మండిపడ్డారు. వార్డుల్లో కనీస సౌకర్యాలు తీర్చకుంటే ఎలా సార్... ఇంత నిర్లక్ష్యంగా వెళ్ళిపోతున్నారు అని అడిగితే, నేనింతే ఎవరికైనా చెప్పుకోండి అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నాకేమీ ఇబ్బంది లేదు అంటూ బహిరంగంగానే ముఖంపై మాట్లాడుతున్నాడని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవర్తన చాలా వింతగా ఉందని, మోటేషన్ కోసం వచ్చిన ప్రజల దగ్గర మాత్రం డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని తీవ్రంగా ఆరోపించారు. వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్గా ఛార్జ్ తీసుకొని ఏడు నెలలైనా వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పై దృష్టి సారించడం లేదని తెలిపారు. ఇలాంటి మున్సిపల్ కమిషనర్ మా మున్సిపాలిటీకి అవసరం లేదని, కనీసం ఒక్క సమస్య పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, వెంటనే స్పందించి ఆయనను బదిలీ చేయాలని, అవసరమైతే వేరే మున్సిపల్ కమిషనర్ను ఇన్చార్జిగా పెట్టాలని మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బొంబాయి రాముడు, సుదర్శన్ పాల్గొన్నారు.

# తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త


### రేణిగుంట విమానాశ్రయంలో ఈ వీసా సేవలు




**తిరుపతి, ఆగస్టు 12 (నినాదం):** తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ -వీసా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం విదేశీ భక్తులు రావాలంటే.. ముందుగా చెన్నై, బెంగళూరు లేదా హైదరాబాద్ చేరుకోవాల్సి వచ్చేది. అక్కడ ఈ -వీసా ప్రక్రియ పూర్తి చేసుకుని ఆ తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకునేవారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తిరుపతి విమానాశ్రయంలో ఈ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇకపై ప్రయాణికులకు విదేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకొని ఈ - వీసా ప్రక్రియ ముగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణానికి కనీసం పది రోజుల ముందే ఆన్‌లైన్‌లో ఈ - వీసాను ప్రయాణికులు అందుకోవాల్సి ఉంటుంది. యితే తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ సర్వీసులు లేనప్పటికీ ముందస్తుగానే ఈ -వీసా కౌంటరును కేంద్ర పౌర విమానయాన శాఖ మంజూరు చేసింది. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

# వైసిపి హయాంలో గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు

దీనిపై హైకోర్టుకు సిట్ నివేదిక అందచేత
ఈ అక్రమాలపై వైసిపిని గట్టిగా నిలదీయాలి
మంత్రులతో భేటీలో సిఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీ తప్పిదాలు జరిగాయని సీఎం చంద్రబాబు అన్నారు. జీవిత కాలంలో ఇంత అన్యాయంగా జవాబుపత్రాల మూల్యాంకనం ఎన్నడూ జరగలేదని.. మూడు సార్లు పేపర్లు దిద్దించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలు సంబంధించిన నివేదికను హైకోర్టుకు సిట్ సమర్పించిందని.. దీనిపై వైసీపీని నిలదీయాల్సిందే అని మంత్రులకు సూచించారు. అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీ తప్పిదాలు జరిగాయని సీఎం అన్నారు. మంత్రులు అందరూ సిట్ రిపోర్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. వైసీపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. వాటిపై అసెంబ్లీలో కూడా చర్చిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీల్లో ఎటువంటి తప్పులూ చేయలేదని, అంత పారదర్శకంగా జరిగిందని తెలిపారు. డీఎస్సీపై వైసీపీ శాసనమండలిలో లేవనెత్తితే ధీటుగా సమాధానం చెబుదామన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని, ఆధారాలతో సహా నిరూపిద్దామని మంత్రులకు సూచించారు. తప్పులు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అగ్రెసివ్‌గా ముందుకు వెళ్దామని, వైసీపీ నేతలను అసెంబ్లీకి రమ్మని సవాల్ చేయాలన్నారు. అసెంబ్లీకి రాకుండా బయట గ్రామాలలో ఉంటే ప్రజలు నమ్మరని చెప్పుకొచ్చారు. రాని, అర్హత లేని ప్రతిపక్ష హోదాను ఎవరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా.. 23 మంది ఉంటే నలుగురిని లాగేస్తే ప్రతిపక్షహోదా టీడీపీకి పోతుందని జగన్ చెప్పారని, ఇప్పుడు ఆ మాటలను మరిచిపోయారని మంత్రులు తెలిపారు. సోషల్ మీడియాలో ఆనాటి జగన్ మాటలు నేటికీ చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై శాసనమండలిలో దుమ్ముదులుపుతామని మంత్రులు అన్నారు. ఈ సందర్భంగా సిట్ నివేదికను తెలుగులోకి అనువదించి మరీ మంత్రులకు సీఎంఓ అధికారులు వివరించారు.

BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
VUYYURU
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 13.11.2026 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Ground Floor, H.No: 3-324,
Ravi Chettu Center Bazar, Vuyyur,
Krishna District, Andhra Pradesh State,
Pin - 521165.
Phone No : 09188904181, 08138910751.
Email id : mgvuy829@gmail.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

# మన వారసత్వంతో ఏనుగులు భాగస్వామ్యం

### ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా పవన్ పోస్ట్



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** ఏనుగుల సంరక్షణకు కట్టుబడి ఉన్నామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. ఏనుగుల ఆవాసాలు, కారిడార్ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏనుగు కేవలం అడవిలో జీవి మాత్రమే కాదని, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అన్నారు. భారతదేశ వారసత్వంలో ఏనుగులు అంతర్భాగమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుంకీ ఏనుగులు, హనుమాన్ చొరవతో వన్యప్రాణుల రక్షణ రక్షణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామని పవన్ వెల్లడించారు. శిక్షణ పొందిన సిబ్బంది, రెస్క్యూ మౌలిక వసతులు, సాంకేతికతతో వేగవంతంగా స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సురక్షిత సమాజాలు, రక్షిత అడవులు, ఏనుగులకు సురక్షిత ఆవాసాలే లక్ష్యమని స్పష్టం చేశారు. ఏనుగులను కాపాడాలి.. అడవులను రక్షించాలి.. భవిష్యత్తు ను భద్రపరచాలి అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# చంద్రబాబు విజనరీ లీడర్

### ఎంపి కలిశెట్టితో రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, ఆగస్టు 12 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని.. అభివృద్ధికి అసలైన చిరునామా అంటూ కొనియాడారు. ఏ పని చేపట్టినా అద్భుతంగా చేయడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. నిరంతర శ్రమ, దార్శనికత కలిగిన చంద్రబాబు.. నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభివర్ణించారు. బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబం కలిసింది. ఈ సందర్భంగా 'ప్రెసిడెంట్'కు 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను ఎంపీ అందజేశారు. పుస్తకంలోని అంశాలను రాష్ట్రపతి ముర్ము ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎంపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాకుండా, 'అప్పలనాయుడిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది' అని రాష్ట్రపతి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరుపై ఎంపీని ద్రౌపది ముర్ము అభినందించారు.

# అసెంబ్లీకి రాకుండా జీతమంటే ఎలా ?

సీట్లో ఉంటే హాజరు పడేలా చర్యలు
స్పీకర్ అయ్యన్న పాత్రుడు స్పష్టీకరణ



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడం సరికాదని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఈ నెల 17న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు స్పీకర్ తెలిపారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు సభకు హాజరు కావడం, ప్రజల సమస్యలపై చర్చించడం మంచి పద్ధతని అన్నారు. అయితే ప్రజాప్రతినిధులు తమ బాధ్యత లను విస్మరించి సభకు హాజరు కాకుండా జీతాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా బయట సంతకాలు చేసి వెళ్లిపోతున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్పీకర్ వ్యాఖ్యలు చేశారు. సభ్యుల హాజరును పారదర్శకంగా పర్యవేక్షించేందుకు వారి సీట్ల వద్దకెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు సీటులో ఉన్నప్పుడే సభకు హాజరైనట్లు గుర్తించే విధానాన్ని అమలు చేయబోతున్నాం' అని వెల్లడించారు. డీఎస్సీ అంశాన్ని అనవసరంగా వివాదం చేయడం సరికాదన్నారు. క్రీడాకోటా నియామకాలకు సంబంధించిన వాస్తవాలను రికార్డుల పరిశీలన అనంతరం వెల్లడించాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్పోర్ట్స్ అంటే మాజీ మంత్రి రోజా కబడ్డీ ఆడినట్లా అని ఎద్దేవాచేశారు.

# ప్రతిపక్ష హోదా కోరుకుంటే రాదు.. సంఖ్యా బలం ఉంటేనే వస్తుంది

అసెంబ్లీకి రాని ఎమ్మెల్యలే అనర్హతను పరిశీలిస్తున్నాం
అసెంబ్లీ ఆవరణలో 14,15 తేదీల్లో స్వాతంత్ర్య ఉత్సవాలు
ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** ప్రతిపక్షం అనేది ఒక హోదా., అది సరిపడా సంఖ్యాబలం ఉంటేనే దక్కుతుందని ఏపీ.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. అది కోరుకుంటే వచ్చేది కాదని అన్నారు. పరోక్షంగా వైసిపి డిమాండ్‌పై స్పీకర్ స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అసెంబ్లీ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన విడియా సమావేశం నిర్వహించా రు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం పూట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్య్ర ఉద్యమ ఘట్టాలను ప్రదర్శిస్తామన్నారు. పోలీసు బ్యాండ్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలను.. ఆ రెండు రోజుల పాటు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహిస్తామని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరు కావడం లేదని.. అలాంటి వారికి జీతాలు ఎందుకు ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకాక పోవడమేంటన్నారు. సభకు రాని వారికి వేతనాలు ఇవ్వకూడ దని.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా నని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరిగి చట్టం తీసుకు రావాలని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. సభకు రానివాళ్లు ఎమ్మెల్యేలుగా ఎందుకున్నారు? కొందరు సభ్యుల దొంగ సంతకాలను అరికట్టేందుకే ఫేస్ రికగ్నిషన్ పెట్టాం. 6 నెలల పాటు సభకు రాకుంటే అనర్హత వేటు వేసే అంశం చర్చల స్థాయిలో ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో చూస్తున్నాం. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యే లకు క్వార్టర్స్ కేటాయింపుపై సాధారణ పరిపాలన శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అని అయ్యన్న తెలిపారు. ఆరు నెలలుగా అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం వివిధ స్థాయిలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లామని.. తమకు ఎలాంటి మార్గనిర్దేశం చేస్తుందో వేచి చూస్తున్నామని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాని సభ్యులకు కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఫ్లాట్స్ కేటాయించాలా. అని ప్రశ్నించారు. ఈ విషయంపైనా ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసు కుంటా మని తెలిపారు. ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ కేటాయింపు జీఏడీపై తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీకి రాని వారు ఎమ్మెల్యేగా ఎందుకని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఒకే లిఫ్ట్ ఉన్నందున పెద్ద వయస్సు ఉన్న వారు కింది అంతస్తులు కోరుకునేవారని ప్రస్తావించారు. అమరావతిలో మాత్రం ఎక్కువ లిఫ్ట్‌లు అందుబాటులో ఉండటం, వెంటిలే షన్, కాలుష్యం తక్కువ తదితర కారణాలతో పెద్ద వయస్సు ఎమ్మెల్యేలు పై అంతస్తులను కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

# బిఎల్‌వోలు నేరుగా ఓటర్ల వద్దకు వెళ్లాలి

సిఇవోను కలిసి విన్నవించిన మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** ఓటర్ల జాబితా సవరణలు, సమస్యలపై ఆంధ్రప్రదేశ్ సీఈఓను కలిశానని మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల్లోనూ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారని తెలిపారు. అయితే పెండింగ్‌లో ఉన్న 14 నియోజకవర్గాల జాబితా ఈరోజు ఇచ్చారని ప్రస్తావించారు. 44 లక్షల సవరణ నోటీసుల్లో కేవలం 10శాతం మాత్రమే ఇచ్చారని, ఈ పక్రియను వేగవంతం చేయాలని సీఈఓకు విజ్ఞప్తి చేశామని అన్నారు. చిన్న చిన్న సవర ణల కోసం ఓటర్లను ఎమ్మార్వో/తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిప్పవద్దని కోరారు. బీఎల్‌వోలు నేరుగా గ్రామాలు, వార్డులకు వెళ్లి సమాచారం సేకరించి ఓటర్ జాబితా సవరణలు పూర్తి చేయాలని ప్రతిపాదించా మని అశోక్ బాబు తెలిపారు. నూతన ఓటర్ల నమోదులో 01-07-2026 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులం దరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై నిబంధనలు స్పష్టమైన విచారణ, నోటీసు, స్పీకింగ్ ఆర్డర్ లేకుండా ఓట్లను తొలగించవద్దని సూచించారు. సెప్టెంబర్ వరకు సమయం చాలకపోతే కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడిగి పక్రియ గడువును మరో 10 నుంచి15 రోజులు పొడిగించాలని అశోక్ బాబు కోరారు.

# అసెంబ్లీ సమావేశాలకు వైసిపి దూరం

మండలి సమావేశాలకు మాత్రం వస్తాం
పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశం
ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న బొత్స



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** అసెంబ్లీ సమావేశాలకు ఈసారి కూడా హాజరుకాకూడదని వైసీపీ నిర్ణయం తీసుకుంది. అయితే శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని నిర్ణయించింది. వైసీపీ శాసనసభాపక్ష సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీలో వైసీపీకి తగిన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై ఆ పార్టీ మొదటి నుంచి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మరోసారి స్పందించారు. అసెంబ్లీలో ప్రస్తుతం రెండు పక్షాలే ఉన్నాయని, మూడో పక్షం లేదని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చట్టసభలో గళం విప్పాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభ్యులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రజా సమస్యలపై పోరాటానికి సభ్యులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశ వివరాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మీడియాకు తెలియజేశారు.. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బొత్స సత్యనారాయణ అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు ఈ అంశంపై పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని చట్టసభలో నిలదీస్తామని తెలిపారు. నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోందని బొత్స ప్రశ్నించారు. అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శలు చేసింది. ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాయని, వారి సమస్యలపై కూడా పార్టీ తరఫున మాట్లాడతామని తెలిపారు. అసెంబ్లీలో ఉన్నవి రెండే పక్షాలు.. మూడోది లేదు కదా. అలాంటిది 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, అలాగని చట్టంలో ఉంటే డిస్‌క్వాలిఫై చేయాలని బొత్స కోరారు. రాజ్యాంగబద్ధంగానే పోరాడుతున్నాం. ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఫేక్ పోలీసులతో నడిపిస్తున్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సీఎం కావడం మన ఖర్మ. అందరి తరఫున అడుగుతాం. అన్ని ఆధారాలు చూపిస్తాం. అన్ని విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని బొత్స తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై నిరసనగా వైఎస్సార్‌సీపీ శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే నిర్ణయించింది. అయితే శాసన మండలి సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించింది. ఇక మండలిలో పార్టీ తరఫున డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

# రోడ్డున పడి విమర్శలు చేయడం కాదు

దమ్ముంటే అసెంబ్లీకి రండి
డిఎస్సీపై అనుమానాలుంటే చర్చించండి
ఐదేళ్లలో డిఎస్సీ నిర్వహించలేని వారు విమర్శలా
నిరాధార ఆరోపణలతో ఆందోళన చేయడం సరికాదు
వైఎస్ జగన్‌కు హోంమంత్రి అనిత సవాల్



**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్ ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఏపీ హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. అసెంబ్లీలో అన్ని అంశాలను చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 'అధ్యక్షా' అనే అవకాశం కూడా వైకాపా ఎమ్మెల్యేలకు జగన్ ఇవ్వట్లేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్.. ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా బయట ఆరోపణలు చేయడమేంటని వైసీపీని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం వంగలపూడి అనిత విడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో.. నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలని అన్నారు. ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి స్పష్టం చేశారు. రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు. జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారి దగ్గర ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలి. ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదని పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మెగా డీఎస్సీని పూర్తి చేయలేకపోయిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. డీఎస్సీ పక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని వైసీపీ పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. వి దగ్గర ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం విదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని అనిత పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు. నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, పరిష్కారం సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వినతులు స్వీకరిస్తున్నారని హోంమంత్రి తెలిపారు. వినతి తీసుకోవడంతోనే బాధ్యత పూర్తయినట్లు కాదని, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ బాధితులకు సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అనిత తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

# కొండపై ఎండిపోతున్న జలాశయాలు

వరుణయాగం నిర్వహించడంలో టిటిడి విఫలం
మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు



**తిరుపతి,ఆగస్టు 12 (నినాదం):** టీటీడీ పాలనపై మాజీ టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రెండున్నరేళ్లుగా టీటీడీకి చంద్రగ్రహణం పట్టింది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా, కొండపై జలాశయాలు ఎండిపోతున్నా.. వర్షాల కోసం వరుణయాగం నిర్వహించాలన్న ఆలోచన కూడా టీటీడీకి లేకపోవడం బాధాకరమంటూ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో టీటీడీ ఆధ్వర్యంలో అనేక వైదిక కార్యక్రమాలు, యాగాలు నిర్వహించామని గుర్తు చేశారు. దేశం, రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని శతాబ్దాలుగా టీటీడీ యాగాలు నిర్వహిస్తూ వస్తోందని చెప్పారు. అయితే ప్రస్తుత పాలకులు టీటీడీ వైదిక కార్యక్రమాలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపించారు. శ్రీవారి ఆలయ ప్రతినిధులే మంటగలుపుతున్నారు. వేద సంస్కృతిని భ్రష్టు పట్టిస్తున్నారు. ధార్మిక కార్యక్రమాలను పక్కనపెట్టి దహన కార్యక్రమాల్లో మునిగిపోయారు అంటూ మండిపడ్డారు. వేద పరిరక్షణ కోసం నిధులు ఉన్నప్పటికీ అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తిరుమల కొండపై ఉన్న జలాశయాలు సైతం ఎండిపోతున్నాయని భూమన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీటీడీ వరుణయాగం నిర్వహించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. చిన్న దేవాలయాల పాలక మండళ్లు సైతం వరుణయాగాలు నిర్వహిస్తున్నాయని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీటీడీ మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వీఐపీ సేవల్లో కాకుండా ప్రజల శ్రేయస్సుపై దృష్టి పెట్టాలి. వెంటనే మేల్కొని వరుణయాగం నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీటీడీ పాలకులు వేద, వైదిక సంప్రదాయాలను పరిరక్షించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇది కేవలం విమర్శ కాదు.. బుద్ధి తెచ్చుకుని వైదిక కార్యక్రమాలను, వేద సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు.

## మాషా అల్లా స్కాం బాధితులకు అండ

### గ్రీవెన్స్‌లో హోంమంత్రి అనిత హామీ

**అమరావతి, ఆగస్టు 12 (నినాదం):** మీకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాషా అల్లా స్కాం బాధితులకు హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మాషా అల్లా బాధితులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ గ్రీవెన్స్‌లో దాదాపు 200 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత్ మాట్లాడుతూ.. ఈ స్కాంపై తక్షణమే విచారణ చేపట్టా లని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో డీసీపీ క్రైమ్స్ తిరుమలేశ్వర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని చెప్పారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ బాధితుల సమస్యపై విజయవాడ పోలీస్ కమిషనర్‌తో ఆమె మాట్లాడారు. ఆర్థిక మోసాలపై అప్రమ త్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తామనే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు. పేదల కష్టార్జితాన్ని లక్ష్యంగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడు తున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. నాయుడు పేట నుంచి టీడీపీ గ్రీవెన్స్‌కు వచ్చిన తండ్రి? ఏడేళ్ల కుమార్తెకు హోం మంత్రి అనిత సాయం చేశారు. తండ్రికి ఉపాధి, కుమార్తెకు వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే టీడీపీ గ్రీవెన్స్ ప్రధాన లక్ష్యమని హోం మంత్రి అనిత వెల్లడించారు. తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో టీడీపీ కార్యాలయానికి వచ్చినట్లు ఈ సందర్భంగా ఆ కుటుంబం వెల్లడించింది.

# డీ లిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు !

సంపాదకీయం

కాలనుగుణంగా నడుచుకోవడం..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవిడం పాలకుల కర్తవ్యం. శ్రీరాముడంతటి వాడు ప్రజల మనసెరిగి పాలన చేశారు. పూర్వం రాజులంతా అలాగే నడుచుకునే వారు. అలాకాకుండా పీడించిన వారు చరిత్రలో కనుమరుగయ్యారు. నిరంకుశంగా పాలించిన వారు సైతం చరిత్ర లేకుండా పోయారు. భారతదేశంలో అనేకానేక సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. వాటిని పట్టించుకోవడం మానేసిన అధికార, విపక్ష సభ్యులు తమ మానాన తాము సాగుతున్నారు. ఈ మధ్యకాలంలో పార్లమెంట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవీ పెద్దగా చర్చించడం లేదు. పాలకులు అనుకున్నది మాత్రమే చట్టంగా మారుతోంది. దానిపైనా చర్చలు లేవు. విపక్షాలు కూడా గందరగోళం సృష్టించి బయపటడడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారి పోయాయి. ఎవరి పట్టు వారు పట్టడంతో రోజూ సభలను వాయిదా వేయడం మినహా ముందుకు కదలడం లేదు. జంతర్‌మంతర్ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు. మరో వైపు పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీతో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. అందుకే జార్ఖండ్‌పై జవాబ్‌దో అంటూ ఎదురుదాడికి దిగారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును పత్రికలు, ఛానళ్లు కవర్ చేస్తూ...తమవంతు బాధ్యతను నిర్వహి స్తున్నాయి. నిజానికి వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆరఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా మోడీ వ్యూహం సిద్దం చేసుకున్నారని అంతా భావించారు. నిజానికి ఈ బిల్లులను ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ బృందం రంగం సిద్దం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెట్టించిన ఉత్సాహంతో తృణమఠల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్దవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఎన్‌డిఎ మద్దతుదారులంతా భావించారు. కానీ ఇలా తలకిందులు అవుతుదని వారు కూడా భావించి ఉండరు. బహుశా మోడీ కూడా ఇలా జరుగుతుందని ఊహించి ఉండరు. అంతా తాను అనుకున్నట్లుగా సజావుగా సాగిపోతుందని అనుకుని ఉంటారు. నిజానికి పార్లమెంట్ ప్రారంభం రోజే మోడీ సభకు హాజరై ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కాక్రోచ్ పార్టీ ఉద్యమంతో అంతా తలకిందులయ్యింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం వంటివన్నీ మోదీ నాయకత్వాన్ని నిలదీస్తూ వచ్చాయి. ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కూడా ఓ రకంగా ఎదురుదెబ్బగానే భావించాలి. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు దాని ప్రభావంతోనే జార్ఖండ్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే దీనివెనక ఎవరి హస్తం ఉందన్న ఆరా తీస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాలకులు ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సాగాలి. ఇప్పటికైనా విద్యార్థుల ఆందోళనలను సానుకూల దృక్పంథంతో పరిశీలిస్తే, సమస్యను పరిష్కరిస్తే మంచిది. ఇదొక్కటే కాదు.. అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. నిరుద్యోగం, వైద్యరంగం, అధిక ధరలు, వంటివాటిని యుద్ధప్రాతిపదిక పరిష్కరించాలి. డీ లిమిటేషన్ ప్రజలకు అవసరం లేని వ్యవహారం. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినదే కనుక దీనిని పక్కన పెట్టడం మంచిది. మహిళా బిల్లును ప్రస్తు పార్లమెంట్ సభ్యుల సంఖ్యకే పరిమితం చేయడం మంచిది. ఎంపిలు పెరిగితే ఆర్థిక భారం తప్ప ప్రజలకు ఒరిగేదేవిఠ లేదు. ఈ దిశగా కృషి చేయకుంటే మోడీ సర్కార్‌కు కష్టాలు తప్పవు. దేశంలో పెరుగుతన్న నిరుద్యోగ సమస్యలతో పాటు, అధిక ధరలు, దోపిడీలు, సైబర్ మోసాలు వంటివన్నీ పరిష్కరించదగ్గ సమస్యలే. కనుక వీటిపై మోడీ సర్కార్ దృష్టి సారిస్తే ప్రజలు ఆదరిస్తారు.

# ప్రజాతీర్పు విలువ ఎంత?




అభివృద్ధి పేరుతో పార్టీ మార్పులు.. చట్టంలోని లొసుగులే రాజకీయాలకు రక్షణ కవచమా?

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఒక బటన్ నొక్కడం కాదు. అది ప్రజలు తమ విశ్వాసాన్ని ఒక అభ్యర్థికి, ఒక పార్టీకి అప్పగించే పవిత్రమైన నిర్ణయం. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ప్రజల ముందుకు వెళ్లి హామీలు ఇస్తారు. ఒక సిద్ధాంతాన్ని, ఒక విధానాన్ని, ఒక పార్టీని ప్రతినిధ్యం వహిస్తామని చెబుతారు. ప్రజలు ఆ మాటలను నమ్మి ఓటు వేస్తారు.
అయితే ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మారితే?... ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం ప్రజా తీర్పును గౌరవించడమేనా? లేక వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు ప్రజల ఓటును ఉపయోగించుకోవడమా?
ఇదే ప్రశ్న నేడు ప్రజాస్వామ్యాన్ని ఆలోచింపజేస్తోంది.

అభివృద్ధి పేరుతో పార్టీ మార్పు.. నిజమైన కారణం ఏమిటి?
పార్టీ మారే ప్రతి నాయకుడు "నా నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిర్ణయం తీసుకున్నాను" అంటారు. అభివృద్ధి అవసరం లేదని ఎవరూ చెప్పలేరు. నియోజకవర్గానికి నిధులు రావాలి. ప్రజలకు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి సౌకర్యాలు అందాలి.
కానీ ఒక ప్రశ్న తప్పదు.
అభివృద్ధి కోసం పార్టీ మారడం తప్పనిసరి అయితే.. ఎన్నికల సమయంలో చెప్పిన సిద్ధాంతాలు, విధానాలు, హామీల పరిస్థితి ఏమిటి? ప్రజల ఓటు ఒక పార్టీకి పడితే, ఆ పార్టీని విడిచి వెళ్లే ప్రజాప్రతినిధి తిరిగి ప్రజల అనుమతి తీసుకోవాలా? లేక పదవిని అలాగే కొనసాగిస్తూ పార్టీ మాత్రమే మార్చుకోవచ్చా? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.

చట్టం ఉంది.. కానీ దాని అమలే అసలు సమస్య
పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ (Tenth Schedule)లో ఫిరాయింపుల నిరోధక నిబంధనలు ఉన్నాయి. పార్టీకి చెందిన సభ్యుడు పార్టీని స్వచ్ఛందంగా వీడటం లేదా పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేయడం వంటి సందర్భాల్లో అనర్హతకు అవకాశం ఉంటుంది. అయితే కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా శాసన సభా పక్షంలో కనీసం మూడింట రెండొంతుల సభ్యులు విలీనానికి అంగీకరిస్తే, ఆ విలీనం ఫిరాయింపుల నిషేధం కింద అనర్హతకు గురికాకుండా ఉండే నిబంధన ఉంది. ఇక్కడే చట్టంపై మరో ప్రశ్న తలెత్తుతుంది. ఫిరాయింపులను అరికట్టడానికి రూపొందించిన చట్టంలోనే కొన్ని మార్గాలు ఫిరాయింపులకు అవకాశం కల్పిస్తున్నాయా?
చట్టం ఉద్దేశం రాజకీయ అస్థిరతను అరికట్టడం. కానీ దాని నిబంధనలను రాజకీయ లెక్కలతో ఉపయోగించుకునే పరిస్థితి ఏర్పడితే చట్టం అసలు లక్ష్యం బలహీనపడుతుంది.

స్పీకర్ నిర్ణయం.. రాజకీయ ప్రభావం అనే అనుమానం, ఫిరాయింపులపై అనర్హత అంశాన్ని నిర్ణయించే అధికారం రాజ్యాంగం ప్రకారం సభ స్పీకర్ లేదా చైర్మన్‌కు ఉంది. అయితే స్పీకర్ కూడా సాధారణంగా ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికైన వ్యక్తే కావడంతో ఆయన నిర్ణయాలపై రాజకీయ పక్షపాతం ఉందనే అనుమానాలు అప్పుడప్పుడు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి కేసుల్లో సుప్రీంకోర్టు కూడా స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అవకాశం ఉందని స్పష్టం చేసింది. అధికార పరిధి లోపం, సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన, దురుద్దేశం వంటి అంశాలపై స్పీకర్ నిర్ణయాన్ని న్యాయస్థానం పరిశీలించగలదని కోర్టు పేర్కొంది. అంటే చట్టం పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి కాదు. కానీ నిర్ణయం ఆలస్యం కావడం ప్రజాస్వామ్య నైతికతపై ప్రశ్నలు రేకెత్తిస్తుంది.

ఆలస్యం కూడా ఒక రాజకీయ ఆయుధమేనా?
ఫిరాయింపు జరిగిందా లేదా అనే అంశంపై నిర్ణయం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటే ప్రజా తీర్పు విలువ తగ్గిపోతుంది. ఒకవేళ ఒక ప్రజాప్రతినిధి ప్రభుత్వం మారే వరకు, సభా కాలం ముగిసే వరకు నిర్ణయం రాకుండా ఉంటే.. చివరికి అనర్హతపై నిర్ణయం వచ్చినా దాని రాజకీయ ప్రభావం ఏముంటుంది?
అందుకే ఫిరాయింపు కేసులకు నిర్ణీత కాలపరిమితి అవసరం అనే వాదన బలపడుతోంది. 2025లో తెలంగాణకు సంబంధించిన ఒక కేసులో సుప్రీంకోర్టు స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై వేగవంతమైన నిర్ణయ ప్రక్రియ అవసరాన్ని స్పష్టం చేసింది.

ప్రజల తీర్పును తిరిగి ప్రజల ముందుకు తీసుకెళ్లాలా?
ఒక ప్రజాప్రతినిధి తన పార్టీని పూర్తిగా విడిచి మరో పార్టీలో చేరాలనుకుంటే, అత్యంత ప్రజాస్వామ్యబద్ధమైన మార్గం ఏమిటి?
పదవికి రాజీనామా చేసి తిరిగి ప్రజల తీర్పు కోరడం. ప్రజలు "మీరు పార్టీ మార్చినా మేము మిమ్మల్ని మళ్లీ ఎన్నుకుంటాం" అని చెబితే అది ప్రజాస్వామ్య సమ్మతిగా భావించవచ్చు. కానీ ప్రజల నుంచి పొందిన పదవిని అలాగే ఉంచుకుని రాజకీయంగా మరో వైపు వెళ్లడం మాత్రం ప్రజా తీర్పుపై ప్రశ్నలను లేవనెత్తుతుంది.
ఇది కేవలం చట్టపరమైన విషయం కాదు. నైతిక రాజకీయాలకు సంబంధించిన ప్రశ్న.
అబద్ధపు హామీలకు ప్రజలే శిక్ష విధించాలి
రాజకీయ నాయకులు ఎన్ని హామీలు ఇచ్చినా, చివరకు తీర్పు చెప్పేది ప్రజలే. పార్టీ మారిన నాయకుడిని వచ్చే ఎన్నికల్లో తిరస్కరించాలా? మళ్లీ గెలిపించాలా? అనేది ఓటరే నిర్ణయించాలి.
అందుకే ప్రజలు కూడా ఎన్నికల సమయంలో కేవలం వ్యక్తిగత ప్రయోజనాలు, తాత్కాలిక హామీలు కాకుండా అభ్యర్థి గత రాజకీయ ప్రయాణాన్ని పరిశీలించాలి.
ఎన్ని పార్టీలు మారారు? ఎందుకు మారారు? ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారు? ప్రజల సమస్యలపై ఎంతకాలం నిలబడ్డారు?
ఇలాంటి ప్రశ్నలు అడిగే ఓటరు పెరిగితేనే రాజకీయ పార్టీలకు బాధ్యత పెరుగుతుంది.
చట్టానికి సంస్కరణలు అవసరం
ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కొన్ని అంశాలపై పునరాలోచన అవసరం.
ఫిరాయింపు పిటిషన్లపై నిర్ణయానికి స్పష్టమైన కాల పరిమితి ఉండాలి.
నిర్ణయ ప్రక్రియలో రాజకీయ పక్షపాతం అనే అనుమానం రాకుండా స్వతంత్ర వ్యవస్థపై ఆలోచించాలి. పదవిని వదలకుండా పార్టీ మారే రాజకీయ సంస్కృతిపై కఠినమైన నిబంధనలు ఉండాలి. చట్టంలోని విలీన నిబంధనను రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం చేయకుండా స్పష్టత అవసరం. ప్రజా ప్రతినిధులు పార్టీ మారిన సందర్భాల్లో ప్రజలకు కారణాలను పారదర్శకంగా వెల్లడించే విధానం ఉండాలి.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేది చట్టం మాత్రమే కాదు....పార్టీలు మారడం రాజకీయ ప్రక్రియలో భాగమే కావచ్చు. కానీ ప్రజల ఓటును గౌరవించడం రాజకీయ నైతికతకు పునాది. అభివృద్ధి పేరుతో పార్టీ మారడం నిజమైన ప్రజాసేవా? లేక రాజకీయ భవిష్యత్తుకు వ్యూహమా? దీనిని నిర్ణయించాల్సింది నాయకుల మాటలు కాదు.. వారి చర్యలు.
చట్టంలోని లొసుగులను వెతికి పదవులు కాపాడుకోవడం ఒకవైపు ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు మాత్రం ఎప్పటికీ ప్రజలదే.
పార్టీ మారిన నాయకుడిని చట్టం ప్రశ్నించవచ్చు.
పదవి కోల్పోయేలా చేయవచ్చు.
కోర్టు కూడా జోక్యం చేసుకోవచ్చు.
కానీ ఒకసారి ప్రజల విశ్వాసం కోల్పోతే దాన్ని ఏ చట్టం తిరిగి ఇవ్వలేదు.
అందుకే రాజకీయ నాయకులకు ఒక ప్రశ్న..
పదవి కోసం ప్రజలను గెలిచారా?
లేక ప్రజల కోసం పదవిని గెలిచారా?
ఈ తేడా అర్థమైన రోజే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు

**ఆగస్టు 13...పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతి**

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే.
వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్ర నాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం.

తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు.
వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మచర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945-46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశ భక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్ధనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు.

1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు.

1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు.1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్నారు.



పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# భారతీయ వీరనారి అహల్యాదేవి హోల్కర్

**(13 ఆగస్టు "మహారాణి అహల్యాబాయి హోల్కర్ వర్ధంతి" సందర్భంగా)**



ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అహల్యానగర్ జిల్లాకు చెందిన చోండీ గ్రామంలో పాటిల్ లేదా చీఫ్ అయిన సుశీల – మంకోజి షిండే దంపతులకు 31 మే 1725న జన్మించింది అహల్యాబాయి. నాటి కాలంలో బాలికలు పాఠశాలకు వెళ్లే వారు కానప్పటికీ తల్లితండ్రుల చొరవతో చదవడం, రాయడం నేర్చుకుంది. నిరాడంబర కుటుంబంలోంచి ఎదిగిన 8 ఏండ్ల అహల్యాబాయి ఆలయ సేవలను, భక్తిని, ప్రవర్తనను గమనించిన మాల్వా ప్రాంత సైనిక కమాండర్ మల్హార్ రావు వెంటనే తన 10 ఏండ్ల కుమారుడు ఖండేరావుకు తగిన వధువుగా ఎంపిక చేసుకొని వివాహం జరిపించారు. 1745లో ఆ యువ జంటకు మలే రావు అనే కుమారుడు, 1748లో ముక్తాబాయి అనే కూతురు జన్మించారు.

మహారాణిగా ఎదిగిన క్రమం:

1754లో కుంబేర్ ముట్టడి సమయంలో జరిగిన ఫిరంగుల కాల్పుల్లో ఖండేరావు మరణించగా నాటి ఆచారం ప్రకారం సతీ సజీవ దమనం చేసుకోవడానికి సిద్ధపడిన అహల్యాబాయిని మామ గారైన మల్హార్‌రావు ఒప్పించి తన కోడలిని కాపాడారు. విధవరాలైన అహల్యాబాయికి రాజ నీతి, రాజ్య పాలన, యుద్ధ నైపుణ్యాలు, ప్రజా సంక్షేమాల్లో శిక్షణ ఇవ్వడంతో ఆమె రాజ్య వ్యవహారాలను చక్కగా చూసుకోవడం జరిగింది. 1766లో మామ గారైన మల్హార్ రావు మరణించడంతో తన కుమారుడు మలేరావు రాజ్య బాధ్యతలను తీసుకోవడం, మానసిక అనారోగ్యంతో తన కుమారుడు మరణించడంతో దెబ్బ మీద దెబ్బ పడినట్లు అహల్యాబాయిని సమస్యలు వెంటాడాయి. నాడు స్త్రీలను రాజ్య పాలనకు అనర్హులుగా పరిగణించాడే వారు. కాని అహల్యాబాయి శక్తి, యుక్తి, పాలనా పటిమ, ప్రవృత్తి లాంటి పలు సామర్థ్యాన్ని గుర్తించిన నాటి మరాఠా ముఖ్యులు ఆమె సింహాసనం స్వీకరించడానికి అంగీకారించడం విశేషం.

మహారాణిగా అహల్యాబాయి హోల్కర్ :

అహల్యాబాయి మహారాణిగా పదవి చేపట్టిన తర్వాత తన సైన్యాన్ని ఆధునీకరిస్తూ బలోపేతం చేయడం, దౌత్య సంబంధాలను పటిష్ట పరచడం, పరిపాలనలో తనదైన ముద్రను చూపడంతో పాటు నిర్మాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేది. ఆమె సమర్థవంతమైన పాలనలో ప్రజలు శాంతి, స్థిరత్వం, పురోగతి, ఆధ్యాత్మిక వికాసం లాంటి అంశాలను రుచి చూడగలిగారు. ప్రజలతో మమేకం అవుతూ వారి యోగక్షేమాలు చూసుకుంటూ రామరాజ్య స్థాపన చేసిన అహల్యాబాయి మహారాణి నాటి ప్రజల ఆరాధ్య దైవంగా మారిపోయారు. నాడు మహిళలు పాటించే పర్దా లేదా స్త్రీల ఏకాంత వాసం ఆచారాన్ని పాటించకుండా ప్రజలతో నేరుగా ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండేది. వివాదాల పరిష్కారం కోసం కోర్టులను కూడా స్థాపించడం అహల్యాబాయి మహారాణికి మాత్రమే ప్రత్యేకం. యుద్ధ భూమిలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక సామాన్య వ్యక్తికి తన కూతురును ఇచ్చి వివాహం జరిపించడం అహల్యాబాయి దార్శనికతకే నిదర్శనం.

అనేక దేవాలయాల పునరుద్ధరణ:

మహారాణిగా అహల్యాబాయి అనేక కోటలు, రోడ్లు, బావులు, ధర్మశాలలు, హిందూ దేవాలయాలు, విశ్రాంతి గృహాలను నిర్మించడంతో పాటు నర్మదా నది ఒడ్డున తన రాజధానిగా మహేశ్వర్(శివుని నివాసం, నేటి మధ్యప్రదేశ్‌లో)ను నిర్ణయించింది. అనేక మంది కళాకారులు, శిల్పులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారణాసి, ఘృష్ణేశ్వర్, త్రయంబక్, గయా, పుష్కర్, ద్వారక, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్, మధుర, శ్రీశైలం, బృందావన్, నాథద్వారా, బద్రీనాథ్, కేగార్నాథ్ లాంటి పలు ఆలయాలను పునర్నిర్మించడం జరిగింది. శివుడికి నివాళిగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలను పునరుత్థానం చేసింది. మొగుల్ చక్రవర్తి ఔరంగాజేబు కాశీ ఆలయాన్ని నాశనం చేసిన శతాబ్దం తర్వాత, ఆమె 1780లో కాశీ ఆలయాన్ని పునర్నిర్మించింది. మహేశ్వర్‌లో వస్త్ర పరిశ్రమను సహితం స్థాపించడం జరిగింది. 13 ఆగష్టు 1795న అహల్యాబాయి హోల్కర్ మహారాణి మరణించడంతో మల్హార్ రావు దత్తపుత్రుడు తుకోజీ రావు సింహాసనం అధిష్టించిన రెండు ఏండ్ల తర్వాత తన కుమారుడు జస్వంత్ రావుకు సింహాసనం వదులుకున్నారు. 1804లో బ్రిటీష్ వారితో యుద్ధంలో ఓడిపోయిన చివరి హోల్కర్ పాలకుడిగా మిగిలి పోయారు.

ఆమె విలక్షణ సుపరిపాలన, సామాజిక సంస్కరణలు, సైనిక విజయాలను విస్మరించిన నాటి పాలకులు చరిత్ర పుస్తకాల్లో అహల్యాబాయి హోల్కర్ ప్రస్తావనలకు చాలా తక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అహల్యాబాయి 300వ వర్ధంతి సందర్భంగా నేటి యువత, ముఖ్యంగా యువతులు ఆమె జీవిత చరిత్రను ఆకళింపు చేసుకొని ఆమె చూపిన బాటలో పయనించాలని కోరుకుందాం.

**డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం

## శుభ కార్యాక్రమాలకు అనువైన మాసం

## అనేక పూజాది వ్రతాలకు పవిత్ర మాసం

**యాదగిరిగుట్ట :**

హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిథి రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం.
దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణోక్తి.. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్టతో, అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం. వివాహాది శుభకార్యాలకు, మంగళ గౌరీ నోములకు, వరలక్ష్మి వ్రతానికి, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ముడివేసే రాఖీ పౌర్ణమి వంటి పండుగలకు శ్రావణ మాసం పెట్టింది పేరు.
తెలుగు పంచాంగం ప్రకారం ఐదో మాసమైన శ్రావణ మాసంలో పండుగలు, వ్రతాలతో పాటు శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని అంటారు. శుభాల మాసమైన శ్రావణ మాసంలో పౌర్ణమి నాటి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసమని పేరు వచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఏ పని చేసినా శుభకరమని భావిస్తారు.
శ్రావణంలో రానున్న పుణ్య తిథులు ` పండుగలు ఇలావున్నాయి. ఆగస్టు 13, గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆగస్టు 13, గురువారం శ్రావణ శుద్ధ పాడ్యమి: శ్రావణ మాసం ప్రారంభం గస్టు 14, శుక్రవారం శ్రావణ శుద్ధ విదియ చంద్రోదయం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం, ఆండాళ్ తిరు నక్షత్రం, ఆండాళ్ తిరుపురంగా భావిస్తారు. ఆగస్టు 15, శనివారం శ్రావణ శుద్ధ తదియ. శ్రీనివాసుడికి ఇష్టమైన రోజు. ఆగస్టు 16, ఆదివారం, శ్రావణ శుద్ధ చవితి: నాగ చతుర్థి, కశ్యప మహర్షి జయంతి కూడా.
ఆగస్టు 17, సోమవారం, శ్రావణ శుద్ధ పంచమి: నాగ పంచమి, గరుడ పంచమి, సింహ సంక్రమణం, శృంగేరి శ్రీ విధుశేఖర భారతీతీర్థ స్వామి వారి జన్మదినం, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆగస్టు 18, మంగళ వారం శ్రావణ శుద్ధ షష్టి: కల్కి జయంతి.
ఆగస్టు 21, శుక్రవారం శ్రావణ శుద్ధ నవమి: శ్రీ వరలక్ష్మీ వ్రతం, శ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, తిరుచానూరు శ్రీ పద్మావతి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 22, శనివారం శ్రావణ శుద్ధ దశమి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆగస్టు 23, ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి: సర్వ ఏకాదశి, శ్రావణ పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. ఆగస్టు 25, మంగళవారం శ్రావణ శుద్ధ త్రయోదశి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు సమాప్తి, పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. ఆగస్టు 26, బుధవారం శ్రావణ శుద్ధ చతుర్దశి: ఓనం పండుగ, రుగ్వేదీనాం ఉపాకర్మ, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. ఆగస్టు 28, శుక్రవారం శ్రావణ శుద్ధ పౌర్ణమి: రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, వైఖానస మహాముని జయంతి, హయగ్రీవ జయంతి, శ్రావణాల పౌర్ణమి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు నక్షత్రం, మృకండ మహర్షి జయంతి కూడా. ఆగస్టు 29, శనివారం శ్రావణ బహుళ పాడ్యమి: గాయత్రీ జపాలకు మంచిది. ఆగస్టు 30, ఆదివారం శ్రావణ బహుళ విదియ: శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం. ఆగస్టు 31, సోమవారం శ్రావణ బహుళ తదియ/ చవితి: పుబ్బ కార్తె ప్రారంభం, సంకష్టహర చవితి కూడా. సెప్టెంబర్ 2, బుధవారం శ్రావణ బహుళ పంచమి/షష్టి: బలరామ జయంతి, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం. సెప్టెంబర్ 4, శుక్రవారం శ్రావణ బహుళ అష్టమి: గోకులాష్టమి, శ్రీ కృష్ణాష్టమి, జన్మాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, గోశాలలో గోపూజ, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు సమాప్తం. సెప్టెంబర్ 5, శనివారం శ్రావణ బహుళ నవమి: గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం. సెప్టెంబర్ 7, సోమవారం శ్రావణ బహుళ ఏకాదశి: సర్వ ఏకాదశి. సెప్టెంబర్ 8, మంగళవారం శ్రావణ బహుళ ద్వాదశి/ త్రయోదశి: పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. సెప్టెంబర్ 9, బుధవారం శ్రావణ బహుళ చతుర్దశి: మాసశివరాత్రి. సెప్టెంబర్ 11, శుక్రవారం శ్రావణ బహుళ అమావాస్య: పోలాల అమావాస్య ఈ రోజుతో శ్రావణ మాసం సమాప్తమవు తుంది. శ్రావణ మాసంలో రానున్న పండుగలను శాస్త్రంలో సూచించిన విధంగా, పురాణాల ప్రకారం జరుపుకుంటే మంచిది.



## ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీ

# తెరిపించాలి

### రైతులకు రవాణా చార్జీల భారం పడకుండా చూడాలి

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి కోరగానే..**
**సీఎం దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కరిస్తానని హామీ**

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 12 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని, చక్కెర కర్మాగారం పరిధిలోని చెరుకు పండించిన రైతులు కామారెడ్డి చక్కెర ఫ్యాక్టరీకి తరలించడానికి రవాణా చార్జీలు భారాన్ని ప్రభుత్వం భరించేలా చూడాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి, ఎన్డీఎస్ఎల్ సభా సంఘం చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు బుధవారం హైదరాబాద్ గాంధీభవన్ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో కలిసి విజ్ఞప్తి చేశారు. కోరుట్ల నియోజక వర్గంలో ఇటీవల ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్యతో కలిసి జువ్వాడి కృష్ణారావు ఎస్ఐఆర్ అమలు తీరును పరిశీలిస్తూ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లతో నిర్వహించిన పునఃశ్చరణ సందర్భంగా స్థానిక చెరుకు రైతుల విన్నపం మేరకు బుధవారం చెరుకు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని కృష్ణారావు రైతులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. చెరుకు రైతులకు ముత్యంపేట నిజాం చెక్కర ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు పండించిన రైతులు దూర ప్రాంతంలో ఉన్న కామారెడ్డి ఫ్యాక్టరీకి తరలించడానికి రవాణా చార్జీలు భారం తగ్గి చక్కెర రికవరీ శాతం కూడా తగ్గుచున్నదని టన్నుకు 400 రూపాయలు రవాణా చార్జీ చెల్లించాలని కోరారు. ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని జువ్వాడి కృష్ణారావు కోరగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిస్థితి విన్నవించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు.



### అంతర్జాతీయ సెయిలింగ్‌లో రజతం సాధించిన

## రిష్వితకు మంత్రి పొన్నం అభినందనలు

**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 12 (నినాదం) :** ఇటలీలోని గార్డా సరస్సులో జూలై 30 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన బీసీ గురుకుల విద్యార్థిని ఎస్. రిష్వితను మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించి అభినందించారు. పోటీలో పాల్గొన్న మరో ఇద్దరు విద్యార్థులను కూడా శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న స్పోర్ట్స్ పాలసీలో భాగంగా విద్యార్థులను వారు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణమన్నారు. సమయపాలన, సమిష్టి కృషితో తెలంగాణకు, భారత్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంజేపీటీ సెక్రటరీ బి. సైదులు, అధికారులు పాల్గొన్నారు.



## కేటీఆర్ అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారు: శ్రీధర్‌బాబు



**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 12 (నినాదం)** కేటీఆర్ అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించిందని, తమ ప్రభుత్వం నిబంధనల మేరకు ఎకరాకు రూ.1.50 కోట్ల చొప్పున భూమి కేటాయించిందని తెలిపారు. ఐదు ఎకరాలను రూ.7.5 కోట్లకు కేటాయించామని, కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలపై ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ చేసిన గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని, అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని వ్యాఖ్యానించారు.తెలంగాణ నీటి వాటాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణ ప్రయోజనాల కోసం బలంగా వాదిస్తామని తెలిపారు.

# అల్జీమర్స్‌పై విస్తృత అవగాహన అవసరం

### ప్రొఫెసర్ సూర్యప్రభ (నిమ్స్)

**హైదరాబాద్ బ్యూరో,ఆగస్టు 12 (నినాదం) :** అల్జీమర్స్ వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సూర్యప్రభ అన్నారు. వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా ఎర్రమంజిల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యూరాలజీ నిపుణుడు డాక్టర్ ఫణికుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు.వయసుతో పాటు జన్యుపరమైన కారణాలు, మారుతున్న జీవనశైలి వల్ల అల్జీమర్స్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల్లో మతిమరుపు సమస్యలు కనిపిస్తే వెంటనే న్యూరాలజీ వైద్యులను సంప్రదించాలని సూచించారు.సీడీఆర్, మోకా, ఎంఎంఎస్ఈ వంటి ప్రాథమిక పరీక్షలతో వ్యాధిని గుర్తించి, అవసరాన్ని బట్టి తదుపరి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని శారీరక వ్యాయామం ద్వారా వ్యాధి ముప్పును తగ్గించుకోవచ్చన్నారు. వృద్ధాశ్రమాల్లో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



# చిన్నారి దక్షికకు.. దాతలే దిక్కు

**ఆడుకోవాల్సిన వయసులో.. ఆసుపత్రి మంచంపై దక్షిక.. ఐదేళ్ల చిన్నారికి కాలేయ వ్యాధి.. రూ.25 లక్షల వైద్యం అవసరం**

**గుండెకు గతంలో శస్త్రచికిత్స.. ఇప్పుడు కాలేయ సమస్యతో మృత్యువుతో పోరాటం.. దక్షికను బతికించండి.. తల్లిదండ్రుల కన్నీటి వేడుకోలు**

**కోదాడ ప్రతినిధి ( నినాదం)** తోటి పిల్లలతో కలిసి ఆడుతూ.. నవ్వుతూ గడపాల్సిన వయసు ఆమెది. కానీ అనారోగ్యం ఆ చిన్నారి బాల్యాన్ని మంచానికే పరిమితం చేసింది. కోదాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వడ్లమూడి రాకేష్, ప్రసన్న దంపతుల ఐదేళ్ల కుమార్తె దక్షిక కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు శస్త్రచికిత్సతో పాటు ఇతర వైద్య చికిత్సలకు సుమారు రూ.25 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు.

### రెండేళ్లకే గుండె ఆపరేషన్..

దక్షికకు రెండేళ్ల వయసులోనే గుండె సంబంధిత వ్యాధి వచ్చింది. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించారు. అప్పట్లో వైద్య ఖర్చుల కోసం కుటుంబం తీవ్రంగా ఇబ్బందులు పడింది. ఆపరేషన్ అనంతరం కొంతకాలం



చిన్నారి ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు.

### మళ్లీ మొదలైన అనారోగ్యం..

గుండె ఆపరేషన్ జరిగిన కొద్ది నెలలకే దక్షికకు శరీరం వాపులు రావడం, మూత్రం సరిగా రాకపోవడం, తీవ్ర నీరసం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఆసుపత్రులకు తీసుకెళ్లగా కామెర్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చికిత్సతో కొంతకాలం సమస్య తగ్గినా.. మళ్లీ ఆరోగ్యం క్షీణించింది. హైదరాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆసు



పత్రిలో పరీక్షలు చేయించగా కాలేయం దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. శస్త్రచికిత్స చేయడంతో పాటు గుండెలో స్టంట్ వేయాల్సి ఉంటుందని, ఇందుకు సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు.

### పాప కోసం తల్లి ఉద్యోగం మానేసి..

రాకేష్ ప్రైవేట్ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తుండగా.. కుమార్తె ఆరోగ్యం కోసం ప్రసన్న తన నర్సు ఉద్యోగాన్ని వదిలేశారు. పాపకు వైద్యం చేయించడం, మందులు ఇవ్వడం, ఆసుపత్రులకు తీసుకెళ్లడమే ఆమె దినచర్యగా మారింది.

ఇప్పటికే వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేసిన కుటుంబానికి ఇప్పుడు రూ.25 లక్షల భారం పెనుభారంగా మారింది.

### 'మా పాపను బతికించండి..'

చేతిలో ఉన్నదంతా చిన్నారి వైద్యానికే ఖర్చు చేసిన తల్లిదండ్రులు.. ప్రస్తుతం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 'మా పాపను బతికించేందుకు మీకు చేతనైన సాయం చేయండి.. దక్షికను మళ్లీ మాతో కలిసి నవ్వేలా చేయండి' అంటూ కన్నీటితో వేడుకుంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్పందించి చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అందే ప్రతి రూపాయి వారికి ఒక ఆశాకిరణమే. దక్షిక చికిత్స కోసం దాతల చేయూత కోసం ఆ కుటుంబం ఎదురుచూస్తోంది.

### దివ్యాంగుల సంక్షేమంపై కేంద్ర మంత్రితో

## ఎంపీ అర్వింద్ భేటీ

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 12 (నినాదం) :** కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్‌ను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ బుధవారం న్యూఢిల్లీలో కలిశారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపీ వివరించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరేలా పనిచేస్తున్నామని ఎంపీ తెలిపారు. సహకారానికి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఎంపీ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.






### రెండో రోజూ నష్టాల్లో

## ముగిసిన మార్కెట్ సూచీలు


దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. ఐటీ, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. ముఖ్యంగా టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ రాజీనామాతో టీసీఎస్ షేర్లు 4 శాతానికి పైగా కుంగాయి. సెన్సెక్స్ ఉదయం 78,263.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,154.25) లాభాల్లో మొదలై.. ఆరంభంలోనే నష్టాల్లోకి జారకుంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,497.93 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 187.90 పాయింట్లు కోల్పోయి 77,966.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 35.75 పాయింట్లు పతనమై 24,435.95 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.33 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, రిలయన్స్, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 88.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,417.97 వద్ద ట్రేడవుతోంది.

# ఇది ఓ అభాగ్యుని... జీవన్మరణ పోరాటం

**ఐస్ క్రషర్ మిషన్‌తో.. ఆగమైన లేత బుగ్గల జీవితం**

**ఆపన్న హస్తం కోసం ఆకాష్ కుటుంబం**

**జవహర్ నగర్ ఆగస్టు 12(నినాదం):** ఇది ఓ అభాగ్యుని జీవన్మరణ పోరాటం... కదిలిస్తే కన్నీళ్ల పర్యంతం... ఐస్ క్రషర్ మిషన్లో నలిగి ఆగమైన లేత బుగ్గల ప్రాయం. జీవిత కోణం దిక్కులు పిక్కటిల్లేలా కష్టాల ఆక్రందనలు. వెరసి నిరుపేద కుటుంబానికి చెందిన 21 ఏళ్ల కుమ్మరి ఆకాష్ జీవితం అనూహ్య ప్రమాదంతో విషాదంలోకి వెళ్లింది. మూలికే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా అసలే అర్ధకలితో జీవిస్తున్న కుటుంబం ఆగమయ్యే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నడిబొడ్డున బేగంబజార్‌లో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్న ఆకాష్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఆకాష్ తండ్రి సుభాష్ మొక్కజొన్న కంకులు కాల్చి అమ్ముకుంటూ చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వచ్చే ఆదాయం అంతంతమాత్రంగానే ఉండటంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారింది.సుభాష్‌కు ఇద్దరు కుమారులు.




కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇద్దరు కుమారులు తమ పొట్టకూటి కోసం దొరికిన పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.ఈ క్రమంలో ఆకాష్ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐస్ క్రషర్‌లో చేయి మోచేయి వరకు తీవ్రంగా గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో యజమాని వెంటనే ఆకాష్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించడంతో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు.చికిత్స ప్రారంభమైన మూడో రోజున ఆకాష్‌కు ఒక కిడ్నీ విఫలమైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఈ వార్త మరింత పిడుగులా మారింది. ఈ క్రమంలో మరో 19 రోజుల చికిత్స అనంతరం రెండో కిడ్నీ కూడా విఫలమైందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆకాష్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆకాష్‌కు నిరంతర వైద్య సేవలు, డయాలసిస్ అవసరం కాగా, చికిత్సకు అయ్యే ఖర్చు కుటుంబానికి భారంగా మారింది.
అద్దె ఇంట్లో నివసిస్తూ, పరిమిత ఆదాయంతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబం ఇప్పుడు ఆకాష్ వైద్య ఖర్చుల కోసం దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆకాష్ వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు దాతలను వేడుకుంటున్నారు.మీ చిన్న సహాయం కూడా ఆకాష్ ప్రాణాలను కాపాడేందుకు పెద్ద అండగా నిలుస్తుందని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.నిరుపేద ఆకాష్ జీవితం ప్రతి ఒక్కరిని కలిసి వేస్తుందని ఎవరైనా దాతలు ఆకాష్ కు సహాయం చేస్తే అతను బతుకుతాడని, పేద ఆకాశ కుటుంబాన్ని ఆదుకోవాలని ఇందుకోసం ఆర్థిక సహాయం చేయదలచిన వారు ఈ క్రింది నెంబర్ కు ph.8341142585 కు ఫోన్ చేసి ఆపన్న హస్తం అందించాలని, మీ ఈ చిన్న సహాయం ఆకాష్ ప్రాణాలను కాపాడేందుకు పెద్ద అండగా నిలుస్తుంది అని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఒరాకిల్‌లో లేఆఫ్‌లు

**ఈసారి ఏఐ ఖర్చుల భర్తీకి..!**

కృత్రిమ మేధ విస్తృత వినియోగం కారణంగా మొన్నటి వరకు ఉద్యోగాలు పోగా.. ఆ టెక్నాలజీకి పెట్టిన ఖర్చును పూడ్చుకోవడం కోసం మరికొంత మంది సిబ్బందిని తొలగించుకునేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ ఇప్పుడు ఆ బాటలోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నెలలో మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించనుందని తెలుస్తోంది. ఏఐ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునేందుకు డేటా సెంటర్ల నిర్మాణం, ఏఐ చిప్‌లను కొనుగోలు చేయడం, ఓపెన్ ఏఐ వంటి ఏఐ క్లయింట్లకు మద్దతు ఇచ్చేందుకు ఒరాకిల్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇప్పుడు ఆ ఖర్చును భర్తీ చేసుకునేలా ఉద్యోగులను తగ్గించుకోవాలని చూస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సంఖ్య ఎంతనేది మాత్రం వెల్లడికాలేదు. సెప్టెంబర్ ఒకటి నుంచి రెండో త్రైమాసికం ప్రారంభం కావడానికి ముందే ఈ కోతలు అమలు చేయాలని భావిస్తోంది. కొన్ని బృందాల్లో కోతలు డబుల్ డిజిట్‌లో ఉండనున్నట్లు సమాచారం.



## భీంరావును పరామర్శించిన ప్రజా సంఘాల నాయకులు



**సిద్ధిపేట బ్యూరో,ఆగస్టు 12(నినాదం):** అక్బర్పేట – భూశీపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామానికి చెందిన ప్రజా ఉద్యమ నాయకుడు భూంపల్లి భీంరావు కాలుకు ఆపరేషన్ అయినందున బుధవారం రోజున తన నివాసంలో పలు ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. వైద్యులు సూచించిన మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సిద్ధిని రాజ మల్లయ్య టిఎంఆర్పిఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలిగారి కృష్ణ జిల్లా నాయకుల కొలుపుల నవీన్ అక్బర్ పేట భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి భూంపల్లి మాజీ సర్పంచ్ బోయ శ్రీనివాస్ మెదక్ జిల్లా నిజాంపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి బేగంపేట నగేష్ ప్రజా సంఘాలు ప్రజా సమికవాదులు భీంరావు అతి తొందర కోలుకోవాలని మళ్లీ ప్రజా ఉద్యమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా రామేశ్వర్



**వికారాబాద్, ఆగస్టు 12(నినాదం):** వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ సిలారి రామేశ్వర్ ను వికారాబాద్ సంఘానికి గౌరవ అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ గోపాల్ నియమిస్తూ బుధవారం వికారాబాద్ లో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప సర్పంచ్ సంఘం గౌరవ అధ్యక్షుడు రామేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ని ఉప సర్పంచ్ ల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ గోపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా వికారాబాద్ మండలం ముఖ్య సలహా దారుని అత్వెల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సత్తయ్యను నియమించారు.

## ఘనంగా ఆషాఢ బోనాల పలారం బండి ఊరేగింపు

### పాల్గొన్న మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, పటాన్ చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్..



**పటాన్చెరు, ఆగస్టు 12 (నినాదం):** పటాన్‌చెరు పట్టణంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆషాఢ మాస బోనాల పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ మన్నే రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండి వేడుకలకు నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలో యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం, గోకుల్ యూత్, గోనెమ్మ బస్తి, జూనియర్ బాయ్స్ యూత్ మరియు వివిధ కాలనీల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండ్ల ఊరేగింపుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను, యూత్ సభ్యులను ఆయన అభినందించారు అనంతరం జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు నరసింహ రెడ్డి నివాసంలో తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జిల్లా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చిన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నాయకులు కాసాని వీరేష్, కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, దస్తగిరి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, సందీప్ గౌడ్, నారాయణదాసు, మణికంఠ, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


## 52.8 కిలోల ఎండు గంజాయి పట్టివేత



**వికారాబాద్, ఆగస్టు 12 (నినాదం):** రైలు ద్వారా తీసుకువచ్చిన ముగ్గురు కొరియర్లు నాలుగు సూట్ కేసుల్లో 36 పాకెట్ల గంజాయిని జిల్లా పరిధిలోని తాండూర్ రైల్వే స్టేషన్ వద్ద ఎస్ టీ ఎఫ్ ఎన్ఫోర్స్మెంట్, డి టీ ఎఫ్ విభాగాల దాడిలో బుధవారం పట్టుకున్నారు. లభించిన గంజాయి 13.5 లక్షల విలువ ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఎక్సైజ్ డైరెక్టర్ మహంతి ఆదేశాల మేరకుఎక్సైజ్ ఎస్ టి ఎఫ్, ఎన్ఫోర్స్మెంట్, డిటిఎఫ్ విభాగాల దాడులు జరిపారు. ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను రిమాండ్ కు తరలించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెంట్ శ్రీనివాసరెడ్డి, స్థానిక సిఐ తో కలిసి వివరాలు వెల్లడించారు.

## హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ

### 200 మంది విద్యార్థులతో భారీ త్రివర్ణ పతాకంతో ప్రదర్శన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (నినాదం):** బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్ నవోదయ స్కూల్ నుంచి చైతన్య స్కూల్ మీదుగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వరకు సుమారు 2,000 మంది విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలతో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అత్యంత పొడవైన జాతీయ జెండాలతో దేశభక్తిని చాటుతూ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు అన్నద గౌడ్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, శ్రీ నందం దివాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్ చారి, వాసు, సుధ, భరత్ సింహారెడ్డి, సురేష్‌రెడ్డి, సిద్ధిరాం రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు సతీష్‌గౌడ్, విద్యాసాగర్, రమేష్, రవి యాదవ్, రమేష్ యాదవ్, రంగ శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, నాగరాజు యాదవ్, జగన్ముదిరాజ్, యాదగిరి యాదవ్, జగదీశ్ కుమార్ యాదవ్, మార్చాల శ్రీనివాస్, వసుంధర, రేణుక, తేజస్విని, సబిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగు జెండా కార్యక్రమంలో చైతన్య స్కూల్ కరెస్పాండెంట్ శివరాత్రి యాదగిరి, చాణిక్య స్కూల్ కరస్పాండెంట్ వనజా అశోక్, నవోదయ స్కూల్ కరస్పాండెంట్ గిరి బాలాజీ క్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్ లత లకు ఈ సందర్భంగా బిజెపి నేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఎస్పీ, అడిషనల్ ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్





**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 12 (నినాదం):** సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిం చనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశిం చారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రుద్ర కన్స్ట్రక్షన్స్‌పై సమగ్ర విచారణ జరపాలి

**కొనుగోలుదారులు నష్టపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి**

**అధికారులకు ఫిర్యాదు చేసిన ఆకుల సతీష్**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మండలంలో డి. పోచంపల్లి, బౌరంపేట ప్రాంతాల్లోని రుద్ర కన్స్ట్రక్షన్స్, రుద్ర అశోక, జేఎన్ఎస్ కన్స్ట్రక్షన్స్ ప్రాజెక్టులపై సమగ్ర విచారణ జరిపి కొనుగోలుదారులు నష్టపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు పాకుల సతీష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములు, మున్సిపల్ చెందిన ఎమినిటీస్ భూములు, చెరువు శికం భూముల వినియోగం, నిర్మాణ అనుమతులు, డ్రైనేజీ మళ్లింపు తదితర అంశాలపై పూర్తి ఆధారాలతో దుండిగల్ తహసీల్దార్, డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆకుల సతీష్ తెలిపారు. డొమ్మర పోచంపల్లిలోని రుద్ర రాయల్ విలేజ్–2కు సంబంధించిన సర్వే నంబర్లు 294/పి, 295/పి, 296/పి, 620/పి లోని ప్రాజెక్టు, అప్రోచ్ రోడ్డు, ఎంట్రన్స్ గేట్, ఆర్చ్ దుండిగల్ మున్సిపాలిటీకి గిఫ్ట్ రెడీ చేసిన ఎమినిటీస్ భూమిపై ఉన్నాయో అధికారులు భౌతిక సర్వే ద్వారా నిర్ధారించాలని కోరారు. సర్వే నంబర్లు 615--621లోని అమెనిటీ భూములపై గిఫ్ట్ డిడి డాక్యుమెంట్ నెంబర్ 3200/2022–నా–నా1521 ఆధారంగా విచారణ జరపాలని ఫిర్యాదులో సూచించారు. మున్సిపల్ భూమి ఆక్రమించుకొని అప్రోచ్ రోడ్డుగా చూపించుకొని అక్రమ అనుమతులు, అక్రమ ఆర్చి నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని, సర్వే నంబర్ 291 ప్రభుత్వ భూమి, శేరోశికం ఆక్రమణ భూమి వర్గీకరణ, వినియోగాన్ని నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. గంగాదేవుని చెరువులోకి డ్రైనేజీ,మురుగు నీరు మళ్లిస్తున్నారనే ఆరోపణలపై ఇరిగేషన్ శాఖతో సాంకేతిక విచారణ చేపట్టాలని కోరారు. బౌరంపేటలోని సర్వే నంబర్లు 146, 147లో రుద్ర/జె ఎన్ ఎస్ /అశోక కన్స్ట్రక్షన్ పేరుతో నిర్మాణం నందు 166/1కు సంబంధించి ప్రభుత్వ భూమి ఆక్రమణ వినియోగం, రోడ్లు, కాంపౌండ్ వాల్స్, షెడ్లు, విల్లా నిర్మాణాలు అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని తెలిపారు. రెండంతస్తుల నిర్మాణం ఎలాంటి మున్సిపల్ హెచ్ఎండిఏ, రేరా అనుమతులు లేకుండానే జరుగుతున్న రెవెన్యూ మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, గతంలోనే ఈ ప్రాజెక్టు రోడ్డు గురించి వివాదాస్పదమైన అనుమతులు లేని నిర్మాణంపై ప్రస్తుతము అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా సహకారం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ రెండు ప్రాజెక్టులపై రెవెన్యూ, జిహెచ్ఎంసి, మున్సిపల్, ఇరిగేషన్, హెచ్ఎండిఏ, రేరా శాఖలతో సంయుక్త సర్వే నిర్వహించి భూముల యాజమాన్యం, వర్గీకరణ, హద్దులు, ఆక్రమణ, అక్రమ నిర్మాణ అనుమతులు, మంజూరైన ప్లాన్లు, చెరువు ఎఫ్ టి ఎల్ /శికం పరిధిని పరిశీలించాలని సతీష్ కోరారు. ఆరోపణలు వాస్తవమా, కాదా? అనేది విచారణలో తేల్చాలని సూచించారు. అప్పటి వరకు వివాదాస్పద భూముల్లో మరింత నిర్మాణం జరగకుండా, భవిష్యత్తులో విల్లా కొనుగోలు దారులు నష్టపోకుండా అధికారులు తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలి" అని ఆకుల సతీష్ అన్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుని, ప్రభుత్వ, మున్సిపల్, చెరువు భూములను రక్షించాలని, విచారణ నివేదికను ఫిర్యాదుదారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



**వికారాబాద్, ఆగస్టు 12(నినాదం ):** జిల్లా పరిధిలోని పరిధిలోని కరన్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాటా ఆడుతున్న 8 మందిని బుధవారం అరెస్ట్ చేసి రూ. 82,770 నగదు, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం నమ్మదగిన సమాచారం మేరకు కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాలతో నమ్మదగిన సమాచారం మేరకు నారాయణపూర్ గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడి నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 82,770 నగదు మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టుబడిన వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని ఆయన తెలిపారు. జిల్లాలో పేకాట, జూదం ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వర్ పాషా హెచ్చరించారు. పేకాటకు పాల్పడిన వారిపై కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపెట్టనున్నట్లు చెప్పారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషాను బృంద సభ్యులను జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

# యువత చేతిలో దేశ భవిష్యత్

- మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్చెరులో ఘనంగా తిరంగా యాత్ర





**పటాన్చెరు, ఆగస్టు 12 (నినాదం):** దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని..యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో.. పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో పటాన్చెరు వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

డ్రగ్స్ యువత జీవితాలను చిన్నాభిన్నం చేయడంతో పాటు కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖతో పాటు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని కోరారు.

**దేశభక్తితో పాటు సామాజిక బాధ్యత అవసరం**


తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని, ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, మాదక ద్రవ్యాలకు దూరమైన యువతతోనే బలమైన భారతదేశాన్ని నిర్మించగలమని అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన యువజన వికాస సమితి ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల ఈ కేవైసీ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి



**వికారాబాద్, ఆగస్టు 12 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాలో రేషన్ కార్డుల కోసం ఇ కేవైసిని పూర్తి చేయడానికి చివరి తేదీ ఆగస్టు 31గా అధికారులు నిర్ణయించారని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని సీ పి ఐ ఎం జిల్లా కార్యదర్శి మైపాల్ కోరారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లాలో అనేక మీ సేవలు కేంద్రాలు ఉన్న కొన్నిశీటికి మాత్రమే పర్మిషన్ ఇవ్వడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్ సివిల్ సప్లయ్ అధికారులు వెంటనే స్పందించి పర్యవేక్షణ చెయ్యాలని పేద ప్రజలు చిన్న పిల్లలతో ఉదయం నుండి అర్ధరాతిరిల వరకు ఆయా కేంద్రాల వద్ద వేచి ఉంటున్నారని ఆయన చెప్పారు. జిల్లా అధికారులు ప్రభుత్వం చర్యలు చేపట్టి, జిల్లాలో 20 మండలాల్లో ఉన్న మీసేవ కేంద్రాలకు అనుమతి ఇవ్వాలని అనేక సార్లు జిల్లా కలెక్టర్ కు సంబంధిత అధికారులకు కోరినా స్పందన లేదని అన్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా, మండల ఆదికారులు స్పందించాలని కోరారు. చివరి తేదీ అనేది తొలగించాలన్నారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి : యు ఎస్ పి సి



**సిద్ధిపేట బ్యూరో, ఆగస్ట్ 12 ( నినాదం):** ఉపాధ్యాయ సంఘాల పోరాటం కమిటీ (యు.ఎస్.పి.సి )ఆధ్వర్యంలో దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున అక్బర్పేట – భూంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా నాయకులు ర్యాకం మల్లేశం, గూడూరి శివాజీ తహశీల్దార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు . పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలను కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా కల్పించాలని అన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపచేయాలని సి పి ఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్. యాదయ్య,కె. హరికృష్ణ,యం. యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ 4వ మహాసభలను జయప్రదం చేయండి



**సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 12 ( నినాదం ):** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు సెప్టెంబర్ 6,7 తేదీలు కొండాపూర్ మండలం నిర్వహించే మహాసభల కరపత్రాన్ని డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి టి,అనిల్, సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ మాట్లాడుతూ విద్య ఉపాధి పోరాటాల సారధి యువజన ఉద్యమాల వారధి భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా 4వ మహాసభలు 2026 సెప్టెంబర్ 6, 7 తేదీల్లో కొండాపూర్ మండలంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ మహాసభలకు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారు, ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి ఎంపిక చేయబడిన యువజన నాయకులు ప్రతినిధులుగా హాజరు కానున్నారు, ఈ మహాసభలో జిల్లాలో యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు, ప్రధానంగా పరిశ్రమల్లో స్థానిక యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం చర్చిస్తామన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ యువకుల అట్లా నిర్లక్ష్య విధానాలపై ప్రతినిధులతో చర్చలు నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తామని అన్నారు, విద్యార్థి యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు పోరాటాల నిర్వహించడం ఎంతైనా అవసరం ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 6,7 తేదీలలో కొండాపూర్ లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం కోసం శ్రేయోభిలాషులు మిత్రులు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు రాజయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీకాంత్, బాబురావు, తదితరులు ఉన్నారు.

## తిరంగా యాత్ర పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



**పటాన్చెరు, ఆగస్టు 12 (నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవానికి మూడు రోజుల ముందు పటాన్‌చెరు పట్టణంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో సాగిన ఈ యాత్రలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా యాత్ర ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు, యువతే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు అని పేర్కొంటూ, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, జాతీయ స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# నగరంలో పెరుగుతున్న దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి భారం

**ప్రారంభ దశలోనే గుర్తిస్తే మూత్రపిండాల వైఫల్యాన్ని నివారించవచ్చు,**

**సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ మార్పిడి వైద్య నిపుణుడు, డాక్టర్ అరుణ్ పొన్న**




**కరీంనగర్, ఆగస్టు12(నినాదం) :** ఉత్తర తెలంగాణలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోందని హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ అరుణ్ పొన్న తెలిపారు. కరీంనగర్‌లో బుధవారం రోజున నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో పెద్దల్లో సుమారు 7.4 శాతం మందిలో మూత్రపిండాల పనితీరు తగ్గినట్లు భారత వైద్య పరిశోధనా మండలి నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణలో లేకపోవడం, నొప్పి నివారణ మందులను విచక్షణారహితంగా వాడటం, వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం మూత్రపిండాల వైఫల్యానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించేందుకు ప్రతి ఏడాది రక్తపోటు, రక్తంలో చక్కెర, సీరమ్ క్రియాటినిన్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మూత్ర పిండాల మార్పిడిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య రక్తవర్గం సరిపోకపోయినా, రక్తవర్గం సరిపోని దాత మార్పిడి, జత మార్పిడి,.. వంటి ఆధునిక విధానాలతో కిడ్నీ మార్పిడి చేసే అవకాశం ఉందని వివరించారు. సంక్లిష్టమైన, అధిక ప్రమాదం ఉన్న కేసులకు కూడా అనుభవజ్ఞులైన బహుళ వైద్య విభాగాల బృందంతో సమగ్ర చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఈ సందర్భంగా 2024లో తన సోదరుడు దానం చేసిన కిడ్నీతో విజయవంతంగా మార్పిడి చేయించుకున్న రాజు తన అనుభవాన్ని పంచుకున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో ఆశలు కోల్పోయిన సమయంలో డాక్టర్ అరుణ్ పొన్న అందించిన చికిత్స, మార్గదర్శకత్వంతో కోలుకున్నానని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందితే ఆధునిక కిడ్నీ మార్పిడి విధానాలతో సాధారణ జీవితాన్ని తిరిగి పొందవచ్చని పేర్కొన్నారు. మూత్రపిండాల వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్ర సమస్యలను నివారించవచ్చని డాక్టర్ అరుణ్ పొన్న స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జాగిని శ్రీధర్, స్టార్ట్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించవద్దు

**వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి**

**మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఆరోపణలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ కౌంటర్**



**కరీంనగర్, ఆగస్టు 12(నినాదం) :** కరీంనగర్ నగరపాలక సంస్థలో మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదన్న మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపణలను మేయర్ కొలగాని శ్రీనివాస్ ఖండించారు. గత ఐదు నెలల్లో మూడు పర్యాయాలు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించామని, ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదని చెప్పడం వాస్తవ విరుద్ధమని, జరిగిన సమావేశాల వివరాలన్నీ నగరపాలక సంస్థ అధికారిక రికార్డుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. మాజీ మేయర్‌గా పనిచేసిన రవీందర్ సింగ్ వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రాజకీయ విమర్శల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు కౌన్సిల్ ప్రజాస్వామ్య వేదికగా పనిచేస్తుందని, కార్పొరేటర్లు తమ డివిజన్ల సమస్యలను ప్రస్తావించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని మేయర్ స్పష్టం చేశారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మౌలిక వసతులు, విలీన గ్రామాల అభివృద్ధిపై నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. విమర్శలను స్వాగతిస్తామని, నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా నగర అభివృద్ధికి సహకరించాలని రవీందర్ సింగ్‌కు సూచించారు. "జరిగిన సమావేశాలను జరగలేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. కౌన్సిల్ సమావేశాలపై పూర్తి అవగాహనతోనే ముందుకు సాగుతున్నాం. మాటలతో కాకుండా పనులతో సమాధానం చెబుతాం. ఆరోపణలు కాదు.. కరీంనగర్ అభివృద్ధే మా అజెండా" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# పంప్ హౌస్‌ను సందర్శించిన మున్సిపల్ పాలకవర్గం

**మున్సిపల్ ఆస్తుల రక్షణకు పటిష్ట చర్యలు**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతంలో గల మంచినీటి సరఫరా పంపు హౌస్ ను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పాలకవర్గం తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలను పరిరక్షించేందుకు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడం పాటు ఆక్రమణలకు తావు లేకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఒకప్పుడు ఈ మానేరు పరివాహక ప్రాంతం నుండి జమ్మికుంట పట్టణానికి నిరంతరం నీటి సరఫరా జరిగిందని ప్రస్తుతం ఇక్కడ నుండి నీటి సరఫరా ఆపివేయడం జరిగిందని మిషన్ భగీరథ ద్వారా పట్టణానికి మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ఆస్తుల పరిరక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ ఆస్తులను ఎవరు కబ్జా చేసిన సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ రమేష్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**చైల్డ్ డెవలప్మెంట్ అధికారి ఎం సుగుణ**

**అంగన్వాడి ఆయాలకు చీరల పంపిణీ**



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు మండలంలోని అన్ని అంగన్ వాడి కేంద్రాలలో పనిచేస్తున్నటువంటి 47 మంది ఆయాలకుట్రస్టు నిర్వా హకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ చీరలను చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం సుగుణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ అంగన్వాడి పిల్లలకు తల్లిలాగ సేవలను అందించుచున్న ఆయాల సేవల ను మధురమ ట్రస్ట్ వారు గుర్తించి చీరలు అందించడం అభినందనీయం అని తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ అంగన్వాడికి కేంద్రానికి వచ్చే చిన్నపిల్లలకు భోజనం తినడంలో సహాయం చేయడము, అంగన్వాడి కేంద్ర పరిసరాలను శుభ్రపరచడము, పిల్లలను సురక్షితంగా కేంద్రానికి తీసుకొని రావడము మరియు ఇంటికి పంపడంలో బాధ్యత వహిస్తున్నటువంటి అంగన్వాడి ఆయాల సేవలు వెలగట్టలేమని తెలిపారు. తక్కువ వేతనంతో పని చేస్తూ పిల్లలను తమ పిల్లల్లాగా చూడడం అభినందనీయం అని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఏ భవాని మాట్లాడుతూ తాను గత నాలుగు సంవత్సరముల నుండి మధురమ ట్రస్ట్ వారు చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను చూస్తున్నానని, విద్యార్థులకు ప్లేట్లు, పరీక్ష ప్యాడ్లు, డిక్షనరీలు ఇవ్వడం, టాలెంట్ టెస్టులు నిర్వహించడం సమాజంలో పేదలకు వివిధ రకాల సేవ కార్యక్రమాలు చేయడము మనం చూస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు పి రమ్య, సిహెచ్ జ్యోతి, కే ప్రతిభ రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎన్ మహేందర్, టి రమేష్, మానవ వికాస వేదిక అధ్యక్షులు రొంటాల బుచ్చయ్య మండలంలోని ఆయాలు పాల్గొన్నారు.

# జాతీయ తైక్వాండో పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక

**రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు బంగారు, రెండు రజత పతకాలు సాధించిన విద్యార్థులు**



**కరీంనగర్, ఆగస్టు12(నినాదం) :** పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10 వరకు చొప్పదండిలో రాష్ట్రతైక్వాండో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 14వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల తైక్వాండో పోటీల్లో పూమ్సే విభాగంలో విద్యార్థులు పతకాలు సాధించారు. 6వ తరగతి విద్యార్థులు షేక్ ఆరిభ్ పాషా, ఆసంపల్లి శ్రీమాన్, సామల యశ్వంత్ బంగారు పతకాలు సాధించగా, 5వ తరగతి విద్యార్థులు బర్రె మాన్య షెర్లిన్, గిట్టవేని రిశ్విక్ రజత పతకాలు సాధించారు. వీరిలో ఆసంపల్లి శ్రీమాన్, సామల యశ్వంత్, గిట్టవేని రిశ్విక్ అక్టోబర్ 2 నుంచి 4 వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ నరేడ్ల కిరణ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.ఖ

# జమ్మికుంటలో జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం జనసేనదే!**

**పవన్ కళ్యాణ్ ఆశయాలే మార్గదర్శకం పనిచేస్తాం.**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి బండారి రాజ్ కుమార్**



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** జమ్మికుంట లోని పద్మశాలి భవనంలో బుధవారం జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జులు బండారీ రాజ్‌కుమార్, కృష్ణప్రియ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్షాల విమర్శలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనసేన పార్టీని తెలంగాణలో 'ఆంధ్ర పార్టీ' అని అనవసర విమర్శలు చేస్తున్న ఇతర రాజకీయ నాయకులకు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. "తెలంగాణలో పోటీ చేస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా కేవలం తెలంగాణకే పరిమితమైనది కాదు. ఈ విషయాన్ని గుర్తించి ఇతర పార్టీల నాయకులు విమర్శలు మానుకోవాలి" అని గళమెత్తి స్పష్టం చేశారు.

**అవినీతి రహిత పాలనే జనసేన పార్టీ లక్ష్యం..**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అవినీతికి తావులేకుండా నిష్పాక్షికంగా పనిచేసేందుకు జనసైనికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకులను, ప్రజలను పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారని, వారందరికీ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నట్లు వెల్లడించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగరడం ఖాయమని, ఈ లక్ష్య సాధన కోసం జనసైనికులు మరింత చురుగ్గా, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు యువకులు ఉమ్మడి కరీంనగర్ ఇన్చార్జి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జనసేనపార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరోధకుడు కౌశిక్ రెడ్డి..

**తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదు**

**ఎమ్మెల్యే పై విరుచుకుపడ్డ కాంగ్రెస్ నేత దేశం కోటి**





**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు కు పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో రచ్చ చేశారని కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి అన్నారు. బుధవారం జమ్మి కుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరీ రమేష్ ఆధ్వ ర్యంలో పట్టణంలోని వినాయక గార్డెన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేశిని కోటి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేందుకు ప్రణవ్‌బాబు చొరవతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అయితే ప్రణవ్‌బాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కౌశిక్‌రెడ్డి కార్యక్రమం లో వివాదం సృష్టించారని ఆరోపించారు. మంత్రులు హుందాగా వ్యవహరించాలని సూచించినప్పటికీ ఆయన తన తీరు మార్చుకోలేదని విమర్శించారు. ప్రణవ్‌బాబుపై కౌశిక్‌రెడ్డి అనుచరులు ఇష్టారీతిన విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని, వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కౌశిక్‌రెడ్డి లాంటి నాయకుడు నియోజకవర్గానికి అవస రం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే ఆయనకు 10వేల ఓట్లు కూడా దాటే పరిస్థితి లేదని, టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కదన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కార్యకర్తలు, నాయకులను పట్టించుకోని కౌశిక్‌రెడ్డిని నమ్ముకుని టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడవద్దని సూచించారు. బీసీ బిడ్డలు ఆలోచించాలి, బీసీ బంధు పథకం అమలుపైనా దేశిని కోటి ప్రశ్నలు సంధించారు. బీసీ బిడ్డలకు బీసీ బంధు అందిందా? అది ఎక్కడికి పోయిందో ఒక్క సారి ఆలోచించాలని కోరారు. కౌశిక్‌రెడ్డిని నమ్ముకుంటే భవిష్యత్తు దెబ్బతింటుం దని, మంచి మనసుతో ప్రజలకు సేవ చేస్తున్న ప్రణవ్‌బాబును విమర్శించవద్దని బీసీ వర్గాలకు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, హుజురాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్‌బాబు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

**అభివృద్ధి చేయాల్సిన ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారు.**

**పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్**

ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి అభివృద్ధి పనులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి అడ్డు తగులుతున్నారని దీని ప్రభావంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకుండా పోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఏ కార్యక్రమం నిర్వహించిన సహకరించాల్సిన ఎమ్మెల్యే అడ్డుపడుతూ ఆ కార్యక్రమాలను రసాభాసగా మార్చడమే లక్ష్యంగా తన చేష్టలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ సుంకరి రమేష్ పేర్కొన్నారు. ఇలాంటి నాయకుడిని ఎందుకు ఉన్నందుకు నియోజకవర్గం ప్రజలు తలలు పట్టుకుంటున్నారని ఇకపై అభివృద్ధి పనులకు అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రణవ్ బాబు సారథ్యంలో హుజరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పుంజు కుంటున్నాయని భవిష్యత్తులో కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఆయన తీసుకుంటాడని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ మండలాధ్యక్షుడు పరశురాములు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు చందారాజు ఒగ్గు రమేష్ మాచర్ల రాజు దిడ్డి రాము యాట్ల అశోక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొలుగూరి సదయ్య సాయిని రవి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి నాయకులు పంజాల అజయ్ చిన్నింటి నాగేంద్ర తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాత బజార్, రూరల్ పోలీస్‌స్టేషన్ మార్గంలో సీసీ రోడ్డు నిర్మించాలి

**అధ్వానంగా ఉన్న రహదారితో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులకు ఇబ్బందులు, మున్సిపల్ కమిషనర్‌కు వినతి**

**అబ్దుల్ రెహమాన్, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు**



**కరీంనగర్, ఆగస్టు12(నినాదం) :** పాత బజార్ జండా చౌరస్తా (పాత శివాలయం) నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా వరకు శాశ్వత సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ, బుధవారం రోజున మున్సిపల్ కమిషనర్‌కు కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ వినతి పత్రం సమర్పించారు. ఆయన కమిషనర్ కు ఇచ్చిన పత్రం లో ఈ విదంగా కోరారు. ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలు, అసమాన ఉపరితలంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ మార్గం హౌసింగ్ బోర్డు ప్రాంతం, పాత మార్కెట్‌కు ప్రధాన అనుసంధాన రహదారి కావడంతో నిత్యం అధికంగా రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. రహదారి పరిసరాల్లో దేవాలయం, మసీదు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని, సమీపంలోని పాఠశాలల విద్యార్థులు, పాఠశాల వాహనాలు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారి కారణంగా ప్రమాదాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలిక మరమ్మతులకు బదులుగా శాశ్వత సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేసి, సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం పనులను త్వరగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. రహదారి నిర్మాణంతో ప్రజల భద్రతతో పాటు సాఫీగా రాకపోకలు సాగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రోడ్డు ను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జీఆర్ఎంబీ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులను తొలగించాలి

**18వ సమావేశం ఎజెండాలో ప్రాజెక్టుల అంశం చేర్చడం సరికాదు,**

**మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల**



**కరీంనగర్, ఆగస్టు12(నినాదం) :** ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి నదీ యాజమాన్య మండలి (జీఆర్ఎంబీ) 18వ సమావేశ ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని గంగుల నివాసంలో బుధవారం రోజున నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్ల అంశం కీలకమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చట్టబద్ధమైన అనుమతులతోనే ప్రాజెక్టులను నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణలోని ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశ ఎజెండాలో చేర్చడం సరికాదన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఎంపీలంతా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి తెలంగాణ ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే, రాష్ట్రంలో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నెల 18లోగా ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అంశాన్ని తొలగించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**జాతీయ జెండాలతో కదం తొక్కిన బీజేపీ శ్రేణులు..**

**దేశభక్తి నినాదాలతో మార్మోగిన నగరం**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



**కరీంనగర్, ఆగస్టు12(నినాదం) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ బీజేపీ పశ్చిమ మండల అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీ డిఫెన్స్ పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, 2022 నుంచి కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమన్నారు. జాతీయ జెండా దేశ గౌరవం, సార్వభౌమత్వానికి ప్రతీక అని పేర్కొంటూ.. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలవాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో జాతీయ జెండాలు చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో నగరంలోని పలు ప్రాంతాలు మార్మోగాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ ప్రవీణ్‌రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, కర్రె పద్మ, అనిల్, ఇతర నాయకులు, బూత్ అధ్యక్షులు, ఢిల్లీ డిఫెన్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటి పై జాతీయ జెండా రెపరెపలాడాలి

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు**



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు జమ్మికుంట లోని తన నివాసం పైన జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొం దిం చాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వ హించడం జరుగుతుందని తెలి పారు. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడికి దేశం పై మమకారం దేశభక్తి కలిగి ఉండాలని ఇది మన అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ఈ సందర్భంగా సూచించారు.

# మృతురాలి కుటుంబానికి కౌన్సిలర్ స్వర్ణలత నరేష్ గౌడ్ ఆర్థిక చేయూత



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన సీర్ల అనిత రాణి అనారోగ్యంతో మృతి చెందగా ఆరవ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత–నరేష్ గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా అనారోగ్యం బారినపడగా కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం హైదరాబాద్ కు తరలించగా బుధవారం ఉదయం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. వారు హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేటు నర్సుగా పని చేసేవారు. నిరుపేద కుటుంబానికి చెందిన సీర్ల అనిత రాణి దహన సంస్కారాల ఖర్చు కోసం వారి కుమారులైన గోపి సాయి లకు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత–నరేష్ గౌడ్ రూ 5000 ఆర్థిక సహాయం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హోదార్చి ధైర్యం చెప్పారు.

# ఇజ్రాయెల్ పట్టణ నీటి నిర్వహణ విధానాలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ,ఆగస్టు 12 (నినాదం):** పట్టణాల్లో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న విధానాలు, సమర్థవంతమైన పాలనా వ్యవస్థలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ఇజ్రాయెల్‌లోని వివిధ నగరాల్లో అర్బన్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించిన అధ్యయన పర్యటనలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లో పట్టణ నీటి నిర్వహణ, నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం, నీటి మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరతను సవాలుగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన పాలన ద్వారా అవకాశంగా మార్చుకోవడంలో ఇజ్రాయెల్ అనుభవాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించడం, శుద్ధి చేసిన మురుగునీటిని దాదాపు 90 శాతం వరకు వ్యవసాయ అవసరాలకు పునర్వినియోగించడం, జీ ఐ ఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల మ్యాపింగ్, నాన్-రెవెన్యూ వాటర్ (ఎన్ ఆర్ డబ్ల్యు)ను 5 శాతం కంటే తక్కువ స్థాయిలో నియంత్రించడం వంటి విధానాలు పట్టణ నీటి నిర్వహణలో ఇజ్రాయెల్ సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా నదుల పునరుజ్జీవనం, పట్టణ జల వనరుల పరిరక్షణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, ఎడారీకరణ నివారణకు చేపడుతున్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నీటి నిర్వహణలో విస్తృతంగా వినియో గిస్తున్న తీరును అధ్యయనం చేసినట్లు తెలిపారు. అధ్యయన పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్‌లో భారత రాయబారి శ్రీ జె.పి. సింగ్‌ను కలుసుకుని భారత్--ఇజ్రాయెల్ సహకారం, ముఖ్యంగా పట్టణ నీటి నిర్వహణ రంగంలో ఇరు దేశాల మధ్య ఉన్న అవకాశాలు, అనుభవాలపై ఆయన నుంచి విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నట్లు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా పొందిన అనుభవాలు వరంగల్ నగర అండర్‌గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్ (యూ జీ ఎస్ ఎస్ ), తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం,జీ ఐ ఎస్ ఆధారిత నీటి మౌలిక వసతుల నిర్వహణ, నాన్-రెవెన్యూ వాటర్ తగ్గింపు, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం, పట్టణ చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగ పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో పాటు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్తీ, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ డైరెక్టర్లు, పట్టణాభివృద్ధి రంగానికి చెందిన అధికారులు, పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ నిర్వహణపై రాష్ట్ర అధికారి తనిఖీ



**కోదాడ,ఆగస్టు 12(నినాదం):** కోదాడ పట్టణంలోని 108 అంబులెన్స్‌ను రాష్ట్ర యాంత్రిక కార్యనిర్వహణ అధికారి సూర్యనారాయణ రాజు బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, ఆక్సిజన్ సదుపాయం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. వాహనం సక్రమంగా పనిచేస్తుందా, పరికరాలు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందేలా అంబులెన్స్‌లను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో 108 జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సలీం, జిల్లా కోఆర్డినేటర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను అణచివేస్తున్న ప్రభుత్వం



**మిర్యాలగూడ ఆగస్టు 12 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను ప్రతి రంగంలో అణిచివేయడాన్ని విమర్శిస్తూ మిర్యాల గూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు కూడా ప్రతి రంగంలో బీసీలను అవమానిస్తూ అణిచివేస్తున్నారు చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా బీసీ విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారు అలాగే ఉద్యోగ రంగంలో కూడా బీసీల కు అవకాశాలు లేకుండా చేస్తున్నారు రాజకీయ రంగంలో బీసీల జనాభా కు తగిన విధంగా పదవులను కేటాయించలేక పోతున్నారు బీసీలకు చట్ట సభలలో జనాభా ప్రాతినిధ్య ప్రకారం రిజర్వేషన్లు కావాలని ఎంతోకాలంగా ఉద్యమిస్తున్నప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదు అని ఆయన అన్నారు .. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు ,బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు సతీష్, రాంబాబు, ఉపేందర్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం పార్కును పరిశీలించిన ఆర్డీవో



**కోదాడ,ఆగస్టు 12(నినాదం):** కోదాడ పట్టణంలోని గ్రంథాలయం పార్కును ఆర్డీవో సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. పార్కులోని వసతులు, పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించి ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసు కున్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కును మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయాన్ని ఆనుకుని ఉన్న పూల దుకాణం వెనుకవైపు డోర్లను తక్షణమే మూసివేయాలని, అక్కడ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రైనీ ఆర్డీవోలు బి. రవితేజ, కే. అనూష ఉన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం




**కోదాడ, ఆగస్టు 12 (నినాదం):** 91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు మేకల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడ పట్టణంలోని పాత వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. చదువుతూ--చదువుకై పోరాడు' నినాదంతో సాగిన 91 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం--2020తో విద్యారంగంలో కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మార్గం సుగమం అవుతోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు పెంచి, ఉచిత నాణ్యమైన విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు షేక్ నాగుల్‌మీరా, బి.మహేష్, నాగేంద్రబాబు, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, నవీన్, గోపి, ఉపేందర్, సుష్మ, భారతి, అఫ్రీన్, భాను, శైలజతో పాటు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మూగజీవాల స్థలంలో నిర్మాణాలు వద్దు..

- పశువుల బతుకులకు దిక్కెవరు?
- 80 ఏళ్లుగా బందెల దొడ్డి..



**కోదాడ,ఆగస్టు 12(నినాదం):** అనంతగిరి మండలంలోని మొగలాయికోట గ్రామంలో పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర మూగజీవాలకు ఆశ్రయంగా ఉన్న బందెల దొడ్డి స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించవద్దని గ్రామస్తులు కోరారు. గత 80 ఏళ్లుగా బందెల దొడ్డిగా వినియోగిస్తున్న ఈ స్థలంలో శ్రీశక్తి భవనం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఇందులో భాగంగా పశువుల కోసం గ్రామస్తులు ఏర్పాటు చేసిన స్టాండ్‌ను తొలగిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువుల కోసం తమ తండ్రి గాయం వెంకట్‌రెడ్డి ఈ స్థలాన్ని దానంగా ఇచ్చారని ఆయన కుమారుడు గాయం అప్పిరెడ్డి తెలిపారు. దానం చేసిన స్థలాన్ని బందెల దొడ్డికే వినియోగించాలని, ఇతర నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆంబోతు మృతి చెందగా ఇదే స్థలంలో ఖననం చేశామని గుర్తుచేశారు. బందెల దొడ్డి స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. దాతల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు స్థలాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారని అప్పిరెడ్డి అన్నారు. ఇదే స్థలంలో ఇతర ఏ నిర్మాణాలు జరిపినా సహించేది లేదని, అవసరమైతే కుటుంబంతో సహా నిరాహార దీక్షకు దిగుతామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామస్తులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లుకు అందజేశారు. అంతేకాకుండా ఇన్చార్జి ఎంపీడీవో షేక్ సుష్మ, పంచాయతీరాజ్ ఏఈ, డీఈ లకు సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించినట్లు వారు తెలిపారు.

**స్థలం కొరతతోనే స్త్రీశక్తి భవనానికి తీర్మానం..**
**- ఎంపీడీవో సుష్మ...**

ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో సుష్మను వివరణ కోరగా.. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి స్థలాన్ని గ్రామపంచాయతీకి దానం చేసిన విషయం వాస్తవమే నని తెలిపారు. అయితే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో స్థలం కొరత ఉండటంతో ప్రస్తుతం వినియోగంలో లేని బందెల దొడ్డి స్థలాన్ని స్త్రీశక్తి భవనానికి వినియోగించేందుకు తీర్మానం చేసినట్లు ఆమె స్పష్టం చేశారు.

# జాతీయత భావం పెంపొందించడమే లక్ష్యం

- బిజెపి భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి కీర్తి రెడ్డి
- ఘనంగా హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ




**భూపాలపల్లి, ఆగస్టు 12( నినాదం):** నరేంద్రమోదీ పిలుపుమేరకు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు 79వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై సుమారు 300 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, ఉత్సాహం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతదేశం పట్ల తమకున్న గౌరవాన్ని, జాతీయ పతాకంపై ఉన్న అభిమానాన్ని విద్యార్థులు ఘనంగా చాటుకున్నారు. పట్టణ ప్రముఖులు, మేధావులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయత భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. మనమంతా భారతీయులమే అనే బావనతో దేశంపై విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ జెండా కింద ప్రజలంతా ఐక్యంగా ఉంటే దేశాన్ని ఏ శక్తి ఓడించలేదన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పోస్ట్ ఆఫీస్ ల ద్వారా జాతీయ జెండాలలో అందుబాటులోకి తెచ్చిందని, గ్రామాల్లో అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి జెండాలు అందించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నం యుగంధర్, ఎరుకల గణపతి, జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**హనుమకొండ,ఆగస్టు 12 (నినాదం):** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు 56వ డివిజన్లో బుధవారం పర్యటించారు. 56వ డివిజన్లోని వివేక నగర్,జవహర్ కాలనీ,పరిమళ కాలనీ, శ్రీ సాయి నగర్ కాలనీలలో సుమారు రూ 3. 85కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తూ డివిజన్ల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి గ్రామాన్ని,డివిజన్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం గోపాలపురం జంక్షన్లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు కాలనీ వాసులకు గతంలో ఎమ్మెల్యేనీ కలిసి సహాయం కోరడంతో వారికి బుధవారం ఎమ్మెల్యే రూ 2. 5లక్షల రూపాయలను వారికి అందజేశారు. కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు,ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్,కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి దూలం సదానందం,సీనియర్ నాయకులు చింత రమేష్,మర్రి ప్రభాకర్,దూలం పరమేష్,చింతరెడ్డి రవీందర్ రెడ్డి,నలుబాల దామోదర్, చిప్ప ప్రభాకర్,బోనగాని రాంప్రసాద్,రమేష్,డివిజన్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి శనిగరపు అనిత,మహిళ నాయకురాలు పల్లకొండ సరోజన,గుగులోతు స్వరూప,అన్న విజయ, యూత్ నాయకులు లావుడియా రవి నాయక్, పాలకొండ విజయ్ సూర్య, ఇమ్మడి రాజీవ్,సుందర్, రామకృష్ణ,సందీప్ ప్రేమ్ సాగర్, మహమ్మద్ రియాజ్, కిషోర్,గొల్లపల్లి చిరంజీవి, రవి, వంశీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రాజకీయాల్లో మార్పు రావాలి

### పల్లా దేవేందర్‌రెడ్డి




**చింతపల్లి, ఆగస్టు 12 (నినాదం):** దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి కలగాలన్నా, కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నా రాజకీయ మార్పు అవసరమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యా వ్యవస్థలో లోపాలు, పేపర్ లీకేజీలు, ప్రజాస్వామ్య హక్కుల హరణం వంటి సమస్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. కుల, మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, విద్య, ఆరోగ్యం, మహిళా భద్రత, పర్యావరణం తదితర రంగాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు డి. సుదర్శన్‌రెడ్డి, ఎస్. కనకాచారి, ఎం.డి. మైనుద్దీన్, పల్లా రంగా రెడ్డి, శైలేష్, ఎం. శేఖరాచారి, బుచ్చయ్య, శంశుద్దీన్, కె. వెంకటయ్య, పల్లపు లక్ష్మయ్య, రామకృష్ణ, వెంకటరత్నం, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం



**ఆలేరు, ఆగస్టు 12(నినాదం):** పంటల సాగుతో పాటు పశుపోషణ, కోళ్ల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు వంటి అనుబంధ కార్యకలాపాలను చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాధార ప్రాంతాల్లో సమీకృత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, సాగునీటి కొరతను అధిగమించేందుకు పంటల వైవిధ్యీకరణ ఎంతో ఉపయోగపడుతుందని ఆలేరు ఏడీఏ నిర్మల తెలిపారు. భూమి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలకు అనుగుణంగా కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. తెలంగాణ భువనగిరి రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా పంటలతో పాటు పశుపోషణ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవచ్చన్నారు. పంటల అవశేషాలను పశుగ్రాసంగా, పశువుల పేడ, మూత్రాన్ని జీవ ఎరువుల తయారీలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల గట్లపై పండ్ల మొక్కలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు, అనువైన చెట్లను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయంతో పాటు భూమి సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పి ఏ సి ఎస్ సీఈవో వెంకట్‌రెడ్డి, సర్పంచ్ యాదిరెడ్డి, ఉప సర్పంచ్‌లు యాదగిరి, దశరథ, ఏఈవోలు అంజయ్య, శివకుమార్, భార్గవి, తిరుమలరావు, ఆత్మ బీటీఎం వేణు, రైతులు పాల్గొన్నారు.

## వేతనాలు కోత సరే.. చికిత్సలు ఏవి.?

- బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దశరథ నాయక్



**మిర్యాలగూడ ఆగస్టు 12 (నినాదం):** మూడు నెలలుగా వేతనాలలో కోత ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దార్లకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల హెల్త్ కార్డులు ఇప్పటికీ డౌన్లోడ్ కావడం లేదని,చికిత్సలు అందించడం లేదని అయినప్పటికీ మూడు నెలల్లో వేతనాలలో కోత విధించి ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ ప్రశ్నించారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన బంజారా ఉద్యోగుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దార్లకు కార్పొరేట్ వైద్యం అందించడం కోసం వారి వేతనంలో బేసిక్ పే లో 1. 5శాతం తీసుకుని మూడు నెలలు దాటిన చికిత్సలు అందించకపోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఒకవైపు చికిత్సలు అందించే విషయంలో ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రులతో సరైన ఒప్పందం చేసుకోక పోవడం మరోవైపు చికిత్స అందించకుండానే వేతనాల్లో కోత విధించడం ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షన్ దారులను అవమానాలకు గురి చేయడం లాంటిదేనని అన్నారు. ఇప్పటికే లక్షలాదిమంది ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దారులు కార్డులు డౌన్లోడ్ అవుతాయోమో అని ఆశతో నెట్ సెంటర్ లో చుట్టూ తిరుగుతున్నారని, కొంతమంది ఉద్యోగ ఉపాధ్యాయులు,పెన్షన్ దారులు చికిత్సల కోసం ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. చికిత్సలు అందించకుండానే వేతనంలో కోత విధించిన మే,జూన్,జూలై నెలల వేతనాలను తిరిగి ఉద్యోగుల, పెన్షన్ దార్ల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్ కమిటీలో సభ్యులుగా ఉన్న వివిధ సంఘాల సంఘాల నాయకులు ఈ విషయమై నోరు మెదపకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. హెల్త్ కార్డుల జారీ చికిత్సలు అందించే విషయంలో ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మక్ల, సైదా, జామ్లా లక్ష్మణ్ నాయక్, శ్రీను నాయక్,చీనా నాయక్,రమేష్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మౌలిక వసతుల విస్తరణపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హన్మకొండ, ఆగస్టు 12, (నినాదం):** వరంగల్ జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు 4జీ, 5జీ మొబైల్ సేవల విస్తరణ, నెట్‌వర్క్ బ్లాక్‌స్పాట్ల తొలగింపు, కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో జిల్లాలో మొబైల్ కనెక్టివిటీ విస్తరణ స్థితి, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరై ఏర్పాటు చేసిన టవర్ల వివరాలు, నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిచ్చారు. జూన్ 2026 నాటికి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 218 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 217 గ్రామాలకు మొబైల్ కనెక్టివిటీ, 216 గ్రామాలకు 4జీ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. 47 గ్రామాల్లో 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో డిజిటల్ కనెక్టివిటీ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఒక్క గ్రామం కూడా నెట్‌వర్క్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదని, 4జీతోపాటు 5జీ సేవలను కూడా విస్తరించాలని వరంగల్ ఎంపీ కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవలు, డిజిటల్ లావాదేవీలకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ కనెక్టివిటీ అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న నిధులను సద్వినియోగం చేసుకుని వరంగల్‌లో మిగిలిన నెట్‌వర్క్ లోటుపాట్లను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడమే నా లక్ష్యం అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు.

## స్నేహమేరా జీవితం అంటూ నినదించిన చిన్ననాటి మిత్ర బృందం



**మిర్యాలగూడ ఆగస్టు 12( నినాదం ):** ఒకటి కాదు రెండు కాదు 30 సంవత్సరాల ముందటి ముచ్చట.. 1996 సంవత్సరంలో 5వ తరగతి నుండి కలిసి చదువుకున్న విద్యార్థులు అంతా పదోతరగతి అభ్యసించిన తర్వాత విడిపోవడం సహజమే అలా విడిపోయిన వారు ఉన్నత విద్య ఇతర వ్యాపారాలు కుటుంబ పరమైన కోరికలతో వేరు వేరుగా ఉన్నవారు ఇటీవల కొందరి ప్రమేయంతో ఆ పదో తరగతి విద్యార్థులంతా ఒక వేదికలో ఆత్మీయంగా కలుసుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో నేతాజీ పాఠశాలలో పదవ తరగతి విద్యాభ్యాసం చేసిన వారందరూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకొని కలుసుకున్నారు. వారిలో కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి హోదాలో ఉండగా, మరికొందరు వ్యాపారాలు చేసుకుంటూ కొందరు విదేశాల్లో స్థిరపడిన వారందరూ ఆత్మీయ సమ్మేళనంలో కలిసి చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహలలో మునిగిపోయారు. తమ పాఠశాల రోజుల్లో తాము చేసిన అల్లరి,చిలిపి చేష్టలను ఒకరికి ఒకరు గుర్తు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఇప్పటినుండి మనమంతా దోస్త్ మేరా దోస్త్ అంటూ ఆప్యాయంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని మన అందరిలో ఎవరికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ సహకరించాలని పరస్పరం వాగ్దానాలు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తాహెర్, రజాక్, ప్రవీణ్, సత్యం, ఉస్మాన్,రవి, సైదా, ముజాఫిర్, ఫెరోజ్, రామన్ బృందం పాల్గొన్నారు

# బెల్ట్‌షాపులకు తొగర్రాయిలో ఉక్కుపాదం

గ్రామ సభ తీర్మానం
నిబంధనలు ఉల్లంఘిస్తే
కేసులు తప్పవని హెచ్చరిక
సర్పంచ్ చిలుక స్రవంతి సతీష్



**సుల్తానాబాద్, ఆగస్టు 12 (నినాదం):** గ్రామీణ ప్రాంతాల్లో నిబం ధనలకు విరుద్ధంగా కొ నసాగుతున్న బెల్ట్‌షాపుల నిర్వహణకు సుల్తానా బాద్ మండలం తొగర్రాయి గ్రామం చెక్ పెట్టేందు కు సిద్ధమైంది. బెల్ట్‌షాపుల నిర్వహణను అడ్డుకో వాలని గ్రామ సభ లో తీర్మానం చేయడంతో పా టు, సంబంధిత నిర్వాహకులకు అధికా రులు నో టీసులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్ చిలుక స్ర వంతి సతీష్ ఆధ్వర్యం లో గ్రామ సభలో ఈ అం శంపై చర్చించి, బెల్ట్‌షాపుల నిర్వహ ణపై కఠినంగా వ్యవహరించా లని నిర్ణయించారు. గ్రామంలో ని బంధ నలకు విరుద్ధంగా మద్యం విక్రయా లు సాగి తే సహించేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేసి, నిబంధ నలు ఉల్లంఘిస్తూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే పంచా యతీరాజ్ చట్టం-2018 ప్రకారం చర్యలు తీసు కుంటామని సర్పంచ్ హెచ్చరిం చారు. అవసరమై తే పోలీసుల సహకారంతో కేసులు నమోదు చే యిస్తామని తెలిపారు. బెల్ట్‌షాపుల నియంత్రణతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్య మని, ప్రజల ఆరోగ్యం, కుటుం బాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ సభ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ సభ నిర్ణయంతో బెల్ట్‌షాపుల నిర్వాహకుల్లో ఉత్కంఠ నెలకొనగా, గ్రామస్తులు మాత్రం ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కోర్టు నుంచి క్రీడా మైదానానికి.. మహిళా న్యాయవాదుల సందడి



**మంచిర్యాల, ఆగస్టు 12 (నినాదం):** నిత్యం కోర్టు గదుల్లో కేసుల వాదనలు.. న్యాయపరమైన అంశాలపై వాదోపవాదాలు.. తీరికలేని వృత్తి జీవితం.. ఇలా ఒత్తిడితో సాగే మహిళా న్యాయవాదుల రోజువారీ జీవితానికి కాసేపు ఆటల మైదానం ఆహ్లాదాన్ని పంచింది. వృత్తి బాధ్యతలను పక్కన పెట్టి చిన్నారుల్లా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటూ మహిళా న్యాయవాదులు సందడి చేశారు. మహిళా న్యాయవాదుల కోసం నిర్వహించిన ప్రత్యేక క్రీడా పోటీలను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఏ. నిర్మల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. కవిత, రెండో అదనపు జడ్జి శ్రీమతి నిరోషా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో పాల్గొన్న మహిళా న్యాయవాదుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. కేసుల వాదనలు, క్లయింట్లతో సమావేశాలు, న్యాయపరమైన పనులతో నిరంత రం బిజీగా ఉండే మహిళా న్యాయవాదులకు ఇలాంటి కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని, పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ శైలజ, శ్రీలత, వైస్ ప్రెసిడెంట్ టి. మం జులతో పాటు మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని అభినందించి ప్రశంసలు తెలిపారు.

# కన్న కొడుకే కాల యముడు.. తండ్రి హత్యతో కలకలం

కన్నతండ్రినే కడతేర్చి..
కనిపించడం లేదంటూ నాటకం



**మంచిర్యాల, ఆగస్టు 12 (నినాదం):** కన్న తండ్రితో వచ్చిన విభేదాలు ఓ కుమారుడిని దారుణానికి దారి తీశాయి. తండ్రిని పథకం ప్రకారం హత్య చేసి.. ఆనవాళ్లు లేకుండా మృతదేహాన్ని తగులబెట్టి.. ఆపై ఏమీ తెలియనట్లు కుటుంబ సభ్యులతో కలిసి అతని కోసం వెతికినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చివరకు మిస్సింగ్ కేసు వెనుక దాగిన హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితుడు భీమిని ఉదయ్ (23)ను అరెస్టు చేసినట్లు జైపూర్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

**ప్రేమ వివాహమే వివాదానికి కారణం**

ఉదయ్ ప్రేమ వివాహం చేసుకోవడం అతని తండ్రి లక్ష్మణ్‌కు ఇష్టం లేదని పోలీసులు తెలిపారు. ఈ విషయమై తండ్రి తరచూ కుమారుడిని, అతని భార్యను దూషిస్తూ ఇబ్బందులకు గురిచేసేవాడని విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. దీంతో ఉదయ్ కిష్టంపేట నుంచి భీమారంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి అక్కడ ఉంటున్నాడు. ఈ క్రమంలో 2025 జూలై 21న లక్ష్మణ్ భీమారంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి కోడలితో గొడవ పడినట్లు పోలీసులు తెలిపారు. అప్పటికే తండ్రిపై కోపంతో ఉన్న ఉదయ్.. ఇదే అవకాశంగా భావించి పథకం అమలు చేసినట్లు వెల్లడైంది.

**బైక్‌పై తీసుకెళ్లి.. గొంతు పిసికి**

తండ్రిని తన బైక్‌పై భీమారం శివారులోని గొల్లవాగు ప్రాజెక్టు ప్రాంతానికి తీసుకెళ్లిన ఉదయ్.. అక్కడ గొంతు పిసికి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని చెట్ల పొదల్లో పడవేసి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు వెల్లడించారు. హత్య అనంతరం ఏమీ జరగనట్లు అక్కడి నుంచి వెళ్లిపోయి.. తండ్రి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మణ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేయించి మిస్సింగ్ కేసు నమోదు చేయించినట్లు పేర్కొన్నారు.

**9 రోజుల తర్వాత వెలుగులోకి..**

గొల్లవాగు అటవీ ప్రాంతంలో జూలై 30న గుర్తు తెలియని మృతదేహం లభించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. మృతదేహంపై ఉన్న దుస్తులు, చెప్పులు తదితర ఆనవాళ్ల ఆధారంగా అది లక్ష్మణ్‌దేనని కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. అయితే అసలు హత్య ఎలా జరిగిందన్న విషయం మాత్రం విచారణతోనే బయటపడింది.

**బైక్ కీలక ఆధారం**

విచారణలో ఉదయ్ చెప్పిన వివరాల ఆధారంగా హత్యకు ఉపయోగించినట్లు తెలిపిన ఎరుపు రంగు హీరో గ్లామర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాలు.. క్షణికావేశం.. చివరకు కన్నతండ్రి ప్రాణాలకే ముప్పుగా మారాయి. తండ్రి కనిపించడం లేదంటూ వెతికిన కుమారుడే హత్యకు పాల్పడినట్లు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కేసు దర్యాప్తులో భాగంగా మరిన్ని ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించాలి

విద్యార్థులు ఎదుర్కొంటున్న రాకపోకల దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక చర్యలు
ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి.. యూరియా వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షించాలి
మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని ఆగస్టు 12( నినాదం) :** మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో ఖాళీగా ఉన్న మల్లేపల్లి డిగ్రీ కళాశాల లో తరగతులను తాత్కాలిక ప్రాతిపదికన అక్కడ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. కళాశాల భవనం, తరగతి గదులు, ఖాళీగా ఉన్న మొదటి అంతస్తును పరిశీలించారు. మల్లేపల్లి డిగ్రీ కళాశాలకు దూరం ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు కళాశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ముఖ్యంగా మహిళా విద్యార్థులు రాకపోకల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిన విషయాన్ని ఆయన తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మల్లేపల్లి డిగ్రీ కళాశాల తరగతులను తాత్కాలికంగా మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఖాళీగా ఉన్న మొదటి అంతస్తులో నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను సమన్వయంతో కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి**

రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరానికి మించి యూరియాను వినియోగించకుండా రైతులకు సూచనలు చేయాలని, సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి..**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగు కాలువలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల బోనాల సందడి..

పాఠశాలలో పల్లె పరిమళం



**మంచిర్యాల, ఆగస్టు 12(నినాదం):** చేతిలో బోనం.. నుదుటన బొట్టు.. నోట తెలంగాణ పల్లె పాట.. అమ్మవారి వేషంలో చిన్నారి.. పోతురాజు వేషంలో మరో బాలుడు.. ఇలా పాఠశాల ప్రాంగణంలో కనిపించిన దృశ్యాలు అందరినీ కాసేపు పల్లె వాతావరణంలోకి తీసుకెళ్లాయి. బోనాల పండుగను మదర్స్ ప్రైడ్ పాఠశాల విద్యార్థులు జరుపుకున్న తీరు సంప్రదాయాలపై వారి ప్రేమను చాటింది. బుధవారం నాస్పూర్ లోని తాళ్లపల్లి ఫ్లాట్స్‌లోని పాఠశాలలో నిర్వహించిన బోనాల వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనం ఎత్తుకున్న చిన్నారులు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా పోశమ్మ దేవాలయానికి వెళ్లారు. తమకు తెలిసిన సంప్రదాయాన్ని తమదైన చిన్న అడుగులతో ముందుకు తీసుకెళ్లారు. ఆలయంలో గ్రామదేవతలకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.

**బోనం వెనుక కథ తెలుసుకున్న చిన్నారులు**

బోనం అంటే కేవలం పండుగ కాదని.. తెలంగాణ ప్రజల జీవన విధానం, విశ్వాసం, గ్రామదేవతలతో ముడిపడిన సంస్కృతికి ప్రతిరూపమని పాఠశాల ప్రిన్సిపాల్ దండ రామకృష్ణారెడ్డి విద్యార్థులకు వివరించారు. బోనం ఎందుకు సమర్పిస్తారు? గ్రామదేవతలను ఎందుకు కొలుస్తారు? అనే విషయాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పారు. పుస్తకాల్లో చదివే సంస్కృతి కంటే.. కళ్లముందు కనిపించే సంస్కృతి పిల్లల మనసుల్లో ఎక్కువకాలం నిలిచిపోతుందనేలా కార్యక్రమం సాగింది. అమ్మమ్మలు, తాతయ్యల కాలం నుంచి వస్తున్న ఆచారాలను చిన్నారులు స్వయంగా ఆచరించడం తల్లిదండ్రుల్లోనూ ఆనందాన్ని నింపింది.

**వేషాల్లో చిన్నారులు.. సంప్రదాయాల్లో పెద్ద సందేశం**

అమ్మవారు, పోతురాజు తదితర వేషధారణల్లో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోనం ఎత్తుకుని అడుగులు వేస్తూ సాగిన ఊరేగింపులో వారి ఉత్సాహం కనిపించింది. ఆలయానికి చేరుకున్న అనంతరం విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కొందరి కళ్లలో ఉత్సాహం.. మరికొందరి ముఖాల్లో పండుగ ఆనందం కనిపించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రేగళ్ల ఉపేందర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. పండుగలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వదీప్తి, సంధ్య, రజిత, సరిత, సుమలత, శ్రీవాణి, రాజేశ్వరి, పద్మ, స్రవంతి, షానాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా "చేయూత" పింఛన్లు అందించాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 12 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, అర్హతల పరిశీలనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలసిరి కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్ష నిర్వహించి అధికారులకు కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒకొత్త చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎక్కడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. తెలంగాణ జలసిరి పథకం కింద సోక్ పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు గుర్తించిన దుకాణాలను సీజ్ చేయాలనీ, భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివాకర్ రావు పాలనలో మంచిర్యాల అభివృద్ధి కుంటుపడింది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్



**మంచిర్యాల, ఆగస్టు 12 (నినాదం):** మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు 20 ఏళ్ల పాలనలో మంచిర్యాల నియోజకవర్గం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు విజిత్‌రావు ఇటీవల బీజేపీ, రఘునాథ్ వెరబెల్లిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు తన ఘనతేనని దివాకర్‌రావు చెప్పుకోవడం సరికాదని, ప్రాజెక్టు కోసం ఆయన చేసిన ఉద్యమం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ముంపు బాధితులకు పెండింగ్ పరిహారం గత ప్రభుత్వ హయాంలోనే ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. రైతుల సమస్యలపై రఘునాథ్ వెరబెల్లి దండేపల్లి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారని, గూడెం లిఫ్ట్ పైపుల సమస్యపై ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రైతుల కోసం పోరాడుతున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీపై, రఘునాథ్ వెరబెల్లిపై అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించిన వెంకటేశ్వర్‌గౌడ్.. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, మంచిర్యాలలో రఘునాథ్ వెరబెల్లి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జయరామరావు, కమలాకర్‌రావు, కుర్రే చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్‌లపై ఉత్కంఠ..

కోర్టు తీర్పుపైనే అందరి చూపు..
హడావుడి ప్రమాణ స్వీకారాలతో గందరగోళం..
పాతవారికా? కొత్తవారికా?
17న కోర్టు ఆదేశాలు ఎటువైపు.. రైతుల్లో తీవ్ర ఆసక్తి..



**సుల్తానాబాద్, ఆగస్టు 12 (నినాదం):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీ ఎస్) చైర్మ న్‌ల నియామక వ్యవహారం సుల్తానా బాద్ ప్రాం తంలో తీవ్ర ఉత్కంఠకు దారితీ స్తోంది. ప్రభుత్వం నామినే ట్ చేసిన చైర్మన్‌లు హడా వు డిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపడు తుండగా.. మరో వైపు నియామకాలపై న్యాయప రమైన వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 17న కోర్టు వెలువరించే ఆదేశాలు ఎటువైపు ఉంటాయన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఇప్పటికే సుద్దాల, గర్రెపల్లి, కనుకుల, చిన్నకల్వ ల తదితర పీఏసీఎస్‌లకు ప్రభుత్వం నామినేట్ చేసిన చైర్మన్‌లు వరుసగా ప్రమాణ స్వీకారం చేశా రు. దీంతో సహకార సంఘాల్లో కొత్త పాలన ప్రారం భమైన ట్లుగా కనిపిస్తున్నా.. కోర్టు వ్యవహారం నేప థ్యంలో ఈ నియామకాలకు భవిష్యత్తులో ఎలాం టి పరిణామాలు ఎదురవు తా యన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పాతవారికా.. కొత్తవారికా....**

పీఏసీఎస్ చైర్మన్ పదవుల విషయంలో అసలు ట్విస్ట్ ఇదేనని సహకార సంఘాల వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రభుత్వం నామినేట్ చేసిన కొత్తవా రికి అవకాశం కొనసాగుతుందా? లేక గతంలో ఉ న్న చైర్మన్‌లకే మళ్లీ బాధ్యతలు దక్కుతాయా? అన్నది 17న కోర్టు ఆదేశాల తర్వాతే స్పష్టత వ చ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతు న్నాయి. ఒకవై పు నామినేటెడ్ చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేస్తుండగా.. మరోవైపు న్యా యపర మైన అంశాలు కొనసా గుతుం డటంతో పీఏసీ ఎస్‌ల భవిష్యత్ పాలనపై సందిగ్ధత నెల కొంది. దీంతో ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన చైర్మ న్‌ల పరిస్థితి ఏమిటి? వారి పదవులు కొనసాగు తా యా? కోర్టు ఆదేశాలతో ఏమైనా మార్పులు జరుగుతాయా? అనే ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి.

**హడావుడి ఎందుకంటూ ప్రశ్నలు...**

కోర్టు వ్యవహారం కీలక దశలో ఉన్న సమయంలోనే వరుసగా ప్రమాణ స్వీకారాలు నిర్వహించడం పై రైతులు, సహకార సంఘాల సభ్యుల్లో చర్చ జరు గు తోంది. "కోర్టు నిర్ణయం కోసం వేచి చూడకుండా ఇంత హడావుడిగా ప్రమాణ స్వీకా రాలు ఎందు కు?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, సం బంధిత అధికారులు ఈ వ్యవహా రంపై స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

**రైతుల ప్రయోజనాలే కీలకం..**

పీఏసీఎస్‌లు కేవలం రాజకీయ పదవులకు పరిమి తమైన సంస్థలు కావని, రైతుల రుణాలు, ఎరువులు, విత్తనాలు, పంటల కొనుగోళ్లు తదితర అంశా లతో నేరుగా సంబంధం ఉన్నాయని రైతులు చె బుతున్నా రు. చైర్మన్‌ల నియామకాలపై నెలకొన్న అనిశ్చితి వల్ల సహకార సంఘాల కార్యకలాపా లకు ఎలాంటి ఆటంకం కలగకూడదని వారు కోరు తున్నారు.

**ప్రభుత్వ నిర్ణయం.. ఒకవైపు..**
**కోర్టు ఆదేశాలు మరోవైపు..**

ఇప్పటికే ప్రమాణ స్వీకారం చేసిన కొత్త చైర్మన్‌లు ఇంకోవైపు.. గత చైర్మన్‌ల భవిష్యత్తు మరోవైపు.. ఇలా పీఏసీఎస్ చైర్మన్‌ల వ్యవహారం నాలుగు మలుపులతో ఉత్కంఠగా మారింది. ఈనెల 17న కోర్టు ఆదేశాలు వెలువడిన తర్వాతే పాతవారికా.. కొత్తవారికా అనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో సుల్తానాబాద్ ప్రాంతంలోని పీఏసీఎస్‌లపై అందరి దృష్టి నిలిచింది.

# ఇంటింటికీ పెన్షన్ దరఖాస్తులు..

ప్రజల చెంతకే ఒకటో వార్డు కౌన్సిలర్..
అర్హు ల ఇళ్లకు వెళ్లి దరఖాస్తుల స్వీకరణ .. కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్...



**సుల్తానాబాద్, ఆగస్టు 12 (నినాదం):** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకా లు చేరువ చేయాలనే లక్ష్యం తో సుల్తానాబాద్ మున్సి పాలిటీ పరిధిలో పెన్షన్ దరఖాస్తుల స్వీ కరణ ప్రక్రియ కొనసాగుతోంది. పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభు త్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో 1వ వార్డు సుగ్లంపల్లిలో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నా రు. ఇందులో భాగంగా 1వ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి నే రుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి దరఖాస్తు ఫారాలను నింపించి స్వీకరిస్తున్నారు. కార్యా లయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్ మాట్లా డుతూ.. అర్హత ఉన్న ప్రతి నిరు పేదకు పెన్షన్ అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

# పెండింగ్‌లోని 6 డీఏలు వెంటనే ప్రకటించాలి

దామరపల్లి జైపాల్ రెడ్డి..
పీఆర్సీ అమలు చేయాలి.. ఈహెచ్ఎస్‌పై పూర్తి వివరా లు వెల్లడించాలి



**సుల్తానాబాద్, ఆగస్టు 12 ( నినాదం):** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపా ధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యులు దామరపల్లి జ యపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెండిం గ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే ప్రకటించడంతో పాటు పీ ఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. తె లంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెంబర్‌షి ప్ అభియాన్‌లో భాగంగా బుధవారం సుల్తానాబా ద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యా యులతో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉ ద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని అన్నారు. పెండిం గ్‌లో ఉన్న ఆరు డీఏలను ప్రకటించి, పీఆర్సీని అమలు చేయడంతో పాటు ఉద్యోగులకు సంబం ధించిన ఈహెచ్ఎస్ అంశంపై పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి జిల్లా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గుండవేని జగన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పాకాల విజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రమేష్‌బాబు, జిల్లా బాధ్యులు మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్మగ్లర్లతో అధికారుల జోడీ..

# పీడీఎస్ మాఫియా విచ్చలవిడి!

**హుస్నాబాద్‌లో దర్జాగా రేషన్ బియ్యం దందా**

**డీఫాల్ట్ మిల్లర్లకు రవాణా.. భయమే లేదు ఏ కోశాన**

**భారీగా బియ్యం నిల్వలు.. బహిరంగంగానే తరలింపులు**

**అంతా తెలిసినా అధికారుల మౌనానికి ఆంతర్యమేంటి ?**





**పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది. హుస్నాబాద్‌లో పీడీఎస్ బియ్యం దందా బహిరంగంగానే సాగుతున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి భారీగా నిల్వ చేయడంతో పాటు డీఫాల్ట్ మిల్లర్లకు తరలిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇంత దర్జాగా దందా సాగుతున్నా అధికార యంత్రాంగం మౌనంగా ఉండటంతో.. స్మగ్లర్లకు అధికారుల అండ ఉందా..? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.**

**హుస్నాబాద్, ఆగస్టు 12 (నినాదం):** హుస్నాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమార్కులు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, భారీ మొత్తంలో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడాన్ని అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు ముఠాలుగా ఏర్పడి గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలు, ఇతర



వాహనాల్లో తరలిస్తూ భారీగా నిల్వ చేస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

**డీఫాల్ట్ మిల్లర్లకే చేరుతోందా..?**

అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యం నేరుగా డీఫాల్ట్ మిల్లర్లకే చేరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే ఈ వ్యవహారం కేవలం చిన్నస్థాయి కొనుగోళ్లకే పరిమితం కాకుండా వ్యవస్థీకృత దందాగా సాగుతోందనే అనుమానాలకు బలం చేకూరుతోంది. ఎక్కడి నుంచి ఎంత బియ్యం సేకరిస్తున్నారు..? ఎవరికి తరలిస్తున్నారు..? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వ్యవహారం బయటపడే అవకాశముంది.

**అధికారులకు కనిపించడం లేదా..?**

బియ్యం కొనుగోళ్లు, తరలింపులు బహిరంగంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన యంత్రాంగానికి ఈ వ్యవహారం నిజంగానే తెలియదా..? లేక తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులు ఏమాత్రం భయం లేకుండా దందా సాగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో వారికి ఎవరి అండదండలు ఉన్నాయన్నదీ చర్చనీయాంశంగా మారింది. అధికారుల నిర్లక్ష్యమే స్మగ్లర్లకు ధైర్యాన్నిస్తోందా..? లేక తెరవెనుక మరేదైనా వ్యవహారం నడుస్తోందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భారీగా రేషన్ బియ్యం నిల్వలు..!**

అక్రమంగా బియ్యం కొనుగోలు చేస్తున్న వారి వద్ద భారీ మొత్తంలో నిల్వలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ నిల్వలు ఎక్కడ ఉన్నాయి..? ఎంత మొత్తంలో బియ్యం పోగు చేశారు..? అక్కడి నుంచి ఏయే ప్రాంతాలకు, మిల్లులకు తరలిస్తున్నారు..? అనే కోణంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడితే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

**ఉన్నతాధికారులు నిగ్గు తేల్చాలి**

పేదలకు అందాల్సిన ప్రభుత్వ బియ్యం అక్రమ వ్యాపారానికి సరుకుగా మారకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. హుస్నాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని అనుమానిత నిల్వ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది..? ఎక్కడికి వెళ్తోంది..? అనే పూర్తి రవాణా గొలుసును వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో ఈ దందాకు అధికార యంత్రాంగంలో ఎవరైనా సహకరిస్తున్నారనే ఆరోపణల్లో నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిల్వలు, రవాణాపై ఉక్కుపాదం మోపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా..? లేక హుస్నాబాద్‌లో పీడీఎస్ మాఫియా దందా ఇదే దర్జాతో కొనసాగుతుందా..? అన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.




## నాగర్‌కర్నూల్‌లో కలకలం

### విద్యార్థులపై ఉపాధ్యాయుడి వేధింపులు?

**ఆలస్యంగా వెలుగులోకి ఘటన**

**ఇద్దరు విద్యార్థులను వేధించినట్లు తల్లిదండ్రుల ఆరోపణ.**

**ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత కుటుంబ సభ్యులు**

**సంబంధిత ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగింపు.**

**సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 12 (నినాదం):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడనే ఆరోపణలు కలకలం రేపాయి. పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులను సదరు ఉపాధ్యాయుడు వేధించినట్లు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో విద్యార్థుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆరోపణల ప్రకారం.. రాత్రి వేళల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి వారి పక్కన పడుకోవడంతో పాటు అనుచితంగా ప్రవర్తించినట్లు విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణల వాస్తవికత అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. ఆరోపణలు వెలుగులోకి వచ్చిన అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి సంబంధిత ఉపాధ్యాయుడిని మూడు రోజుల క్రితమే విధుల నుంచి తొలగించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఘటనపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బాధిత విద్యార్థులకు అవసరమైన రక్షణ, భరోసా కల్పించడంతో పాటు గురుకుల పాఠశాలల్లో ఇటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని విద్యార్థుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

**ఆరోపణలు రాగానే తొలగించాం: ప్రధానోపాధ్యాయుడు**

ఈ వ్యవహారంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరణ ఇస్తూ.. విద్యార్థులు జరిగిన విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చిన సమయంలో తాను సెలవులో ఉన్నానని, అనంతరం విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఆరోపణల విషయం తెలిసిన వెంటనే సంబంధిత ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే తల్లిదండ్రులు లేదా పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## మిస్సింగ్ మేఘన..
## పిల్లపిల్ల పిల్ల సాంగ్ రిలీజ్



టాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమలో ప్రయోగాత్మక చిత్రాలతో పాటు సరికొత్త కథాంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తోన్న తాజా థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపి మూవీస్ మరియు కేడి / కో సంయుక్త బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తోన్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ కార్తీక హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు మరింత జోరందుకున్నాయి.



NINADAM CINEMA

## ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

**నటి సమంత**

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

## 4న వస్తోన్న క్రైం థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైం డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు.

## మళయాళంలోనూ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీ వసంత్



కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషీద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక-టు-బ్యాక పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇది గనుక అధికారికంగా ఖరారైతే రామ్ చరణ్ రుక్మిణీల ఫస్ట్ కాంబినేషన్‌గా ఇది సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయం.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787